


# శాస్త్రి

## వ్యాసావళి-2

కవితా ప్రశస్తి

894.8274
SAS

# కృష్ణశాస్త్రి

## వ్యాసావళి-2

## కవితా ప్రశస్తి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10369

సంపాదకులు :

బాలాంత్రపు నళినీకాంతరావు

బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

సహకారం :

పాలగుమ్మి విశ్వనాథం

బాలాంత్రపు రజనీకాంతరావు

కురుమెళ్ల వేంకటరావు

కె. వి. రమణారెడ్డి

నిడమర్తి నిర్మలా దేవి

పి. బి. శ్రీనివాస్

వెలమకన్ని సుబ్రహ్మణ్య శర్మ

వింజమూరి ప్రభాకరం

అవసరాల అనసూయా గిరి

వింజమూరి సీతాదేవి

బి. గోపాలం

పి. ఎస్. గోపాలకృష్ణ

పర్యవేక్షణ :

పాలగుమ్మి పద్మరాజు

ఎ. ఎస్. రామన్

AOWA102B119

# కృష్ణశాస్త్రి

## వ్యాసావళి-2

-కవితా ప్రశస్తి-

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No. 10369

రాజహంస ప్రచురణలు
9, జగదాంబాళ్ స్ట్రీట్, మద్రాసు-600 017

KRISHNA SASTRI'S ESSAYS - 2

**Kavita Prasasti**

© D. S. Sastri (Bujjai)

894.8274
SAS

*First Edition :*
February 1982

*Published by*
RAJAHAMSA PRACHURANALU,
9, Jagadambal Street, Madras - 17.

*Printed at*
STREE SEVA MANDIR PRESS
MADRAS - 17

*Cover Design :*
BUJJAI

*Cover Printing*
VIKRANTH SCREENS

Price :
Rs. 12-50

4

# విషయ క్రమం


| | |
|---|---|
| కృతజ్ఞత | vii |
| భూమిక | viii |
| ఆస్వాదానికి ఆహ్వానం | xiii |
| కవితా ప్రశస్తి | |
| సాహిత్యంలో శబ్దం | 1 |
| కాలజ్ఞానం: కావ్యదృష్టి | 7 |
| కరుణ | 14 |
| కవీ - ప్రజా | 21 |
| ప్రాక్పశ్చిమ సమ్మేళనం | 29 |
| మా ప్రణయలేఖల కథ | 38 |
| ఊర్వశి | 56 |
| ఏా గొప్పరచనా? | 64 |
| మహా కావ్యాలు ఎందుకు రావడం లేదంటే - | 72 |
| లిరిక్ శిల్పం | 80 |
| అవతారిక | 86 |
| కళ - జీవితము | 91 |
| అభ్యుదయ రచనోద్యమం | 97 |
| ప్రథమ యుద్ధానంతర ప్రపంచ సాహిత్యం | 102 |
| అనుబంధం: | |
| ఉదాహృత పద్యాదులకు ఆకరాలు. | 111 |


5

★

“మానవు లందరూ కలిసి సమాన హక్కులతో, సమాన భోగ భాగ్యాల కోసం ఒక కుటుంబం అయారు అన్నది తెలుసుకుని అనుభవించి తీరాలి. అసలు విడదీసి అంతరాలు ఏర్పరిచే అంతర భావమే అనాకారమైనదీ, ద్వేష పూరిత మయినదీని! అది పూర్తిగా నశించాలి!”

– సజీవ రచన

★

# కృతజ్ఞత

ఇంతవరకూ పుస్తక రూపంలో రాని మా నాన్న గారి రచనలు ఈ నాడు ఈ రూపంలో వస్తున్నా యంటే దానికి ముఖ్య కారకులు శ్రీ బాలాంత్రపు నళినీకాంతరావు గారు. సుమారు సంవత్సరన్నర క్రితం నేను వారి సహాయం అడగగానే సంతోషంగా ఈ పని చేపట్టారు. ఆ రోజు లగాయతూ ఈ రోజు వరకూ నిద్రాహారాలు లేకుండా, అక్కడా ఇక్కడా ఉన్న రచనలు చేర్చి, కూర్చి వాటికి ఈ రూపం ఇచ్చారు. వారికి నా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. వారి ఋణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను.

వారికి చేదోడు వాదోడుగా ఉంటున్న శ్రీ బొమ్మ కంటి శ్రీనివాసాచార్యులుగారికి కూడా నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాలకి తొలిపలుకు వ్రాసి ఇచ్చిన శ్రీశ్రీ గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

ముఖ్యంగా, ఈ పుస్తకాల అచ్చుకు ఆర్థిక సహాయం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి నా కృతజ్ఞతలు.

దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి

(బుజ్జాయి)

7

# భూమిక

కవిత్వంలో శబ్దం ప్రధానం. అందుకే - 'శబ్దార్థౌ కావ్యమ్' అన్న లక్షణాన్ని త్రోసి రాజని 'శబ్దః కావ్యమ్' (రమణీయార్థ ప్రతిపాదకః శబ్దః కావ్యమ్) అన్న లక్షణం సిద్ధాంతం అయింది. శాస్త్రశబ్దానికీ, కావ్య శబ్దానికీ ఉండే తేడాని శ్రీకృష్ణశాస్త్రి ఈ క్రింది ఉదాహరణలతో మనోహరంగా చెప్పారు (పుట 2):

| శాస్త్రశబ్దం : | కావ్యశబ్దం : |
|---|---|
| చంద్రుడు పొడిచినప్పుడు<br>కలువలు వికసిస్తాయి. | కలువ పూ బ్రదుకులో<br>వెన్నెల కనుమోడుస్తుంది. |
| ప్రియమైన వస్తువును చూచి<br>నప్పుడు హృదయం తొంద<br>రగా స్పందిస్తుంది. | ప్రియమైన వస్తువును చూసి<br>నప్పుడు శరీరం తలిరు తో<br>రణమై సుమదామ మవుతుంది. |
| 'అగ్ని కీల' | 'నర్తించే రక్త రసన' |
| 'ఆకులు' | 'ఆకులో ఆకునై' |
| చంద్ర గోళం | శివ శిరః పారిజాతం |
| భూగోళం | మాతృ వక్షం |

ప్రాచీనాలంకారికుల లాగ తన కవితా జిజ్ఞాసని కేవలం కావ్యం నాలుగు హద్దులమధ్య ఉండే అంశాలకే పరిమితం చేసుకోకుండా తమ కాలంలో కవితా జిజ్ఞాసువులను కలవర పెడుతున్న "కవి జీవన దర్శనం ఎలా ఉండాలి? సంప్రదాయానికీ, నవ్యతకీ సమన్వయం సాధించడం ఎలా? కవికీ, ప్రజలకీ మధ్య ఉండే సంబంధం ఎటువంటిది? ఏది అభ్యుదయం? అభ్యుదయ సాధనకి కవి ఎలా తోడ్పడగలడు?" లాంటి ముఖ్యమైన సమస్య లెన్నిటినో విడదీయ

డానికి 'కవి - విమర్శకుడు' (Poet critic) శ్రీకృష్ణశాస్త్రి ఈ వ్యాసాలలో ప్రయత్నించారు. అంత కంటె ముఖ్యంగా 'మా ప్రణయలేఖల కథ', 'ఊర్వశి', 'నా గొప్పరచన', 'లిరిక్ శిల్పం' లాంటి వ్యాసాలు-కృష్ణశాస్త్రి కవితా ప్రస్థాన లక్షణాన్ని వివరించేవి-ఈ సంపుటిలో మీరు చదువుతారు.

ఈ సంపుటంలో చవి చూడబోయే ఆస్వాదానికి వాచవి ఈ క్రింది వాక్యాలు :

"దృష్టిభేదం వల్ల, తన్మయత్వంవల్ల, అనుభవోదాత్తత వల్ల, సాహిత్యంలో శబ్దం వేరయి పోతుంది ; శక్తి అవుతుంది." - పుట 2

"వచన కావ్యానికీ, పద్యకావ్యానికీ ఉన్న తేడా గమన తీవ్రతే అంటాడు మిడిల్‌టన్ మర్రే ! - పుట 3

"కవిత్వం శబ్దరూపంలో ఉన్న గానం" – పుట 4

"ఆంధ్ర కవులలో తిక్కన ఎక్కువ సాధకుడైతే నన్నయ ఋషి. ఇతని శబ్దం గానం." — పుట 5

"కన్యాశుల్కం పద్య కావ్యంగా వ్రాయడం ఎలాగ ?" - పుట 6

"కావ్య కర్త లందరిలో కామెడీ వ్రాసేవాడే ఎక్కువ సాంఘిక జీవి !" — పుట 9

"నాకు కవి అంటే అలా సాక్షాత్కరిసాడు - పాటతో, పద్యముతో నిత్య పథికుడు లాగ !" — పుట 10

"బాధ వరం. బాధకి చాలా శక్తు లున్నాయి. బాధలో కాలిపోయే వాడు పాషాణం కాలేడు. వాడు నిలువునా నవనీతం!" - పుట 15

"వేదన వల్ల గాని ప్రేమ కలుగదు. ఈ రెండూ కలిస్తే కరుణ అవుతుంది." — పుట 16

"కన్నీళ్లలోనుంచి కావ్యం ఎలాగ జన్మించిందో కావ్యంవల్ల కన్నీరూ అలాగే పుడుతుంది." — పుట 18

"అశ్రువే సాగరమూ, అశ్రువే తరణీ కూడా !" - పుట 20

"సమాజం సముద్రం అయితే కవి కెరటం; లంక వంటివాడు మాత్రం కాదు." — పుట 21

"కవిత్వానికి కూడా పక్షికి లాగే ఆకాశయానం అవసరమే, గూడూ అవసరమే!" - పుట 94

"మానవుడు నిరాశ మీద బతకలేడు. నిరాశ సాహిత్యానికి వెలు గివ్వలేదు." — పుట 104

ఈ సంపుటంలోని 14 ప్రసంగ వ్యాసాలలోనూ 9 రేడియో ప్రసంగాలు; తక్కిన అయిదింట్లో రెండు - 'కరుణ', 'మా ప్రణయ లేఖల కథ' - పత్రికలలో వచ్చిన వ్యాసాలు. మిగిలిన మూడూ సభా ప్రసంగాల నివేదికలు. ఏలూరు నవ్యసాహిత్య పరిషత్తు అధ్యక్ష పీఠంనుంచి చేసిన ప్రసంగానికి 'దీపిక' ప్రకటించిన నివేదిక ఒకటీ, 1946 లో రాజమండ్రీలోనూ, 1976 లో మద్రాసులోనూ జరిగిన అభ్యుదయ రచయితల మహాసభల అధ్యక్ష స్థానంనుంచి చేసిన ప్రసంగాలు రెండూ !

ఈ సంపుటంలోని వ్యాసాల ముద్రణ పూర్తి అయిన తరువాత మిత్రులు శ్రీ. పి. ఎస్. గోపాలకృష్ణ (ఆకాశవాణి, మద్రాసు కేంద్రం) 'సజీవ రచన' అనే విషయం మీద 1948 లో 'సర్వధారి' ఉగాదినాడు మద్రాసు ఆకాశవాణి కేంద్రంవారు ప్రసారం చేసిన విద్వద్గోష్ఠిలో శ్రీ శాస్త్రిగారి ప్రసంగ భాగం 'వాణి' పత్రిక నుంచి కాపీచేసి మాకు ఇచ్చారు. శ్రీకృష్ణశాస్త్రి కవితా ప్రస్థానాధ్యయనానికి 'భూమిక' అనదగిన వారి ఆ ప్రసంగ భాగాన్ని ఈ దిగువను పొందుపరుస్తున్నాం. (ఆ గోష్ఠిలో శ్రీ శాస్త్రిగారితో పాటు కీ. శే. తలావఝ్ఝల శివశంకరస్వామి, వేటూరి ప్రభాకరశాస్త్రీ, జి.వి.

కృష్ణారావూ, గడియారం వేంకట శేషశాస్త్రీ, కొడవటిగంటి కుటుంబ రావూ, శ్రీయుతులు శ్రీ శ్రీ, నార్ల కూడా పాల్గొన్నారు. డా. బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్ష్యం వహించారు) :

"రచయిత చుట్టూ ఉన్న సమాజం జీవంతో నిండి ఉంది కదా? దానితో సంబంధం రచయితకి సృష్టించే జీవమూ ఇస్తుంది; ఆ సృష్టికీ జీవం ఇస్తుంది. ఎటొచ్చీ ఇప్పుడు ఆ సమాజం అంటే ఏ నలుగురో కాదు. దగ్గరగా వచ్చి చుట్టూ రచయితను పొదిగి పలికించినప్పుడు వచ్చే రచనలు ఎంత సజీవమైన రచనలేవా అవుతాయి. అనగా రచయితకు శాస్త్ర పరిచయం, కావ్య పరిశీలనం అక్కరలే దని కాదు.

"ఏ మనిషినీ ఎలాగ వెలెయ్యకూడదో, ఏ వస్తువునీ ఎలాగ వెలెయ్య కూడదో ఏ మాటనీ అలాగ వెలెయ్యకూడదు. ప్రతీ మాటకీ బోలెడంత పటిమ ఉంది. నన్నయ్యనుంచో, అంతకు ముందునుంచో ఇంతవరకూ, ముందూ ప్రతి తెనుగువాడూ వాడే ప్రతీ మాటా మనదే; మన కవసరమూను! ఎటొచ్చీ ఆ మాట ఉపయోగించే రచయిత మీద ఆధారపడి ఉంది. ఒకడి నోటిలోంచి వచ్చిన మాట ఒట్టి చచ్చు మాటే; ఒట్టి ముసలమ్మ; కాళ్లు చాపి చతికిలపడి, ఏమీ అనలేదు. మరొకడి నోటిలోనుంచి వచ్చిన మాట మనిషి; అది పలుకుతుంది, పలికిస్తుంది. కనుక ఏ పరిసరాల్లో ఏ పలుకు ఉపయోగిస్తే జీవం ఉట్టి పడుతుందో అది తెలుసుకుని ఉపయోగించడంలో ఉంది విశేషం. అంతా అలాగే! ఏ ఒక దానికీ మరొక పదం పర్యాయపదం కాదు. ఒక్కొక్క పదానికి ఒక్కొక్క రుచీ, రంగూ, వాసనా ఉన్నాయి. కనుక కేవలమూ నిఘంటువు చూసి వాడేవాడి మాట నిర్జీవంగా ఉండి, అనుకున్న పని చేయదు.

"భయములో నుంచి అసత్యం పుడుతుంది. అసత్యం ముసలీ, మృత్యువూను. కనుక అసత్యంలోనుంచి చైతన్యంతో ఊగిపోయే,

తూగిపోయే సృష్టి ఎలాగ వస్తుంది చెప్పండి? ఇంక - అసత్యం అనాకారంగా కూడా ఉంటుంది. అందుచేత అలా చూసీ చూడ్డంతో కృష్ణారావుగారి సౌందర్యమూ, ప్రభాకరశాస్త్రిగారి పర మార్థమూ, శివ శంకరస్వాముల శివమూ ఒకటే అవుతాయి. కనుక సత్యం తెలుసుకుని పలకడానికి రచయితకి భయం ఉండకూడదు. తూర్పు పడమర లనీ, హెచ్చూ తగ్గూ అనీ మానవుని విడదీసే భావం పూర్తిగా పోవాలి. మానవు లందరూ కలిసి సమాన హక్కు లతో, సమాన భోగ భాగ్యాల కోసం ఒక కుటుంబం అయారు అన్నది తెలుసుకుని అనుభవించి తీరాలి. అసలు విడదీసి అంతరాలు ఏర్ప రిచే అంతర భావమే అనాకారమైనదీ, ద్వేషపూరిత మయినదీని. అది పూర్తిగా నశించాలి!"

లేఖక ప్రమాదాలనూ, అర్థభంగం ఏర్పడుతున్న సందర్భాలనూ స్వల్పంగా సవరించడం తప్ప శ్రీ శాస్త్రిగారి రచనా శైలిని యథా తథంగా పాఠకులకు అందజేయడానికే మేము ప్రయత్నించాము.

ఆకాశవాణిలోనూ, సాహిత్య సభలలోనూ పారిజాత ప్రసవాల జల్లులాంటి మధురమైన ప్రసంగాలతో శ్రీ శాస్త్రిగారు తెలుగు దేశాన్ని కవిత్వపు కైపులో ముంచెత్తివేసిన ఆ రోజుల్లో కొన్ని అందమైన భావాలూ, వాక్యాలూ ఆయన ప్రసంగాల్లో తరుచు పునరావృత్తం అవుతూ ఉండేవి. అలాంటి పునరుక్తులు వీలయి నంతవరకూ పరిహరించబడినా, ప్రసంగ ధారకు భంగం వచ్చే కొద్ది సందర్భాలలో వాటిని యథాతథంగా వదలివేయవలసి వచ్చింది.

'కృష్ణశాస్త్రి సాహితి' ప్రచురణ మహాయజ్ఞంలో యథాశక్తి సేవ చేసే అవకాశం మాకు కలిగించిన 'రాజహంస' ప్రచురణల అధిపతి చిరంజీవి దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి (బుజ్జాయి)కి మేము కృతజ్ఞులం!

సంపాదకులు

# ఆస్వాదానికి ఆహ్వానం

ఇక్షు సముద్రం ఎక్కడుందో నాకు తెలియదు. కాని, అపాత మధుర మయిన కృష్ణశాస్త్రి సాహిత్యం సమస్తమూ ఇక్షు రసార్ణవమే. కృష్ణశాస్త్రి పలుకుల్లోని చెరుకు తీపి సాహిత్యరస పిపాసువులకు ఎక్కడో ఉందనుకొనే ఇక్షుసముద్రాన్ని వెదుక్కోవలసిన అగత్యాన్ని తొలగిస్తుంది.

అందుకే పురాణాల్లో పేర్కొన్న ఇక్షు సముద్రం ఎక్కడుంటుందో దాని జాగ్రఫీ జోలికి వెళ్లదలచుకోను నేను. మన యెదుట నిజంగా కృష్ణశాస్త్రి సాహిత్య సమస్తమూ ఉరకలూ పరుగులుగా ఉప్పొంగుతోంది. ఇదే అసలు సిసలయిన చెరుకు రసాల కడలి. ఆస్వాదించుదాం రండర్రా అని అందర్నీ ఆహ్వానిస్తున్నాను.

ఒకప్పుడు కృష్ణశాస్త్రి కవిత్వం మాత్రమే మాధుర్య 'మా' ధుర్య మనుకున్నాము. ఇప్పుడు మీ చేతిలో ఉన్న పుస్తకాన్ని చూడండి. ఇంకా అచ్చవుతున్న, లేదా అయి, సిద్ధంగా ఉన్న సంపుటాల్ని చూడండి. అప్పుడు మాధుర్యం అంటే ఏమిటో మీకే అర్థం అవుతుంది. అప్పుడు వాస్తవంగానే ఒక ఇక్షుసముద్రంలో మీరు ఓలలాడుతారు.

కాని, ఇక్కడో చిన్న విశేషం ఉంది. తినగ తినగ వేము తియ్యనుండు నేమో కాని అంతా చెరుకు రసమే అయితే మొగం మొత్తేస్తుంది. అందుకే కృష్ణశాస్త్రి చెరుకు

సముద్రంలో అక్క డక్కడ మిరియాల పొడి ఉంది. కరక్కాయల కసటుదనం ఉంది. ఇంకా మీరు కోరుకొనే ఎన్నెన్నో మసాలా లున్నాయి.

ఇప్పుడు నా మనస్సు 50 సంవత్సరాల వెనక్కి పోతోంది. 1920 ల ప్రారంభ దినా లవి. ఆ రోజుల్లోనే జమీందారీ కవిత్వాన్ని తోసి రా జని భావకవిత్వం రంగ ప్రవేశం చేసింది. 1910 - 20 ల మధ్య ఈ ఉద్య మాన్ని ప్రారంభించిన వారు రాయప్రోలు, అబ్బూరి. అయితే దీనికి 20 లలో అఖిలాంధ్ర ప్రాచుర్యం ఇచ్చిన వాడు కృష్ణశాస్త్రి. బరంపురం నుంచి బళ్ళారి దాకా ఈయన తనవీ, ఇతరులవీ భావగీతాల కవితాగానం చేస్తూ యువతరాన్ని ఆకట్టుకున్నాడు.

అయితే కృష్ణశాస్త్రిది ప్రతిఘటన లేని విజయయాత్ర కాదు. మహాపండితు డయిన అక్కిరాజు ఉమాకాన్తమ్ "నేటి కాలపు కవిత్వం" అనే పుస్తకం రాసి, అందులో ఎక్కువ భాగం కృష్ణశాస్త్రినే వెక్కిరించాడు. ఉమా కాన్తమ్ (సంస్కృతపు స్పెల్లింగు చూడండి!) గారికి సంస్కృతంలో తప్ప మరెక్కడా కవిత్వం కనబడదు. నన్నయభట్టును కూడా ఆయన కవిగా ఖాతరు చెయ్య లేదు. నేటి కాలం కవిత్వానికి కాలం కా దనేశా డాయన.

కాని, ప్రపంచం మాత్రం వేరు విధంగా భావించింది. భావకవిత్వాన్ని ఆ నాటి ప్రధాన శాఖగా గుర్తించింది. ఈ శాఖ ఎన్నో కోకిలలకు ఆశ్రయం ఇచ్చింది. (గౌతమీ కోకిలగా పేరు పొందిన వేదుల సత్యనారాయణ శాస్త్రిని

ఇక్కడో చిన్న ఉదాహరణగా ఉటంకించ వచ్చును.) ఈ అన్ని కోయిలల్లో అగ్రస్థానం సాహిత్య విమర్శకు లంతా కృష్ణశాస్త్రిదే అని అంగీకరించారు.

"నేటి కాలపు కవిత్వం" ఇప్పుడు లైబ్రరీలలో బూజు పట్టిపోతోంది. కృష్ణశాస్త్రి కవిత్వం భావకవితకు పరా కాష్ఠగా నిలబడింది.

అనంత పంతుల రామలింగ స్వామి అనే ఆయన "కృష్ణ పక్షం" కావ్య సంపుటిని వేళాకోళం చేస్తున్నా ననుకుంటూ "శుక్లపక్షం" అనే రాతని వెలువరించాడు. దాన్ని కూడా ఇప్పుడు చదివే వా ళ్లెవరూ లేరు. ఆ రోజుల్లోనే దాన్ని వేదుల "ఈ శుక్లపక్షం సారస్వతారిష్టం అనే శుక్లనష్టం" అని చెప్పి సహృదయుల హృదయ ఫలకాల నుంచి తుడిచిపెట్టి పారేశాడు.

1930 లలో భావకవిత్వం మీద తిరుగు బాటుగా అభ్యుదయ కవిత్వం వచ్చింది. కాలంతో పాటు ఎదుగు తున్న కృష్ణశాస్త్రి అభ్యుదయ కవిత్వాన్ని ఆహ్వానించి ఆశీర్వదించాడు. అంతే కాదు. అభ్యుదయ రచయితల సంఘం వార్షికోత్సవాలలో ఒకదానికి అధ్యక్షత వహించాడు.

సినీమా రంగంలో ప్రవేశించి, మళ్లీ ఇలాంటిది రావడానికి వీల్లే దన్నట్టుగా మల్లీశ్వరి రాశాడు.

ఈ మధ్య కాలంలో ఆయన యెన్నో రేడియో నాటకాలు రాశాడు. రేడియో ప్రసంగాలు చేశాడు.

ఆ తర్వాత ఆయన గొంతుక పోయింది. కాగితాలమీద (చిన్న చిన్న నోటుబుక్కుల మీద) అక్షరాలు రాస్తూనే, తన దగ్గరకు వచ్చిన అందరితోనూ ప్రసంగించాడు. ఎన్నో ట్రంకు పెట్టెల నిండా ఈ నోటుబుక్కు లున్నా యని బుజ్జాయి (కృష్ణశాస్త్రిగారబ్బాయి) నాతో చెప్పాడు.

ఒక దానిలో కృష్ణశాస్త్రిగారు నామీద ఇలా రాశా రట: "శ్రీ శ్రీ గొప్పకవి. అతని మీద ఈగ వాలినా నేను సహించలేను" అని !

నా మీద వారి కెప్పుడూ సదభిప్రాయమే ఉంది. మరి వారి మీద నాకు వల్లమాలినంత అభిమానం. నా మనస్సు మీద చెరగని ముద్రలు వేసిన ముఖ్యాతి ముఖ్యులలో కృష్ణశాస్త్రిని ప్రముఖంగా పేర్కొంటాను.

వారి మీద నా కున్న అభిమానం, అపేక్ష వారి యీ గ్రంథ సంపుటాలకు గాను ఈ రాత రాయడానికి ప్రేరే పించాయి. మరో మారు చెబుతున్నాను. ఇది ఇక్షు సముద్రం. "అందరం ఆస్వాదించుదాం, రం" డని ఆహ్వానిస్తున్నాను.

మద్రాసు,
29-11-81

శ్రీ శ్రీ

1

# సాహిత్యంలో శబ్దం

సమరసీకృతములైన శబ్దార్థాలు కలది సాహిత్యం అన్నారు. శబ్దం శక్తి అనిన్నీ, అర్థం ఈశ్వరు డనిన్నీ కాళిదాసు విశదం చేశాడు కదా! "శబ్దార్థౌ కావ్యం".

ఇక శబ్దమే కావ్య మన్న వాళ్లూ ఉన్నారు. "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అని పండిత రాయలు అంటున్నాడు. శబ్దమే పక్షాలు తొడుగుకొన్నప్పుడు కావ్యాన్ని కల్పిస్తుం దని ఒక ఆంగ్లకవి చాటాడు. అందంగా అమర్చబడిన భాషే కావ్య మని మైకేల్ అనే కవిత్వ తత్త్వవేది అన్నాడు. వివిధ మైన సృష్టి అయినా శక్తి అధీనం కాబట్టిన్నీ, కవితా సృష్టికి కూడా శబ్దమే మూలకారణం కాబట్టిన్నీ 'వీ రందరూ ఇలాగ అనడం ఉచితంగా తోస్తుంది.

శాస్త్ర గ్రంథాలు సాహిత్యంలోకి రావు. వాటిలో శబ్దాన్ని ఒక చిహ్నంగా ఉపయోగిస్తారు. సాహిత్యంలో శబ్దం భావ స్ఫోరకమున్నూ, ఆవేశ వశమున్నూ. శాస్త్రం తటస్థం. శాస్త్రానికి పక్షపాతం లేదు. శాస్త్రం ప్రకటించే సత్యం అందరికీ ఎల్లప్పుడూ ఒకటే! దానిని స్పష్టంగా తూచినట్టూ, వాడూ వీడూ అందరూ

చూచినట్టూ, ఒక ధ్వని గాని ఆవేశం గాని లేకుండా జాగ్రత్తగా చెప్పాలి. 'చంద్రుడు పొడిచినప్పుడు కలువలు వికసిస్తాయి' అని శాస్త్రకారుడు అంటాడు. 'కలువపూ బ్రతుకులో వెన్నెల కను మోడ్చిం' దంటాడు కావ్యకర్త. ప్రియ మైన వస్తువును చూచినప్పుడు హృదయం తొందరగా స్పందిస్తుం దంటాడు శాస్త్రకారుడు. నీ వార్త విన్నప్పుడు నా శరీరం "తలిరు తోరణమై, సుమ దామ మాయె" అంటాడు కావ్యకర్త. అగ్నికీలను అగ్నికీల అనే అంటాడు శాస్త్రకారుడు. నర్తించే రక్త రసన అంటాడు కావ్యకర్త. అవి ఆకులే అంటాడు శాస్త్రజ్ఞుడు. ఆకులో ఆకు నైనాను అంటాడు కావ్యకర్త. చంద్రగోళం అంటాడు ఒకడు; శివ శిరః పారిజాతం అంటాడు వేరొకడు. భూగోళం అంటాడు ఒకడు; మాతృ వక్షం అంటాడు వేరొకడు. దృష్టి భేదం వల్ల తన్మయత్వం వల్ల అనుభ వోదాత్తత వల్ల సాహిత్యంలో శబ్దం వే రయి పోతుంది, శక్తి అవుతుంది.

ఇక్కడ ఒక్కమాట: శాస్త్రకారుడు అందరికీ చెందే సత్యాన్నే చెపుతా డన్నప్పుడు కావ్యకర్త సత్యం విశ్వజనీన మయింది కాదు అని కాదు. కావ్యకర్తకు సాక్షాత్కరించిన దృశ్యం అందరికీ చెందనిది అనీ కాదు. ఎవ్వ రైనా సరే అందుకో వీలున్న దనిన్నీ, అందరూ అందుకో దగిన దనిన్నీ. కాని శాస్త్ర సత్యం లాగ అది ఎందుకు సర్వసామాన్య మైనది కాదని అంటా మంటే, దానిని ఒక ప్రత్యేక వ్యక్తి ప్రత్యేక పరిస్థితులలోనే చూడగలిగాడు కాబట్టిన్నీ, శాస్త్ర సత్య మంత సులభంగా అందరికీ అది అందుబాటులోకి రాదు కాబట్టిన్నీ.

ఇంకో విశేషం: నిజమైనది ప్రతీదిన్నీ శాస్త్ర వస్తువు అనిన్నీ, సార్థక మైనది మాత్రమే సాహిత్యానికి గ్రాహ్యమైన వస్తువు అనిన్నీ రవీంద్రుడు అన్నాడు. అంటూ, ఏ వస్తు వైనా ఒక్కొక్కప్పుడు

సార్థకమై కావ్యవస్తువు కావచ్చు ననిన్నీ అన్నాడు. కనుక శబ్ద ప్రయోగం కూడా మారి సాహిత్యంలో సార్థకం కాదూ? బజారు ధరలను గురించీ, ఎన్నిక ఫలితాలను గురించీ చెప్పడానికి మామూలు పద్ధతిలో మామూలు మాటలు చాలు. సామాన్యవార్తలు సామాన్యంగా చెపుతాం. యుద్ధవార్తలు ఊగే భాషలో చెపుతాం. స్టాలిన్‌గ్రాడ్ రక్షణ సార్థక మై సాహిత్య వస్తు వైపోయింది. దానిని గూర్చి చప్పగా ఎలా చెప్పగలం?

ఇంక సాహిత్యంలో, నవలలూ కథలూ వంటి వచన కావ్యాలూ ఉన్నాయి. నాటకాల వంటి గద్య పద్యాలు కలిసినకావ్యా లున్నాయి. కేవలం పద్య కావ్యా లున్నాయి. వాటిలో మళ్లీ భావగీతాలు, మహా కావ్యాలు వంటివి రక రకాలు ఉన్నాయి. వీటిలో శబ్ద ప్రయోగం వేరు వేరుగా ఉంటుంది.

సాధారణంగా వచన కావ్యంలో బుద్ధి సూక్ష్మత ప్రధానం. వివేచన, విమర్శన, సమాలోచన, సహేతుకత ఎక్కువగా ఉంటాయి. దాని రచనలో చెప్పదలచినది సూటిగా, స్పష్టంగా, సరిగ్గా చెప్పడమే రచయిత ఉద్దేశం. అయినా దీనిలో శబ్దం, శాస్త్రగ్రంథంలో శబ్దం వంటిది గాదు. ఇక్కడ కూడా శబ్దం శక్తే, సృష్టించేదే! కాని కవిత్వంలో శబ్దం పలకడమే కాదు - పాడుతుంది. నడవడమే కాదు, ఎగురుతుంది. కవిత్వంలో స్ఫురణ ఎక్కువ, ఆవేగం ఎక్కువ. కవిత్వంలో శబ్దం కిటికీ వంటిది. దానిలోనుంచి, వెనకాల ఉన్న దూరలోకాలూ, గగనఖండాలూ, తోపులూ, తోటలూ కనబడతాయి. వచన కావ్యానికీ, పద్య కావ్యానికీ ఉన్న తేడా గమన తీవ్రతే అంటాడు - మిడిల్‌టన్ మర్రే. ఈ గమన తీవ్రత సాధించడానికే పద్య నిర్మాణంలో శబ్దాలను మరీ సార్థకంగా ఏరడం, మరీ బిగువుగా చేర్చడం, వింత వింతఛందస్సులలో కూర్చడమున్నూ. భావగీతం వంటి పద్యకావ్యం దగ్గిరికి వెళ్లేటప్పటికి శబ్దం పాటే

అయిపోతుంది. "కవిత్వం శబ్దరూపంలో ఉన్న గానం" అని దీనినే అన్నాడు కార్‌లైల్. అందుకనే ఉన్నతోన్నత మైన మహా కావ్యాన్ని పాడారు - వాల్మీకి రామాయణంలాగ; హోమరు ఒడిస్సీ లాగ. ఎంచేతంటే ఆ మహాకావ్యాలకీ దివ్య గానానికీ మధ్య సరిహద్దు లేదు.

ఇక్కడ ఒక్క మాట : మహాకవి అయిన తిక్కన ఎక్కువగా గొప్ప కథకుడు; మరీ ఎక్కువగా గొప్ప నాటక కర్త. ఇతనిలో శబ్ద ప్రయోగం ఎంత చిత్రంగా అవసరాన్నిబట్టి మారుతుందో చూడండి. రాయబారం పంపుతూ ధర్మరాజు శ్రీకృష్ణభగవానునితో అంటున్నాడు :

"పగ యడగించు టెంతయు శుభం; బది లెస్స; అడంగునే పగన్
పగ? పగ గొన్న మార్కొనక పల్కక యుండగ వచ్చునే; కడున్
తెగ మొద లెత్తిపోవ పగ దీర్పగ వచ్చిన క్రౌర్య మొందు; ఏ
మి గతి తలంచినన్ పగకు మేలిమి లేమి ధ్రువంబు కేశవా!"

దీనిలోవి అన్నీ సామాన్య శబ్దాలు. తూచి ఏరి ఉచితంగా వేసినవి. చెప్ప వలసింది సరిగ్గా స్పష్టంగా చెప్పాలి - అంతే! కనుక దీనిని మంచి వచనంలోనూ వ్రాయవచ్చు.

కవిబ్రహ్మది ఈ పద్యం వినండి :

భవ దాజ్ఞా దృఢ బంధ సంయమిత శుంభ ద్వేగపై గాక, వా
డవలీలన్ మన అర్జున ద్విపము క్రోధావేశ దుర్దాంత ద
ర్ప విలాసోద్భట భంగి ఏ పడరి, కౌరవ్యాంబుజ శ్రేణి చి
క్కువడం జేయదె? ఒక్క వ్రేల్మిడిన నీకున్ వేడ్క సంధిల్ల గాన్!

దీనిలో శబ్ద మెలా ఉదాత్త మయిందో, సంగీత మయిందో, సాలంకార మయిందో విన్నారా? ఇది కేవలం కవిత్వం.

దుర్యోధనునితోనో కర్ణునితోనో శల్యు డంటాడు - మహాయుద్ధానికి పూర్వం: "గాండివ జ్యా నినాదమ్ము క్రమ్మి కర్ణ విదళనము చేసిన" నీకు బుద్ధి వస్తుంది అని. కర్ణ విదళన మంటే చెవులను బ్రద్దలు కొట్టడమా? కర్ణుణ్ణి చీల్చడమా? ఒక్కసారి కౌరవ లోకంమీద రక్తధూళులు క్రమ్మి అ పైన విషాద మేఘాలు క్రమ్ముకున్న ట్టవుతుంది. ఆ శబ్దానికి ఇక్కడ ఎంత పటిమ ఉంది!

అయినా దీనినీ చురుకుగా వచనంలో వ్రాయవచ్చు.

ఇంకో విశేషం: ఒక్క శబ్దమే ఒక కవి నోట ఒక లాగు పలుకుతుంది; మ రొక కవి నోట మ రొకలాగు పలుకుతుంది. ఒక రాగమే ఎన్ని కంఠ స్వరాలలోనో పడి ఎన్ని బాణీలుగానో విడి, కొత్త కొత్త లైనట్లు!

ఒక్కొక్కనికి శబ్దం ఎప్పుడూ ఒక పరిపూర్ణతతో, నిండుతనంతో వస్తుం దనిన్నీ, కాళిదాసు అటువంటి వారిలో ప్రథము డనిన్నీ, ఒక్కొక్కచోట శబ్దం అఖండ చైతన్యంతో, శక్తితో వచ్చి మంత్రం లాగే అవుతుం దనిన్నీ శ్రీ అరవిందులు అన్నారు. ఆంధ్ర కవులలో తిక్కన ఎక్కువ సాధకు డైతే, నన్నయ్య రుషి. ఇతని శబ్దం గానం. నన్నయ్య భారతం పాడవలసింది. దీనిలో ఒక్కొక్క శబ్దం తీసుకుని, బ్రద్దలుకొట్టి, ఉచితమా, అనుచితమా అని విచక్షణ చేయ లేము. నన్నయ్య కొన్ని శబ్దాలను చూశాడు, కొన్ని విన్నాడు. కొన్ని శబ్దాలు వన్నె వన్నెలుగా కనపడతాయి. కొన్ని రాగమయంగా వినబడతాయి.

రుషు లైన కొందరి కవుల రచనలు మహామంత్రాల వలె శక్తి మంతము లౌతా యని తత్త్వజ్ఞు లంటారు.

ఇక్కడ షేక్స్‌పియర్ పద్యాలను గూర్చి మ్రే అన్నమాటలు జ్ఞాపకం వస్తాయి. "షేక్స్‌పియర్ సోనెట్సు వచనంలో వ్రాయడం ఎలాగ? షేక్స్‌పియర్ వ్రాసిన కొన్ని నాటకాలు వచనగ్రంథాలుగా

రచించవచ్చు. హేమ్‌లెట్‌ను అయినా గొప్పనవలగా రచించవచ్చు నని నేను భావించుకో గలను; కాని అతని సోనెట్సును అలాగ వ్రాయలేం!'' అని. ఇక్కడే కామెడీని గాని, సెటైర్‌ని గాని వచనంలో వ్రాయడం ఉచితం అంటాడు. కావ్యకర్త లందరిలో కామెడీ వ్రాసేవాడే ఎక్కువ సాంఘికజీవి. అంటే సమాజ జీవిత లక్ష్యాన్ని వ్యక్తపరచడం, దానినుండి దూర మయ్యే మానవుని విలక్షణతా, వికృతీ నిరూపించడం వాని పని. దీనికి ఉచిత మైన భాష తూచి చెప్పే దై ఉండాలి. అది వచనమే, వ్యావహారిక భాషే కూడా అయి ఉండాలి! 'కన్యాశుల్కం' పద్యకావ్యంగా వ్రాయడ మెలాగ ?

---రేడియో ద్వారా ప్రసారితం.

# కాలజ్ఞానం: కావ్యదృష్టి

ఎప్పుడు బయలుదేరాడో ఎక్కడ బయలుదేరాడోగాని! ఎక్కడికి వెడతాడో కూడా తెలియదు. వస్త్రాలూ, శరీరమూ వన్నెవన్నెల ధూళితో కప్పబడి ఉన్నాయి. చాలాకాలంనుంచీ ప్రయాణం చేసి ఉండాలి. ఇంకా అతగాడు చాలాదూరం ప్రయాణం చేయవలసి ఉంది. మధ్య మధ్య కొండ లెక్కి ఉండాలి. కోనల్లో నడిచి ఉండాలి. లోతు లోయల్లోకి దిగి ఉండాలి. ఇకముందు కూడా ఇన్ని రకాలు గానూ ప్రయాణం చెయ్యాలి. అయితే అతని కళ్లల్లో దిగులు లేదు. పెదవుల అంచులు నిరాశవల్ల క్రిందికి ఒరగ లేదు. నడకల్లో అనుమానమూ, అలసటా ఏమీ లేవు.

అతని భుజం మీద ఒక మూట ఉంది. చిత్రం ఏమి టంటే, బయలుదేరినప్పటి నుంచీ ఆ మూటను వస్తువులతో నింపుతూనే ఉన్నాడు. కాని అది బరు వెక్కదు సరికదా, అతని ప్రయాణానికి అనుకూలంగా సాయపడుతుంది. మరి ఆ మూటలో ఏ మున్నాయో - వెలుగులూ, వాసనలూ, తేనెలూ, నవ్వులూ, నిట్టూర్పులూ, రుస రుసలూ, గుసగుసలూ. ఇక ఎప్పటి కప్పుడు దొరికిన వస్తువులతో దానిని నింపుతుంటాడు కూడాను. అంతే కాకుండా ఎప్పటి కప్పుడు

దానిలోనుంచి సరుకు తీసి పద పదానికీ నాలుగు పక్కలా విసురు తుంటాడు కూడాను!

తోవలో ప్రతివస్తువునీ ఆగి పరిశీలిస్తాడు కూడాను. పరిశీలించి పలకరిస్తాడు. పలకరించి, కష్ట సుఖాలు తెలుసుకుని ఆశా, బలమూ, దారీ, తెన్నూ దొరికేటట్టు వార్తలు చెప్పి వెళ్లిపోతుంటాడు.

రాత్రిళ్లు ప్రయాణం చేస్తాడు. తోవ తప్పడు సరి కదా, తాను దారంట పాడుతూ పోతూ మిగిలిన బాటసారులకి ఆ పాట స్పష్ట మైన దారిలాగ ముందుకు పరచుకునేటట్లు చేస్తాడు. పగళ్లు ప్రయాణం చేస్తాడు. అప్పుడు కూడా, ఎవర్నీ వెనక్కి పోకుండా, మార్గంలో చదికిలబడకుండా, యథాయథలుగా అయిపోకుండా, ముందుకే, ఎప్పుడూ ముందుకే తాను పోయే దారంట అందర్నీ మరలిస్తాడు. రాత్రి కూడా అతని కళ్లల్లో ప్రభాతాలు ఉంటాయి. నేలమీద నడుస్తున్నా అతని కాళ్లకి పక్షా లుంటాయి.

అతనికి ఆరు రుతువులూ కూడా బాగా తెలుసు. ఉదయానికీ, సాయంకాలానికీ, రాత్రికీ సరిపోయే పాటలు అతనికి ఎలాగ వచ్చునో, అలాగే ఆరు కాలాలకీ అనుకూలించే గీతాలు అతనికి వచ్చును. పాడింది మాత్రం పాడడు. అలా గెలా పాడతాడు మరి? ఏ నిముషాని కా నిముషం స్థలమూ మారిపోతూ ఉంటే! సమయమూ మారిపోతూ ఉంటే! పలకరించవలసిన వాళ్లూ మారి పోతూ ఉంటే!

"ఎవరు నువ్వు నాయనా! అలా తల వంచుకుని ధూళిలో కూర్చుని దుఃఖిస్తున్నావు? భార్యా వియోగివా? చాలులే. ఇంక చాలులే. ఇదిగో నీ హృదయంలో వేదన నాకు తెలుసు. అదే కాదూ ఈ పాటలో మరుగుతూంది! అవును. నీవంటివా ళ్లెందరూ? వాళ్ల నందర్నీ ఊరుకో బెడదాం. రా! మనకి బోలెడు ప నుంది.

నలుగురూ మనల్ని ఇలాగ కూర్చో నియ్యరు. కూర్చో నియ్య కూడదు కూడా !" అంటాడు ఈ బాటసారి.

మరి నాలు గడుగులు వేస్తాడు. "ముసలమ్మా ! నువ్వా ? పాపం. నీకు ఒక్కడే కొడుకు. అవునా ? పాపం - కాటకంలో పోయాడా ? యుద్ధంలో పోయాడా ? నీకే కాదు సుమీ ఈ బాధ. నీ బాధ నా బాధ కూడాను. ఉండనీయను తల్లీ ! ఇక కరువులూ, హింసలూ ఉండనీయను. విన్నావా ? నే నే మంటున్నానో ఈ గీతంలో ? ఇది విని ఎవ రూరుకోగలరు - అన్యాయాలు జరుగుతూంటే ?"

మరి రెం డడుగులు జరుగుతాడు బాటసారి. కొత్త పెళ్లికూతుర్ని చూస్తాడు. ఉల్లాసంగా కూనరాగాలు తీస్తాడు. పీడకల కంటున్న చెట్టుని చూస్తాడు. అరరే అంటాడు. మేకల్నీ, మనుష్యుల్లో మేకల్నీ, తోడేళ్లనీ, మనుష్యుల్లో తోడేళ్లనీ చూస్తాడు. ఒకర్ని ఆదరిస్తాడు. ఒకరిపై ఆగ్రహిస్తాడు. తోవలో ఒకరికి హెచ్చరిక అవుతాడు. ఒకరికి ఎగతాళి అవుతాడు. ఊరడింపు అవుతాడు. ఆలింగనం అవుతాడు. అశనిపాతం అవుతాడు.

ఇంతలో ఒక రాజు కనిపిస్తాడు. ఒక మూటా, గొడలీ అతడి చేతి కిచ్చి, 'రా, మాతో రా !' అంటాడు. వెనక ఎప్పుడో ఆ రాజుకి గురువై ఉపదేశాలు ఇచ్చాడు. తరువాత ఆ రాజుకి నేస్తమై ఆనంద సమయాల్లో పాటలు పాడాడు. తరువాత, పాపం, ఆ బాటసారే రాజుకి కొలువు చేశాడు. ఇప్పుడు ఇలాగ అతన్ని నలుగురిలో కలిపి వేసి అనుచరుణ్ణి చేసుకున్నాడు.

వెనక మనవాడు వెనకాల పదిమంది గుంపు కూడగట్టుకునే వాడు. ఇప్పుడు ఎంత దూరంనుంచో, నాలుగు మూలలనుంచీ అతని గొంతు విని వేలమంది గుంపులు గుంపులుగా వెనక

వస్తూంటారు. మరి మన మామూలు మార్గానికి చివర గమ్యస్థానం ఒక ఇల్లు ఉంటుంది. ఇతని మార్గం చివర కడపల లేదు. తోవలో ఎక్కడి కక్కడే స్వగృహం ఉన్నట్లు ఆనందిస్తాడు.

అన్నిటికన్నా గొప్ప - అతని కలసట లేదు, నిద్ర లేదు. ఎప్పటి కప్పుడు అప్పుడే మేలుకొన్నట్లు ఉంటాడు. ప్రభాత సమయంలో లాగ ఆనందంతో, చైతన్యంతో నిండి ఉంటాడు. ఆ జాగ్ర దవస్థలో అతడు కొత్త పువ్వు లంత పడుచుగా ఉంటాడు, పాత పర్వతా లంత పరువంగా ఉంటాడు.

ఎడ తెగని ఆ దారంట అతగాడు అలాగే నడిచిపోతూ ఉంటే వీడుల్లోనూ, వాడల్లోనూ, పంట చేలల్లోనూ, ఫేక్టరీలలోనూ, మసనాలలోనూ, మంత్రాంగాలలోనూ పనిచేసే వాళ్లూ, పలవించే వాళ్లూ "అదిగో! అలా మన కవి వెడుతున్న ట్లున్నాడు!" అని ఇట్టే తలెత్తి ఒకసారి తల పంకించి తమ పనిపాటులకు ప్రోత్సాహం కోసం తామే పాడుకుంటున్నట్లు సంతోషిస్తూ రెట్టింపు బలంతో కార్యోత్సవంలో పడిపోతారు.

నాకు కవి అంటే అలా సాక్షాత్కరిస్తాడు - "పాటతో, పదముతో నిత్యపథికుడు" లాగ. పూర్వకాలం మాత్రమే ఉన్నవాడు కదలడం లేదు. వెనక్కి తిరిగి చూస్తూ నడక సాగక చీకటి గోతుల్లో, ముళ్ల కంచెల్లో పడి మాటలూ, నడకలూ మరిచిపోయి, మెల్లగా మూక బధి రాంధపు గుంపుల్లో కలిసిపోయి ఒక్కడూ ఉండిపోతాడు. మరి ఇప్పుడే ఇక్కడే ఉండిపోతా నని చదికిల బడ్డవానిమీద పుట్టలు మొలిచి చెద పురుగులు పడతాయే గాని, ఆ కవి మాత్రం వాల్మీకి కాడు.

ఈ దారి ఎక్కడికి పోతుందీ అంటే "యాభై ఏళ్లనుంచీ చూస్తున్నాను, ఇక్కడే ఉంది!" అని తెలివి తేటలు చూపించి

ఒక ఆసామీ అన్నాడు. అలా అన్నవాడి కంటె ప్రశ్నించిన వాడికే ఎక్కువ తెలివి తేట లున్నాయి. దారి నడవ దనుకుంటున్నా రేమో! నడక రాని దారిగాను, జడమగు రహదారిగాను ఉన్నది ఒప్పు కోడు కవి. నడిచే వాడితో దారి నడుస్తుంది. ముందుకి నడిచే వాడితో ముందుకి నడుస్తుంది. నువ్వు వెనక్కి నడుస్తానంటే ఎదురు తిరిగి గిలగిలలాడి ఎంత ఇబ్బందేనా పెడుతుంది. దారికి జెర్రికి లాగ ఒంటి నిండా కాళ్లే. దారీ, బాటసారీ, కాలమూ, లోకమూ ఒకటే - స్తిమితంగా ఉండవు. ఎప్పుడూ ప్రయాణం చేస్తూ, ముందుకే ప్రయాణం చేస్తూ, కవీ, అనంతయాత్రా మార్గమూ అలా కలిసిపోయి, పోతూ ఉంటారు.

ఎప్పటి కప్పుడే, ఎక్కడి కక్కడే కవి ఒక రిజర్వాయరులా ఉంటాడు. ఇంకి పోగా, ఖర్చయి పోగా మిగిలిన ప్రవాహంలాగ పూర్వకాలం అతనిలో పడుతుంది. ఎప్పటి కప్పుడు ఎక్కడి కక్కడ పైనుంచి వర్షాలూ పడతాయి. అతనిలో నుంచి భవిష్యత్తులోకి ఒక ప్రవాహం ప్రవహించి పోతుంది. ఎక్కడి కక్కడే మూడు కాలాల ముడిలాగ కనపడతాడు కవి.

కనుక కవి కాలజ్ఞుడు. ఈ కాలజ్ఞత్వం వల్ల అతనికి కాలంలో పరుగెత్తుతూ మారుతూ వచ్చే లోకంతో అత్యంత సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. అను నిమిషమూ తాను పలకరించి, తనను పలకరించే ఈ జీవజగత్తు ఒడుపుగా, మెలకువగా పరిశీలించి దానిలో నుంచి జీవం తీసుకుని తనలో నిండుగా పోసుకోకపోతే కవి నోరు విప్పనే లేడు; సృష్టించనే లేడు. మట్టిబొమ్మలు చేసి ఊరుకుంటాడు. లేకపోతే మన మెరగని మూర్తులు మంచుతెరల వెనకాల మసక మసకగా ఉంచుతాడు.

ఇప్పుడు ఈ లోకంలో ఒక కవి ఉన్నా డనుకోండి. అతని ప్రకృతీ, పరికరాలూ, చదువూ, సంస్కృతీ - అన్నింటితో

ఒక వ్యక్తిగా - పెర్సనాలిటీగా - అతడు తయారవుతాడు. వ్యక్తి కాలజ్ఞతతో, మెలకువతో ఈ లోకంలో నిలిచి ఉంటే, ఒక ఆంగ్లవేత్త చెప్పినట్లు, ఆ వ్యక్తిత్వం ఒక ధోరణిలో పడి ఎప్పటి కప్పుడే కొంత నశించిపోయి కొత్తగా మారుతూ ఉంటుంది.

... ... ...

ఇలాగ మూడు కాలాల ముడియై కాలం యొక్క ఏకత గ్రహించిన కవికి లోకం యొక్క ఏకత సాక్షాత్కరించి అతని హృదయం విశ్వ మంత విశాలం అవుతుంది. నవనీతం అంత ఆర్ద్రమూ అవుతుంది. దానిలో అనురాగానికే గాని చోటు లేదు. అతని హృదయంలోకి లోకంలో వస్తువు లన్నీ పరుగెత్తుకుని వచ్చి ప్రవేశించి, సమాన గౌరవమూ, ఆదరణా పొందుతాయి. అతని ఆ హృదయంలో ఒక మహా సమ్మేళనం జరుగుతుంది. అప్పుడు ఆ హృదయం కరుణార్ద్ర మవుతుంది. అది ఇంక లోకంలో అనాకారం, అసత్యం, అమంగళం ఎలాగ చూసి సహిస్తుంది? యుగాలు చూసివచ్చిన కవికి, లోకం నాలుగు పక్కలా చూసిన కవికి, అసత్యం ఎప్పుడూ నెగ్గ లే దనీ, నశించిపోతుం దనీ తెలుసు. అసత్య మైనదే అనాకార మైన దని తెలుసు. అనాకార మైనదే అమంగళ మైన దని తెలుసు. అన్యాయం, స్వార్థం, లోభం, దారిద్ర్యం, పీడ, జరా మరణాలు - ఇ వన్నీ అనాకార మైనవీ, అమంగళ కర మైనవీ, అసత్యాలూ కూడా కావూ? ఇ వన్నీ క్రమ క్రమంగా క్షీణించి క్షీణించి, పూర్తిగా నశించిపోయి, లోకానికి ఒక సమగ్ర సుందర రూపం వచ్చిందాకా, కవి విశ్రాంతి లేని బాటసారిగా కాలప్రవాహంలో పడి, లేక, యాత్రామార్గం మీద ప్రయాణం చేస్తూ ఉండ వలసిందే!

కనుక కాలజ్ఞానం ఉన్న కవి దృష్టిలో ఒక ప్రత్యేకత ఉంది. అతను అనురాగార్ద్ర మైన హృదయంతో చూస్తాడు సౌందర్య

పిపాసువై హృదయంతో చూస్తాడు. సౌందర్యమూ, శివమూ, సత్యమూ ఒకటే అయినప్పుడు అదే జగద్ధితం కోరే హృదయం కూడా అవుతుంది. ఇలాగ చేస్తే శ్రేయస్సూ, కల్యాణం లభిస్తా యని కర్మవీరులు అంటారు. ఇలాగ చేస్తే సత్యం దొరుకుతుం దని జ్ఞాని అంటాడు. ఇలాగ చేస్తే సౌందర్య సాక్షాత్కారం అవుతుం దని కవి అంటాడు. ముగ్గురికీ ఒకటే కడపల. ముగ్గురు చెప్పేదీ తరచి చూస్తే ఒకటే. కనుక కవి లోకంలో అనాకార మైనవి చూడ డని కాదు. "ఆ అనాకారపు ఆచ్ఛాదన తొలగించండి. తొలగిస్తే, ఆ సౌందర్యం సాక్షాత్కరిస్తుంది" అంటాడు.

వాల్మీకి, వ్యాసుల నుంచి కాళిదాస, భవభూతుల దాకా, వారి నుంచి మన నన్నయ, తిక్కనల దాకా జరిగి చూస్తే ఈ కాలజ్ఞతా, లోకజ్ఞతా, మహావిశ్వం యొక్క ఏకత్వం గ్రహించిన కరుణా వారి నంత వారినిగా చేసినట్లు కనబడుతుంది. మళ్లీ నన్నయాదుల దగ్గిరి నుంచి నేటి మన ఆంధ్ర కవుల దాకా చూస్తే, ఎప్పటి కప్పుడు కవులు తాము కాలంతో మారి తీరుతూ, ఎప్పటి కప్పుడు జీవంతో చలించి పోయే తమకు అందాన్ని ఎలాగ వినిపిస్తూ వచ్చారో తెలుస్తుంది. ఈ గుణాలు ఎంతగా తమలో ఉంటే అంత గొప్ప కవులు అవుతున్నారు.

—రేడియో ద్వారా ప్రసారితం - డిసెంబరు 1949

# కరుణ

"నా హృదయాంతరాళంలో నందన మందారం వంటి సుందరమూర్తి ఉంది. ఈ లోకంలో భగ్న మైనవీ, భయంకర మైనవీ, వికృతంగా ఉన్నవీ, వెగటు కలిగించేవీ, జీర్ణ మైనవీ, జరఠమైనవీ, ధూళిలో అసహాయ మై పడి ఉన్న అనాథ శిశు రోదనమూ, ఈడుచుకుంటూ ఆయాస భారంతో సాగిపోయే మోటుబండి దైన కఱ్ఱా, ఇనుమూ, రాయీ ఒరిసిన ఆ చప్పుడూ, శ్రమాలసుడై పడిపోనూ లేక నడవనూ లేక పోయే కర్షకుని దీన చరణ ధ్వనీ, ఇ వన్నీ ఆ మూర్తికి అన్యాయం చేస్తున్నాయి. ఈ అనాకారపు వస్తువులవల్ల కలిగే దోషం మాటలలో చెప్పలేనంత పెద్దది. వీటి నన్నింటినీ తిరిగి నిర్మించాలని నా కెంతో తృష్ణ. ఈ భూమినీ, ఆ ఆకాశాన్నీ, సముద్రా లన్నింటినీ, సర్వ సృష్టిన్నీ ఒక స్వర్ణపేటిక లాగ తిరిగి కట్టి దానివైపు చూస్తూనే దూరాన ఒక మరకత తృణ వేదికపై కూర్చుండా లని ఉంది. అప్పుడు నా హృదయాంతరాళంలోని ఆ మూర్తిని చూడా లని వేగిపోతున్నాను" అని ఒక మహా కవి అంటాడు.

పరమశివుడు కాలకూటాన్ని తాగి, దాన్ని కంఠావరణం దాటనీక దాచుకుని - ఎంత కరుణ! - అమృత కిరణాలనీ, అమర

గంగనీ లోకంలోకి అవతరింప జేశాడు. అసలు ఏకైక కవి ఆయనే!

ఒక్కొక్క కవికి ఒక్కొక్క సిలువ ఉంటుంది. తన దైన నరక వేదనా, ఇతరులది కూడా తన దైపోయిన వేదనా అతన్ని స్తిమితంగా ఉండనీయవు. వాటిని లోపల ఇముడ్చుకొని, లోక సంగ్రహార్థం చల్లని చక్కని తీయని కావ్యాల నిస్తాడు.

క్రౌంచపక్షి వియోగబాధ నుంచి ఆది కావ్యం పుట్టింది. ప్రపంచవేదన నుంచే పంచమ వేదం పుట్టింది. బాధనుంచి నేర్చుకున్నదే పాటలో నేర్పుతున్నా నని ఒక ఆంగ్లకవి అన్నాడు. తన ఒక్కడి బాధ అనే కాదు; అంతే కాదు. పాపం!

"దారి తల లెత్తు నింత సౌందర్య లవము
వదలి పోలేరు చంపెడి వరకు వీరు!
మృదుల కరుణా మధురము నా హృదయ మెవ్వ
రెరుగ జాలుదు రే మని యేడ్తు నెపుడు!"

బాధ వరం. బాధకీ చాలా శక్తు లున్నాయి. బాధలో కాలి పోయేవాడు పాషాణం కాలేడు. వాడు నిలువునా నవనీతం. వాని గుండె మంచు కాలవ; వాని బతుకు మధు వాహిని. బాధ దృష్టిని నిశితంగా చేస్తుంది, దయార్ద్రంగానూ చేస్తుంది. వేదనలో వేగి పోయేవాడు బాహ్య విశ్వంలోకీ, మానవ ప్రకృతిలోకీ చొచ్చుకుని పోయి లోపల లోపల పెల్లగించి చూస్తాడు. అలాగ చూడగానే అందరిలోనూ అసమగ్రతా, అంధకారమూ, అజ్ఞానమూ ఆలోకిస్తాడు. అప్పు డొక విధమైన అనుకంప కలుగుతుంది; ఒక విశ్వజనీన బాంధవ్యం ఏర్పడుతుంది.

ఇక బాధ అంతర్దృష్టి కూడా ఇస్తుంది. బాధ పడేవాడు తన లోకి కూడా చూసుకుంటాడు; అక్కడ కూడా అంత అసమగ్రతా,

అంత అజ్ఞానమూ, అంత అంధకారమూ దర్శిస్తాడు. అప్పుడు తనకూ ఇతరులకూ ఉన్న సామ్యం కూడా గ్రహిస్తాడు; అడకువతో కుంగిపోతాడు. ఎప్పుడూ తనను రెండవ స్థానంలోనే, వెనక పంక్తిలోనే ఉంచుకోవడం ఉత్తమ జీవిత లక్షణం అని ఒక రష్యను కవి అన్నాడు. అడకువ గల వానిదే ఈ లోకం అని జీసస్ చాటాడు.

అడకువతో ప్రేమ కూడా వస్తుంది. ఎలాంటి ప్రేమ? గెటీ చెప్పినట్లు "నిన్ను నేను ప్రేమిస్తే నీ కేమి? నీకు సంబంధం లేదు' అని చెప్పే ప్రేమ! ప్రేమా, వేదనా ఇవి రెండూ లోకానికి రెండు కళ్లు. ప్రేమార్ద్రులైన ప్రేయసీ ప్రియులకు ఉజ్జ్వలోత్తుంగమైన దుఃఖ కిరీటం పెడతాడు దాంతే కవి. ప్రేమిస్తున్నవాడు 'బాధ వద్దు' అనడు. నిజానికి ప్రేమ ఎక్కువైన కొద్దీ బాధ ఎక్కువవుతుంది. ప్రేమించడమనగా తన దుఃఖం తగ్గించుకోవడమని కాదు. నైచ్యమూ, కౌటిల్యమూ, స్వార్థమూ తగ్గడమని. ప్రేమతో బాధ హెచ్చుతుంది. బాధ హెచ్చి హెచ్చి ప్రేమసముద్రమైపోతుంది. ఇలాగ రెండూ పెరిగి రామాయణమయాయి, భారతమయాయి, అనేక కావ్యాలయాయి, బోధి వృక్షమయాయి, సిలువ అయాయి, సబర్మతి అయాయి. ఇక ఇవన్నీ కలిసి ఒక మహా నిశ్రేణి అయాయి. ఆ నిచ్చెన మీద ఎక్కగా ఎక్కగా అక్షయ కరుణా మూర్తి సాక్షాత్కారం. "సుహృదం సర్వభూతానామ్!"

కనుక వేదన వల్ల గాని ప్రేమ కలుగదు. ఈ రెండూ కలిస్తే కరుణ అవుతుంది. ఈ రెండూ కల హృదయం సదా స్నిగ్ధం. అది శ్రావణ మేఘం. దాని నుంచి ఎడతెగని అశ్రువర్షం కురుస్తుంది. కురిసిన చోటల్లా ప్రాణం స్నిగ్ధమైపోయి హాయిగా చల్లబడుతుంది. ఆ హృదయం మానస సరోవరం. దాని నుంచి గంగా, యమునా, సరస్వతులు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తూ

వస్తాయి ; అనగా శోకాశ్రువులూ, ప్రేమాశ్రువులూ, తరవాత ఆనందాశ్రువులున్నూ.

కన్నీటి కంత శక్తి ఉంది. బ్రహ్మానందుడైన భాగవతుడేమన్నాడు ? "ఆనందం నీకు కావాలా ? సంపాదించుకో! జలం ధనం, జలం పరిత్రాణం, జలం బ్రహ్మం. ఏడవకపోతే నాకు ప్రేమ కలుగదు, ప్రేమ నిలువదు, ప్రేమ వృద్ధి కాదు. వట్టి వేదన చాలదు నాకు. మేఘాలు పట్టవచ్చు, వర్షం కురియకనూ పోవచ్చు. అశ్రుపాతం భక్తి శాస్త్రంలో అమూల్యమైన వస్తువు" అని.

అలాగే కావ్య కల్పనలో కూడా. ఏ కావ్య సృష్టి కయినా ఈ కరుణే కారణం. హాస్యం, రౌద్రం, శృంగారం. ఏ మున్నా సరే అసలు అడుగున ఉన్నది ఈ కరుణే! అందుచేతనే ఏరసం మిన్ను ముట్టినా ఫలితం అశ్రుపాతం అవుతూ ఉంటుంది.

ఏకో రసః కరుణ ఏవ, నిమిత్త భేదా
ద్భిన్నః పృథక్ పృథ గివాశ్రయతే వివర్తాన్ ।
ఆవర్త బుద్బుద తరంగ మయాన్ వికారాన్
అంభో యథా ; సలిల మేవ హి త త్సమస్తమ్ ॥

కనుక ఈ విశ్వప్రేమ - ఈ కరుణ కావ్య నిర్మాణానికి కారణమౌతుంది. అంతే కాదు. ఈ విశ్వప్రేమను, కరుణను ఇతరుల హృదయాలలో కలిగించడమే కావ్యానికి ముఖ్యోద్దేశ మని కూడా తత్త్వవేత్త లంటారు.

నిందించడానికీ, కీర్తించడానికీ కాదు, మానవుని మానవునిగా చేయడానికే కావ్య నిర్మాణం. ఈ అనుకంప ఎంత లోపల ఉంటే అంత మానవత్వం మానవుల్లో ఉన్న దన్న మాట. దానిని ఎంత

ప్రభవింప చేస్తే అంత గొప్ప దన్న మాట ఆ కావ్యం! అంత దివ్యత్వానికి దగ్గిరగా తీసుకుని వెడుతుం దన్న మాట!

ఆత్మహత్య చేసుకున్న యువకుడూ, వ్యభిచారిణి అయిన యువతీ, చోరుడూ, జారుడూ, హంతకుడూ, బిచ్చగాడూ, రోగీ, భగ్న హృదయుడూ, రాముడూ, రావణుడూ, కృష్ణుడూ, కంసుడూ, ప్రవరుడూ, నిగమ శర్మా, సీతా, ద్రౌపదీ, వరూధినీ, శూర్పణఖా - ఎందరో, ఎందరో! అందరినీ ఒకరి కొకరికీ, అందరినీ మనకీ బంధించే ఒక అమోఘ దయా, ప్రభావమూ ఆ యా కావ్యాలు చదివే మనలో కూడా ప్రజ్వలించాలి. ధర్మానికి సిలువా, సౌజన్యానికి కారాగారమూ, ప్రతిభకు ప్రవాసమూ! "మన వలె ఇడుములు గుడిచిన నరులు గలరే యెరులు?" అన్న ప్రశ్న కృతయుగం నుంచీ వినబడుతూంది కదూ?

కన్నీళ్లలో నుంచి కావ్యం ఎలాగ జన్మించిందో, కావ్యంవల్ల కన్నీరూ అలాగే పుడుతుంది. ఈ కన్నీరు మళ్లీ సృష్టించే శక్తి ఇస్తుంది. ఇలాంటి కావ్యాలు వ్రాసిన వారు లోకాన్ని నడిపిస్తూ ఉన్నారు. వాటిని చదివి మనకు తెలియకుండానే కలిగిన మానస వికాసంతో, హృదయ స్నిగ్ధతతో లోక రంగాలలో కాలు పెడతాం. లోకాన్ని తిరిగి నిర్మించా లని యత్నిస్తాం.

మరొక విషయం: అటువంటి కావ్యాలు చదివి ఆ విశ్వ ప్రేమ తాత్కాలికంగా అనుభవిస్తున్నప్పు డయినా, ఆ దయా విధానంలో అందరూ అత్యవసరమే నని గ్రహించుకుంటాం. దానివల్ల లోకంలో ద్వేషం కరిగిపోతూ ఉంటుంది. అరణ్యంలో ప్రవాసి యైన ధర్మరాజు కోసం ఏడ్చిన మనమే రథభారం క్రింద క్రుంగిపోయే అతని శత్రు వైన కర్ణుడి కోసమూ ఏడుస్తాము. అప్పుడు కర్ణుడు మన ఎదుట హిమాచల శిఖరం లాగ తారాకోటీరంతో ధగ ధగా

ప్రకాశిస్తాడు. శ్రీకృష్ణుడు కూడా ఆ ఔన్నత్యంముందు ఆ తేజస్సులో కనపడడు. కర్ణుడు అప్పుడు ఏదో అమోఘ శక్తిని ఎదుర్కొంటున్నాడు. అందరూ ఎప్పుడో ఒకప్పుడు, ఎలాగో ఒకలాగ, గ్రీకు నాటకాల్లోలాగ దాన్ని ఎదుర్కొంటూనే ఉన్నారు. ఆ సమయాల్లో వాళ్లు ఎంత ఉన్నతంగా నైనా సాక్షాత్కరిస్తారు. ఎంత కరుణ నైనా పుట్టిస్తారు. వాళ్లని జూచే "అపి గ్రావా రోది త్యపి దళతి వజ్రస్య హృదయమ్!"

ఒకని జీవితం హెచ్చుతగ్గులు లేని ఇసుక బయలులాగ ఉంటుంది. దానిలో జీవమూ, లావణ్యమూ ఉండవు. సున్నగా, నియమంగా, పేలవంగా, సుఖంగా ఉంటుంది. పెద్ద పర్వతశ్రేణీ, క్రింద భయంకర మైన లోయలూ, పైన పర్వత శీర్షంమీద జీమూతాలూ, విద్యుల్లతలూ, క్రింద అఖాతాల్లో నీడలూ, నిద్రా, ఆ పర్వత హృదయం కరిగి దాని కపోలాల మీద చారలు పడడం, క్రింద లోయలు నిండడం, పల్లాలు పండడం — ఇవన్నీ ఆ బ్రతుకులో గోచరించవు. దుఃఖపడేవాడు జీవించి ఉన్నాడు, అతడు మానవుడు. కేవలమూ సుఖమే అన్నవాడు నిజానికి యాత్రా మార్గంమీద కదలడం లే దన్నమాట. సుఖం వేరు, ఆనందం వేరు. శతసహస్ర నర నారీ మండలంలో బాధా జీవిని ఇట్టే పోల్చి పట్టగలం. ఈ లోకం పాదపీఠంగా వైకుంఠప్రాంగణంలోకి ఒరిగి చూస్తున్నట్లు ఉంటా డతను. అతను పాతాళగర్భంనుంచి పదునాల్గు లోకాలతోనూ పరిచయం ఉన్న వాడిలాగ ఉంటాడు. అతని కళ్లల్లో శరత్కాసారాలు ఉంటాయి. అతని శిరస్సు మీద చంద్ర మకుటం ఉంటుంది. అతని కంఠంలో కాలకూటం ఉంటుంది. అతని ఫాలంలో అశని పాతం ఉంటుంది. అతను తెలిసిపోతాడు. అతని సన్నిధానంలో పక్కకి తొలగి, పాదరక్షలు వదలి తలవంచుకుంటాం.

ఒక్క నిట్టూర్పు వదలిన చోట, ఒక్క కన్నీటి చుక్క రాలిన చోట భగవాను డాలయం కట్టుకుంటాడు. అక్కడే రుషులు తపోవనాల్ని నిర్మించుకుంటారు.

సుఖంలో మగ్ను డైన వాని కంటె శోకావిలు డున్నతు డౌతాడు. "చక్కని శరీరానికి సుఖమూ, చక్కని ఆత్మకు దుఃఖమూ కావాలి" అన్నా డొక తత్త్వవేత్త. కనుక అశ్రువులలోనే ఆనంద సందేశం ఉంది, ఆశాజ్యోతి ఉంది. అశ్రుపాతం బలహీనత కాదు, స్వార్థం కాదు. నిరాశా కాదు, నిస్పృహా కాదు. ఈవ లావలి తీరాలకి నడుమ బాష్పసాగరమే ఉన్నప్పుడు అది దాటకపోతే ఎలాగ? ఎ టొప్పీ - అశ్రువే సాగరమూ, అశ్రువే తరణీ కూడా!

"ఆహారముగ శోక, మశ్రు పానీయమ్ము
అనవరత మందీయవా? నా తండ్రి!"

అన్న ఏసుక్రీస్తు లోక నిర్మాతలలో ఒక డైనాడు.

"ఏడిచి ఎన్నినా ళ్లయిన దీ యెద, అశ్రులు కన్నుమోసలం
దోడిచి ఎన్నినా ళ్లయినదో?"

అని సుందర కావ్య నిర్మాణం చేయబోయే కవి అంటాడు.

"క్రౌంచ మిథునానురాగ దారణమువలని
శోకమే శ్లోకమై, ఏ మృదూకృతాత్మ
ముఖ వియత్పథమున గంగవోలె వెడలె
నా తపస్వి ప్రాచేతసు నాత్మ దలతు." —రాయప్రోలు

—ఆంధ్రప్రభ (1-3-1942)
'సాహిత్య గోష్ఠి' లో ప్రచురితం.

# కవీ — ప్రజా

కవి ఉన్నాడు. చుట్టూ సమాజం ఉంది ; అంటే ప్రజ లున్నారు. సమాజం సముద్రం అయితే, కవి కెరటం ; లంక పంటివాడు మాత్రం కాడు. లంక మన్ను, సముద్రం జలం. వస్తువులు వేరు. కవి కూడా చుట్టూ ఉన్న ప్రజల జాతిలోని వాడు. తేడా లన్నింటికీ అడుగున అవే ఏడుపులూ, నవ్వులూను. అవే కోపాలూ, తాపాలూను. అన లంతా అదే ప్రకృతి !

ఒక్క స్వభావాన్ని బట్టి మాత్రమే మానవు లందరూ ఒకటి కాదు ; సన్నిహిత సంబంధాన్ని బట్టి కూడా. ప్రజలూ, కవీ అందరూ పడుగూ పేకా లాగ అల్లుకుని పోతారు. ఒకరి బ్రతుకు ఒకరి బ్రతుకుతో పెనవేసుకుని పోతే, ఒకరి గుండె ఒకరి గుండెను ఒరుసుకుంటూ ఉంటుంది.

నిజానికి కవికీ, చుట్టూ ఉన్న సమాజానికీ ఈ చుట్టరికం ఎప్పుడూ ఉంది. ఈ బంధం లేనప్పుడే నీరస రచనలూ, నిర్జీవ కావ్యాలూ పుట్టీ పుట్టకమునుపే చచ్చిపోయాయి. ఆ రోజుల్లో ఆ సమాజంలో ఆ కవికీ, ఇతరులకీ అనుభూతులూ, ఆందోళనలూ, ఉద్యమాలూ సామాన్యాలు. కాని ఒక కాలపు కవి సమాజం వేరు ;

ఇంకో కాలపు కవి సమాజం వేరు. పెద్దన్నగారి సమాజం వేరు, నేటి కవి సమాజం వేరు. పెద్దన్న సమాజం రాజాస్థానానికీ, శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబానికీ సంబంధించిన జనంతో నిండినది. దాని చుట్టూ కందకాలూ, ప్రాకారాలూ ఉన్నాయి. నిజానికి ప్రతి కవి హృదయం లాగే పెద్దన్న హృదయం కూడా అడ్డకట్టలూ, అంతస్తులూ అతిక్రమించి పొరలి పోయే గుణం కలదే! ఆ మానవ హృదయం ఆయన కావ్యం అడుగున అప్యాయంగా టక్కు టక్కు మని మ్రోగుతూనే ఉంటుంది. కాని ఆయన చనువుగా తిరగగల ఆవరణ లోపలినుంచే బాగా తెలుసున్న విశ్వాసాలనీ, సంఘటనలనీ, సుఖ దుఃఖాలనీ తన కావ్యాలలోకి ఏరుకుని చొప్పించగలడు.

ఈ రోజున సమాజం అంటే ప్రజ లందరూను. వెనకటి ప్రాకారాలు దిగంతాల దాకా వెనక్కి వెనక్కి జరిగిపోతున్నాయి. కొన్ని ప్రాకారాలు పడే పోతున్నాయి. కొన్ని కందకాలు కప్పబడి పోతున్నాయి. ఈ రోజుల్లో లోకమే అంతా ఒక ఇల్లు అయి ఊరు కుంది! ఈ యింట్లో ఒకడి కల్యాణం అందరికీ కలకలలు అవు తుంది. ఒకడి ఆమయం అందరికీ ఆపద అవుతుంది.

మానవకోటి అంతా ఒక పెద్ద శరీరం. దానిలో ప్రతి మానవుడూ ఒక అణువు. ఏ అణువు చెడినా దేహానికే తెగు లాయెను! కనుక ఇప్పుడు సమాజమూ, ప్రజలూ అంటే ప్రజలు అందరూ అన్న మాట. ప్రతి జీవిత గగనంలోనికీ "నేనూ ఉన్నాను, నేనూ ఉన్నాను, నేనూ ఉన్నాను..." అని ఉచ్చైఃస్వరంతో పలకరించే కోట్ల కోట్ల గొంతులు తారా జువ్వల లాగ పొడుచుకొని లేస్తున్నాయి. ప్రతి బ్రతుకు బాట నిండా కోట్ల కోట్ల ఆప్తబంధువుల అడుగుల చప్పుళ్లు ఊరికే దగ్గిరగా దగ్గిరగా వస్తున్నాయి. ఇలాంటి ప్రజా లోకంలో ఇప్పటి కవి ఉన్నాడు.

ప్రజ గోదావరి వంటి జీవ నది. నాసిక దగ్గరనుంచి అలాగ పెరుగుతూ, జరుగుతూ, రక రకాల మట్టినీ, రక రకాల చెట్టు చేమలనీ మోసుకుని వస్తూ, "ఆ గోదావరి తనం" పోకుండానే సముద్రం దాకా ప్రయాణం చేస్తూ ఉంటుంది. గోదావరికి ఒక సంప్రదాయం ఉంది.

ప్రజ నిత్య యాత్రికుడు. సంప్రదాయం ప్రజకు దారి బత్తెం; పోనీ వారసత్వం, స్థిరాస్తి. దానిని యుగాలు దాటించి తీసుకుని వస్తున్న వాళ్లు ప్రజలు. యుగ యుగాల నుంచి మహా యుద్ధాలు వచ్చాయి. విలయాలూ, విప్లవాలూ వచ్చాయి. కరవులూ, వరదలూ, భూకంపాలూ, అనావృష్టులూ - అన్నిటిలో నలుగుతూ నాశనం కాకుండా వచ్చారు. అన్నిటికీ బాధపడుతూ తమ తల్లి భూదేవిలాగ ఓర్చుకుని నిలబడ్డారు. నిలబడుతూ మన సంప్రదాయాన్ని సజీవంగా నిలబెట్టి ఉంచారు. మన నాగరకతా మూల మేదో అది వారిలోనే ఇంకి, ఇమిడి ఇంకా ఉంది. ఏ అసంఖ్యాక ప్రజలతో ఈ రోజుల్లో మనకి మరీ సన్నిహిత సంబంధం ఏర్పడుతుందో ఆ ప్రజలలో నిలిచి ఉన్న సంప్రదాయాలతో పరిచయం కవికి లేకపోతే, అతని కంఠ స్వరం ప్రజలు ఆప్త మైనదిగా పోల్చుకోలేరు. అతని మాటలు పరాయి భాష లాగ ఉంటాయి. కనుక ప్రజలతో సన్నిహిత సంబంధం కవికి ఉండా లంటే వాళ్ల కలిమి లేములూ, కష్ట నిష్ఠురాలూ కాక వాళ్లలో నిలబడి ఉన్న జాతి సంప్రదాయాలు కూడా అతగాడు వివేచనతో, చనవుతో, గౌరవంతో ఎరిగి ఉండాలి.

నేటి మన దేశపు కవుల్లో రవీంద్రుని గొప్పతనానికి గట్టి పునాది అదే! పూర్వ కావ్యాలూ, గ్రంథాలూ ద్వారా వచ్చిన సంస్కృతి తోనే కాదు అతని పరిచయం. వంగదేశ జనపదాల్లో అతని యువ మనస్సు ఆప్యాయంగా ఆత్రుతతో విహారం చేసింది. పల్లీ గృహాల్లో, పచ్చిక బీళ్లలో, పద్మానదీ తటాల్లో ప్రయాణం

చేసింది. అతని హృదయం 'బావుల్' భిక్షుక గేయం మ్రోగిన చోటల్లా ఆగి వింది. అందుకనే అతని గీతాలు తిరిగి పల్లీ గృహాల్లో, పచ్చిక బీళ్లలో, పద్మా తటాల్లో, సామాన్య ప్రజల గొంతుల్లో పొంగి పొంగి తరంగా లయాయి.

ఇక అనేక కాలాలనుంచి ప్రయాణం చేస్తూ వచ్చిన ప్రజ ముందుకు సాగడం కూడా తేలికే. ప్రజ అనే ఈ యాత్రిక గణానికి కవి నాయకుడు. నడవ వలసిన రహదారీ, వచ్చే మజిలీ, చివర్ని కడపలా - అంటే గమ్యస్థానమూ అన్నీ నిర్ణయించి చెప్తాడు. ఇది దృష్టి వల్ల వస్తుంది. ఎంత గొప్ప దృష్టి ఉంటే కవి అంత గొప్ప నాయకుడూ, నడిపించే వాడున్నూ. ఒక్కొక్క కవి గరుత్మంతుని వంటివాడే ఉంటాడు. కాని కేవలమూ ఒక్క సంప్రదాయంతోనే పరిచయ ముంటే కదలిక ఉండదు. ఒక్క కడపలతోనే పరిచయ ముంటే పాథేయం ఉండదు. ప్రజల్ని ఎరి గుండాలి. పరిసరాల్నీ, ప్రస్తుత స్థితిగతుల్నీ కూడా కవి తెలుసుకుని ఉండాలి. "Awareness of the times" కవికి కూడా అత్యవసరం. సంప్రదాయం తెలుసుకోకపోతే ప్రజల్ని తెలుసుకోలేడు. తన దేశ కాల పరిస్థితుల్ని తెలుసుకోలేకపోతే మార్గం తెలుసుకోలేడు. ఈ రెండూ ఉండి, దృష్టి లేకపోతే కడపల చూపించ లేడు.

ఇక్కడ మళ్లీ రవీంద్రుని మహా ప్రతిభ మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది. తమ జాతి సంప్రదాయాలు ఎరిగి ఉన్న కవులు ఎందరో ఉండవచ్చును. కాని తమ కాల పరిస్థితులతో పరిచయ మున్నవారు తక్కువ. యథార్థ లోకజ్ఞులు తక్కువ. వర్తమాన మానవలోకాన్ని ఊగిస్తూ, లాగుతూ, ముందుకు తోస్తూ ఉన్న ఆవేశాల్నీ, ఉద్యమాల్నీ ఎందరో ఎరగరు. రవీంద్రునికి ఈ కాలజ్ఞత చాలా నిశితంగా, తీవ్రంగా ఉంది.

"అసీమ మైన నీ సృష్టిలో స్వదేశ మేది, విదేశ మేది ?" అన్న మహామంత్రం - నవయుగ భారత నిర్మాత ఎనభై ఏళ్ల కిందట అన్నది - ఇతని నోట మరీ అందంగా వచ్చింది: "తూర్పు పడమరలు ఒక్క హృదయపు రెండు స్పందాలే!" అని. అమెరికాలో కర్మకారుడూ, ఆర్యావర్తంలో కర్షకుడూ అన్న దమ్ము లని ఆయన తెలుసుకుని అనుభవించాడు. ఎక్క డున్నా మానవు లందరూ ఒకటే కనుక, ఈ లోకంలో ఇంక అన్యోన్య పీడనా, అంతస్తులూ పనికి రా వని గ్రహించిన రవీంద్రుని ప్రతిభ కాలజ్ఞత కలది; కనుక జాతి పురో గమనానికే సహాయ పడింది.

ఇలాగే ఆయన శాస్త్రీయ దృష్టి. ఆయన కవిత్వానికీ, ఆత్మ వికాసానికీ శాస్త్రం అడ్డురాలేదు సరి కదా, సహాయకారి అయింది.

ఒక ప్రఖ్యాత రచయిత రవీంద్రుని నవలల్ని గూర్చి వ్రాస్తూ, ఆయన మన దేశంలో మొదటి నవలని వ్రాసినవాడు అన్నాడు. కారణం చెపుతూ - బంకించంద్రుడు తన చారిత్రక ఆఖ్యాయికలలో ఊరికే కథ చెప్పుకు పోతా డనిన్నీ, రవీంద్రుడు తన పాత్రలు, వాటి శీలము, అన్యోన్య సంఘర్షణ మొదలైనవి వికసింప జేస్తూ కథ కడతా డనిన్నీ, ఈ శాస్త్రీయ పంథా అతనిలో నవ్యత్వం చూపిస్తుం దనిన్నీ అంటాడు.

అలాగే "తపోవన సందేశము" వినిపించిన రవీంద్రుడు ఇహ లోకాభిమానమూ వదలడు. ఆయనకు ఈ లోకమూ, దానిలో ఈ మనుగడా అంతా నిజం! ఈ లోకంలో గాలీ, నీరూ, ఎండా, వెన్నెలా అన్నీ మనము సుఖంగా, నిండుగా, హాయిగా అనుభవిం చాలి. ఈ మనఃప్రవృత్తి, ఈ లౌకిక దృష్టి కూడా కవి కాలగతిని ఎలాగ గ్రహించాడో వ్యక్తం చేస్తుంది. అలాగే మానవ లోకం అంతా ఒకటే అని గ్రహించిన కవి సామాన్య మానవుని కూడా ఉన్నతుని చేస్తున్నాడు. సామాన్యతని ఉదాత్త పరచి,

కళాజగత్తులో ప్రవేశ పెట్టడం కూడా కవిలో నవ్యతను సూచిస్తుంది.

సమాజానికి దూరమై కొందరు కవులు నిర్జీవ రచనలు చేస్తారు. పాండిత్యమూ, ధీ శక్తీ, ఉపజ్ఞా ప్రకటించడానికి కొందరు దుర్జ్ఞేయులూ అవుతారు. కొందరు చమత్కారం, చురుకుతనం చూపించి మిరుమిట్లు గొలపబోయి ప్రజలకు ఆనందమూ, వికాసమూ ఈయలేక పోతారు. కొందరు "ప్రజలు ప్రజలు" అంటూనే ప్రజా లోకానికి దూరంగా ఉంటూ అది ఎలాగుందో గ్రహించలేక విజాతీయ సమాజంలో నుంచి, విజాతీయ కంఠంలో నుంచి వచ్చిన రచనల్ని తమ కంఠవేణువుల్లో నుంచి వదులుతారు. కొందరు కేవలమూ కొత్తదనం చూపించి ప్రముఖులు కావడానికే ఉత్త బొమ్మల చుట్టూ కొత్త దుస్తులను అతుకుతారు.

కాని, ఇప్పుడు ప్రజాలోక మంతా శ్రోతృలోక మయి తయారుగా ఉంది కదా! ఒక్కొక్కసారి ఏకాంతంగా కవి ఒక్కడూ ఈ రోజుల్లో కూర్చుని, నేను కంఠం విప్పి ఏదో వినిపిస్తే వినడానికి ఒడుపుగా, మెలకువతో, ఆసక్తితో, గౌరవంతో కోట్ల చెవులు వికసించి, వేచి ఉన్నాయి అని తలుచుకునే సరికి మనస్సులో అతనికి ఎన్ని మెరుపులూ, ఎటువంటి గొప్ప ఆవేశాలూ వస్తాయో!

ఏ నన్నయ్యదో, ఏ తిక్కన్నదో కావ్యం చదివి, దాని మహస్సుని తన మనస్సూ, మనుగడా అంతటా నింపికొని తాను జీవయాత్ర సాగిస్తూన్నట్లే, తన మాట, పాట, తమ తమ హృదయాల్లో నింపికొని ఎవ రెవరో, ఎంద రెందరో కోట్ల "గండా భోగములన్ ముదశ్రు లహరుల్ గప్పన్ నుతుల్ పాడి ఆ దండన్ వ్రేగులు డించి" పరవశులై విని తమ బతుకులను మనోహరంగా

మలుచుకుంటారని గ్రహించు కుంటే, ఓహెూ! యుగ యుగాల నాశం కాకుండా కాపాడి ఆనందం వైపు లోకాన్ని తోస్తూన్న కవిరాజేశ్వరుల లాగే తానూ ఎంత అమరుడైపోతాడో!

అబ్బ! నా అనుభవాలూ, ఆవేదనలూ లాగే లోకబాధలూ, ఆధి వ్యాధులూ, నాలో నిండిపోతే, నా కంఠద్వారం గడియ నడలకపోతే ఎలాగ? ఎన్ని చెవులు దూరశ్రవణ యంత్రాలులాగ నా కోసం బిగబట్టి ఉన్నాయో!

"తల నెరుస్తూంది. శరీరం ముడతలు పడుతూంది. కళ్లు నాట్యాలు మరచిపోయాయి. మనస్సు రెక్కలు విడడం లేదు" అని నిస్పృహతో కవి కూర్చుంటాడా?

"ఆహా! కవీ! సాయంత్ర మయింది. నీ జుట్టు నెరసింది. ఒక్కడవూ అలా కూర్చుని పారలౌకిక చింతలో మునిగి ఉన్నావా?" అని అతన్ని ప్రశ్నిస్తే —

"అవును. సాయంకాల మయింది. ఎవ రయినా ఆ చెట్ల చాటు గ్రామంలో నుంచి వస్తా రేమో అని అడుగు సవ్వడులు వింటున్నాను. ఏ త్రోవ తప్పిన మనస్సో, ఏ బీటలు పడ్డ హృదయమో ఇటు వస్తుం దేమో! వాటికి త్రోవ చూపేవాడూ, అతికే వాడూ నేను కాక పోతే మ రెవ్వరు? జీవన భాగీరథీ తటాన కూర్చుని నేను పాటలు పాడి వాళ్లని రక్షిస్తాను. నేను సర్వనమ వయస్కుణ్ణి. అందరికీ నా అవసరము ఉంది" అని అతను అంటాడు.

"దశ దిశా మధ్యాన ఉన్న జాతులారా! మీరు ఏకం కండి! మన్ను మిన్నుల మధ్య నున్న మానవు లందరూ ఏకం కండి! మనస్సులో చీకటిని తరమండి. హృదయాల్లో విషం ఉండ నీయకండి. ఒకసారి కౌగిలించు కోండి. ఎవ రది? ఈ లోకాన్ని

ఇలాగ దుర్గంధ మయం చేస్తున్నారు? ఎవ రని మీరు ఈ లోకాన్ని నరకం చేయడానికి? వద్దు. ఏ కులతత్త్వం, ఏ మతం, ఏ జాత్యహంకారం చెప్పింది ఇలాగ చెయ్యమని? మీ కండరాల్లో కొత్త చైతన్యము ఉబికి ఉబికి పైకి ఎలాగ చిమ్ముతూందో? బలం బలహీనతని పైకెత్తడానికే! అనురాగం అహంకారాన్ని కరిగించడానికే! ఆ అదుగో! దూరాన పురాణ రాజ ఘట్టంలో యమునా తటాన సామాన్య మానవాలయము! భారతంలో లాగ 'ధర్మము, ధృతియు, సత్యము, కారుణ్యము' అని ఆలయం నాలుగు వైపులా వ్రాసి ఉంది. దానిలో విగ్రహానికి రత్న భూషణాలూ, రాజ దండాలూ లేవు. ఆ ఆలయంలో సామాన్య మానవుడు సాక్షాద్దేవ స్థానం ఆరోహించాడు. దశ దిశాంతాల నుంచి ఎన్ని రహదారులో ఆలయం దగ్గిరికి వస్తున్నాయి. ఆ రహదారుల మీద పడి ఎన్ని సామాన్య మూర్తులో ఆలయంలోకి వచ్చి ఆ విగ్రహంలో కలిసి పోతున్నాయి. ఆలయం నాలుగు వైపులా నా సందేశం ఉంది. ఆలయంలో నా సందేశం ఉంది. రహదారిలో, రచ్చలో, వీటిలో, విపణిలో నా సందేశం ఉంది. నేను ఊరుకుంటే ఎలాగ? సాయంకాలం అయితే నేం? నా తల నెరిస్తే ఏమి?" అని నేటి ఆంధ్ర కవి అంటేనా?

"విద్యలకు నెల్ల ఉత్తమ విద్య కవిత, దాని తెలియుట విశ్వ మంతయును కనుట" అని మన అప్పకవి అన్నాడు. కవిత "అఖిల విద్యలకు సిద్ధాంజనంబు" అని నేటి ఆంధ్ర కవి పరమేష్ఠి వేంకట శాస్త్రి అన్నాడు.

—రేడియో ద్వారా ప్రసారితం;
కృష్ణాపత్రిక (24-7-1948) లో ప్రకటితం.

# ప్రాక్పశ్చిమ సమ్మేళనం

అభిమాను లైన ప్రాచ్య జాతీయ వాదులు కొందరు ఇలా అంటారు :

"పాశ్చాత్య విజ్ఞానం నగర కుడ్యాలలో పుట్టింది. ప్రాచ్య ప్రతిభ తపోవనాల్లో జన్మించింది. ప్రాచీన దుర్గాలకు లాగే ఆవరణలోపల ఆవరణతో సృష్టి. మానవుడు జాతి, సమాజము, తాను దాకా ఒక దాని నుంచి ఒక దానిని విడదీసి జయించే రాతి గోడ తత్త్వం అది. ఇవి అన్నీ ఒక దానిలో నుంచి ఒక దానిలోకి పెరిగి పోతూ ఏ వైకుంఠంలోనో మేళనం అయిపోయే పరమ తత్త్వం మనది."

ఇక తీవ్ర పాశ్చాత్యవాదులు కొందరు ఇలా అంటారు :

"ఇక్కడ చూచేదీ అనుభవించేదీ ఏదీ సత్యం కాదు అంటూ ఈ హిమ యవనిక వెనకాల ఏదో వెలుగు ఉంది అంటూ ఊరికే ఏదేదో అనే విజ్ఞానం తూర్పు వారిది.

"ఈ సృష్టిలో ప్రతీదీ నిజం. మానవుడు దాన్ని బలంగా సజీవంగా న్యాయంగా అనుభవించుకోవాలి. లేకపోతే ఈ జీవితమే

అర్థవిహీనం. ప్రస్తుత ప్రాచ్య దేశస్థుల లాగ సుదూర భావనా లోకంలోకి చూస్తూ సుస్పష్ట సత్య లోకంలో నీరసులై పోవలసి వస్తుంది - అనే విజ్ఞానం పడమటి వారిది."

ఇద్దరూ సత్య ద్రష్టలు కారు. రుషి కానే కాని ఒక ఆంగ్లకవి "తూర్పు పడమరలు కలుసుకోలేవు" అన్నాడు. ఈశ్వరుని ఏకత్వంతో పాటు మానవుని ఏకత్వం కూడా గ్రహించి అనుభవించిన భారత కవిరాజు "అసీమ మైన ఈ సృష్టిలో తూర్పు ఏది? పడమర ఏది? అవి రెండూ ఒక హృదయం తాలూకు రెండు స్పందాలు" అని ఆప్యాయంగా అన్నాడు. ఈయన ఆర్య రుషుల సంతతిలో వాడు, ప్రపంచ కవుల శ్రేణిలో వాడు. ఇతని దృష్టి గరుత్మంతుడు. రవీంద్రుడు ప్రాక్పశ్చిమ కవిత్వాలకే కాక ప్రాక్పశ్చిమాలకే సుదృఢము, సుస్థిరము అయిన సేతువుగా నిలిచి ఉన్నాడు. ఇతన్నీ, ఇతని కవిత్వాన్నీ ఒక ఆవరణలోకి లాగలేము. ఇతని విజ్ఞాన విధానమే, ధర్మ సంప్రదాయమే అపూర్వము. ఆర్య రుషుల ఉపనిషన్మంత్రాలూ, కాళిదాస భవభూతుల కావ్యాలూ మొదలుకొని పాశ్చాత్య మహాకవుల భావగీతాల వరకూ సమగ్రముగా గ్రహించుకొన్నాడు. ఈ లోకంలో ప్రత్యల్ప వస్తువులోని పటిమ, ప్రతి సుఖదుఃఖానుభవములోని అమూల్య ప్రభావము అనుభవిస్తూ, వాటిని అన్నింటినీ అమృత ప్రసాద మయిన పాథేయంగా ఉపయోగించుకొంటూ స్వర్గ గోపుర మకుటం నుంచి తన నిశిత దృష్టిని మరల్చకుండా మహాప్రస్థానం సాగిస్తున్నాడు ఈ భారత రుషి. ఒకసారి ఈ చిన్న పూవు వాడకుండా తుంపుకో మన్నాడు. ఈ శుష్కమైన వేణువును మోగించుకో మన్నాడు. తానే ప్రియుడై తన గాథలు పాడుకొన్నాడు. దరిద్రుల్లో, పతితుల్లో, క్షుద్రులలో ఉన్న శ్రీపాదాల వద్దకు దిగలేని అహంకారిని అంటాడు. అప్పుడు షెల్లీ, కీట్సుల వంటి పాశ్చాత్య కవులు జ్ఞాపకం వస్తారు. ఇంకొకప్పుడు 'గీతాంజలి'తో భాగీరథీ తీరానో, బదరి

కావనంలోనో మహామంత్ర పారాయణం చేస్తూన్న శ్రీ కృష్ణ ద్వైపాయన యోగి లాగ గోచరిస్తాడు. ఈయన మానవ హృదయాన్నీ, నిశిత మేధనూ గౌరవిస్తాడు. వీటిని మించిన భావనా దృష్టిని, ఆత్మ జ్యోతిని వదులుకోడు. భూ లోకాన్ని స్వర్గందాకా ఎత్తుతాడు. భూ లోకానికి స్వర్గాన్ని ఎప్పుడూ అచల తర్జనితో చూపిస్తూ ఉంటాడు.

పాశ్చాత్య కవులకూ, ప్రాచ్య కవులకూ ఈ భేదమే ఉందంటారు. పాశ్చాత్యకవి తన కష్టాన్నీ తన సుఖాన్నీ, తన సంయోగాన్నీ తన వియోగాన్నీ తన భావనా నఖాలతో పట్టుకొని రివ్వుమని నీలాకాశంలోకి ఎగిరి తారా తోరణాల లాంటి కావ్య మాలికలను నీ మనః ప్రాంగణ ద్వారాన్ని కట్టివేస్తాడు. ప్రాచ్యకవి సహజ తపశ్శక్తితోనో, సంప్రదాయసిద్ధమైన సంస్కార బలంతోనో తన దృష్టులను తెర వెనకాలకు పోనిచ్చి అనంత నక్షత్రాలనో, అమర మందారాలనో నీ పెరటి తోటలోకి దింపుతాడు. పాశ్చాత్యుడు తన ప్రేయసిని రంభను చేస్తాడు. ప్రాచ్యుడు దేవ నర్తకిని నీ కొలువులో నృత్యం చేయిస్తాడు. పాశ్చాత్యుడు ఉత్తము డయిన రాజును అర్థరును చేస్తాడు. ప్రాచ్యుడు లోక సంగ్రహార్థము శ్రీరామ చంద్రుణ్ణి అవతరింప చేస్తాడు. పాపాత్ముడై పశ్చాత్తప్తుడైన యోధుణ్ణి లాన్‌స్లాట్ వంటి వీర మూర్ధన్యుణ్ణి చేస్తాడు పాశ్చాత్య కవి. సాక్షాత్తూ నర నారాయణులనూ, కృష్ణార్జునులనూ ప్రతి మానవుడి అంతరాంతర కురుక్షేత్రంలో అమోఘ విహారం చేయిస్తాడు ప్రాచ్యకవి. పాశ్చాత్యుడు మానవ హృదయానికి ప్రధాన స్థాన మిస్తాడు. ప్రాచ్యుడు మానవాత్మకు ప్రముఖ స్థానం ఇస్తాడు.

నిజానికి వాళ్ళ వాళ్ళ నాగరకతా, విజ్ఞానాలలోనే ఉంది ఈ భేదం. ఈ లోకంలో, ఈ సంఘంలో పడిపోయి అనేక సుఖ

దుఃఖానుభవాలు వచ్చినప్పుడు, అనేక తీవ్ర మానవ సమస్యలు ప్రతిఘటించినప్పుడు తానే కథా నాయకుడు కావలసి వచ్చి భావగీతాలను (lyrics) కురిపిస్తాడు అతడు. ఇక్కడ పారలౌకిక దృష్టితోనే పుట్టి పెరుగుతూ ఉన్నవానికి ఇహలోకంలో ప్రతి అనుభవం తృణప్రాయం అయిపోయి, అసమగ్రంగా కనపడి తటస్థుడుగా ఉండగలిగేటట్టు చేయడంవల్ల ఒడ్డుమీద కూచుండి తరంగాలలోనో, సుడిగుండాలలోనో పడి పోయేవారికి దూరాన క్షీరసాగర వక్షం మీద వట పత్ర శాయిని చూపించ గలుగు తున్నాడు ఇతడు.

ఇప్పుడు నూతన యుగ శక్తుల వల్ల తూర్పు పడమరలు ఒక దానిలోనికి ఒకటి ప్రవహించుకుపోయాయి. ఇక్క డ కూడా సమాజ జీవితంలో పాశ్చాత్య సమస్యలూ, ఒడుదొడుకులూ వచ్చాయి. నన్ను గంగా తీరాన నిశ్చలంగా కూర్చుండనియ్యడం లేదు. నన్ను నైమి శారణ్యంలో దివా నిశలు తపస్సు చెయ్యనియ్యడం లేదు. దిన దినమూ, ప్రతి నిమిషమూ ఒక అనుభవం కావ్యానికి సరిపోయే సామగ్రిగా అయిపోతోంది. జీవి తానుభవాలూ, జాతీయ సంఘటనలూ, ప్రపంచ పరిస్థితులూ ప్రత్యుత్తరం ఇచ్చేదాకా నన్ను ప్రశ్నిస్తున్నాయి. కనుక నే నొక కథానాయకుణ్ణి అయి, నా ప్రేయసినే అమర కన్యను చేసి, నా తోటనే నందనారామం చేసి, నా మనుగడనే మహా యజ్ఞం చేసి, నా గాథనే ఆది పురుషుల గాథంత ఆదర్శ ప్రాయం చేసి ఆప్యాయంగా వినిపిస్తున్నాను.

అక్కడ పాశ్చాత్యులలో శత సహస్ర అగ్ని పర్వతాలు మానవ మధ్యాన గుండెలు బద్దలు చేసుకొని నేడు ఆక్రోశిస్తూండడం వల్ల "అబ్బా! ఈ చీకటికి, ఈ అశాంతికి అవల నున్న వెలుగూ, పిలుపూ ఏ తపోవనంలో వినబడతాయా" అని 'రొమెయిన్ రొలాఁ', 'ఈట్సు', 'ఎ. ఇ,' వంటి ద్రష్టలూ, కవులూ ప్రాచ్య విజ్ఞాన

లోకంలోకి చేతులు చాపి కాళిదాసు మొదలుకొని రవీంద్రుడి దాకా మన మహాకవు లందరినీ ఆహ్వానిస్తూ శిరసా వహిస్తున్నారు.

మన గ్రంథ మందిరంలో కాళిదాసు, భవభూతి, రవీంద్రుడు, మిల్టన్, షెల్లీ, మేటర్‌లింక్ - ఇలాగ పంక్తులు దీర్చి ఉంటున్నారు. వారి పుస్తక మందిరంలో షేక్‌స్పియర్, ఈట్స్, కాళిదాసు, ఠాకూర్ - ఇలాగ ఒకరి నొకరు ఒరుసుకొంటూ ఆసీను లయినారు. ఈ మహాసంయోగాన్ని పూర్తిగా అర్థం చేసుకొని అనుభవించి అందరికీ అనునిమేషం ప్రబోధిస్తున్న విశ్వ భారతీమూర్తి వర్తమాన లోకైక గురుదేవుడు రవీంద్రుడు.

అసలు ఇక్కడ మనం సూక్ష్మంగా గ్రహించవలసి ఉంటుంది ఒకటి. నిజానికి ప్రతి కవీ కూడా యువావస్థలో తానే నాయకు డైన భావగీతాలు ఆలపిస్తాడు. తర్వాత తాను పెరిగి కష్టసుఖాల కతీతు డయాక నాటకాలూ, మహాకావ్యాలూ వినిపిస్తూ, నిత్య సత్యాన్నీ, నిశ్చల తత్త్వాన్నీ నిభృత సందేశాలుగా పంపుతాడు. కనుక ఏ ఉత్తమకవి కావ్య చరిత్ర అయినా సంపూర్ణంగా చూస్తే అన్ని విధానాలూ కనబడతాయి. అసలు ప్రతి మానవుడూ అలాగే పెరుగుతాడు.

భావగీతంలో కవిత్వలావణ్యం ఎక్కువ ఉంటుంది. మహాకావ్యంలో కవిత్వసందేశం ఎక్కువ దొరుకుతుంది. అసలు కవి కాకపోతేనేమి, ప్రతి మానవుడి జీవితంలోనూ ఈ తరగతులూ, సోపానాలూ అవీ కనబడవూ? కాళిదాసు 'ఋతుసంహారము' నుంచి 'శాకుంతలం' దగ్గిరికి ఎలా పెరిగాడు? రవీంద్రుడు 'Gardener' నుంచి 'సాధన' దగ్గిరికి ఎలా పెరిగాడు? షెల్లీ 'Skylark', 'West Wind' దగ్గిర నుంచి 'Prometheus Unbound' దగ్గిరికి ఎలా

పెరిగాడు? Wordsworth లో, Tennyson లో, Browning లో ఈ పరివర్తనమో, ప్రయాణమో ఇలాగే కనబడుతుంది కాదూ!

ఒక కవి జీవితంలో యౌవనంలో భావగీతాలు రేగి, పరువంతో మహాకావ్యాలలాగ ఎలా ధ్వనిస్తాయో అఖిల మానవ విధానంలో యౌవనస్థితిలో ఉన్న పాశ్చాత్య కవిత్వం అలా తన కష్ట సుఖాలను హాయిగా వినిపిస్తుంది. వృద్ధస్థితిలో ఉన్న ప్రాచ్య కవిత్వం చల్లని తరణోపాయాలను అందిస్తుంది.

మహాయుద్ధం ముగియబోయే రోజుల్లో రవీంద్రుడు వినిపించిన గీతం ఒకటి నాకు స్ఫురణకు వస్తుంది - స్త్రీని గూర్చి. దాని తాత్పర్య సంగ్రహం ఇది: "సాయంకాలం శర్వరిగా కరిగి పోతున్నది. క్షతగాత్రు లైన యోధులూ, మహారథులూ ధూళి శయ్య మీద ఒరిగిపోతూ ఉన్నారు. రా వమ్మా, తల్లీ! నీ అభయ హస్తంతో శిశిరాంజనమూ, అమృత భాండమూ పట్టుకొని రా! ఈ మానవలోకానికి నీ చూపులు నక్షత్రాలు; నీ చిరునవ్వు చంద్రాతపము. అలిసి చితికి పోయిన ఈ వీరలోకానికి శాంత మధుర జీవనాన్ని అనుగ్రహించు!"

ఇక్కడ పాశ్చాత్యలోకం పురుషుడూ, ప్రాచ్యలోకం స్త్రీ; పాశ్చాత్యలోకం అనుభవం, ప్రాచ్యలోకం ఫలం; పాశ్చాత్యలోకం వివిధ కార్యకలాపంతో ఊపి రాడని పగలు, ప్రాచ్యలోకం అగాధ శాంత నిశ్చల మైన విశ్రాంత రాత్రి! ఈ లక్షణాలే ప్రాచ్య పాశ్చాత్య కవిత్వాలలోనూ కనబడతవి.

కనుక లోకానికి నిశాదివాల్లాగ, గృహానికి స్త్రీపురుషుల్లాగ మానవ వికాసానికి రెండు కవిత్వ విధానాలూ — విధిగా అలాగ విడదీయవలసి వస్తే — అవసరాలే!

మనలో కొంతమంది పాశ్చాత్యకవిత్వం మానవ జీవితావధి దాటి వెళ్ల దని అంటూ ఉంటారు; అమృతత్వంలో దానికి నమ్మకం లేదు అంటారు; నిత్య సత్యంతో దానికి సంబంధం లే దంటారు. నక్షత్ర వీథిలో ఉన్న నిశ్శబ్దాన్నీ, ఏకాకి పర్వతాలలో ఉన్న నిద్రనూ "విన గలిగిన" మహాయోగి Wordsworth. "ఆంధ్రకవిత్వ దీక్షావిధి" పూనిన తిక్కన సోమయాజిలాగ Wordsworth "dedicated spirit". "మేలుకొని కలలు కంటా" నన్నాడు ఒకానొక ఆంగ్ల కవి. "ఈ కావ్యాలు నావి, నావి కావు కూడాను" అన్నాడు ఇంకొకడు - 'పలికించెడి వాడు రామభద్రుం' డన్నట్లు. 'Grecian Urn'ను Keats కవి ఎలా సంబోధించాడు! "ఓ నీరవ మూర్తీ! అనంతతత్త్వం లాగే మా భావాలలోనుంచి నీవు మమ్మలిని ఎలా కదిపి బాధపెడుతున్నావు!" అన్నాడు. అయ్యో- షెల్లీని ఎందుకు నాస్తికు డంటారో! మానవుడు 'అమృతస్య పుత్రః' అని ఉపనిషత్తులాగే చెప్పినాడే! "ఈ చీకటి బానిసత్వాన్నుంచి నీవు ఈ లోకాన్ని విముక్తను చేస్తావు అనే ఆశతో కలిగిన ఆనందం నానా దిశల ఫాలాన్ని వెలిగించడం లేదా? ఓ దుర్నిరీక్ష్య సౌందర్యమా! నా దరిద్రవాక్కులు నిర్వచించలేనిది ఏదో నీవు అనుగ్రహించవా!" అన్నాడు. ఎంత బలవంతుడైన భాగవత శిరోమణి షెల్లీ! Browning ఎట్టి విశ్వాసి! ఈ బతుకు తరవాత బతుకులో ఎట్టి దృఢ విశ్వాసం లేకపోతే Rabbi Ben Ezra వ్రాస్తాడు! "నాతో కూడా ముసిలివాడవు కాగూడదా" అంటాడు. "మానవుడు స్థూలంగా కర్మ అని పట్టి చూచే దాన్నే కాక అతని కలలూ, కోరికలనూ కూడా స్వీకరించి, భగవానుడు విలువ కడతాడు సుమా!" అంటాడు ఆయన. ఆ కమ్మరివాని చేతిలో నలిగిపోయే బాధాభాగ్యం ఆ కవికే లభించింది!

ఇక మన కవులు మానవ సమస్యలను వదలిన వాళ్లూ కారు, ఇహలోక సౌందర్యాన్ని నిరసించిన వాళ్లూ కారు. కాళిదాసు ఈ సృష్టిసౌందర్య మంతా ప్రత్యుషస్సు యొక్క హిమవర్షంలో తడిసి స్వచ్ఛంగా ఉన్న లావణ్యవతిని లాగ ఎప్పటి కప్పుడు చూపిస్తాడే! భారతంలో దేవయాని, శర్మిష్ఠ, గాంధారి, ద్రౌపది, కౌరవులూ, పాండవులూ, శకునీ మొదలైన వాళ్లూ, వాళ్ల గాథలూ, వాళ్ల ధోరణులూ, వాళ్ల సమస్యలూ ఈ లోకమంత విస్తారంగానూ ఉన్నాయి కాదూ? వరూధిని నిజంగా అమరవేశ్యా, కాక హంపీ నగరంలో ఆంధ్ర కవితా పితామహుని అపాంగ వీక్షణాలతో అల్లలాడించిన అపూర్వ విలాసవతా! నిగమశర్మ అక్కగారు ఇప్పటికీ ఆ పిఠాపురంలో నీ యింటా, నా యింటా "ఇంతలు నంతలు ....తన చంట వెంట" తొందర చేస్తూ ఉండగా లేమా? ఆ మహా కావ్యాలలో ఆ చిన్న చిన్న ఖండాలు కత్తిరిస్తే ఆ కవి అనుభవాలతో వేడివేడిగా వచ్చే భావగీతాలు కావూ అ వన్నీ!

కనుక ప్రతి మహాకవీ, ఏ భూఖండంలో వాడైనా, ప్రాక్పశ్చిమాలకే కాక ఉత్తరదక్షిణాలకూ, పూర్వ వర్తమాన భవిష్యత్తులకూ సేతువుగానే ఉంటాడు. అయినా మనవారు ఈ మహాకవి వాక్యాలు మననం చెయ్యాలి:

"సరే, మనం పశ్చిమలోకానికి అమృతాన్నీ, స్వర్గ రాజ్యాన్నీ ఇవ్వాలి. మనం పాశ్చాత్య లోకం నుంచి శాస్త్ర దృష్టిని స్వీకరించాలి. రెండూ కవిత్వానికి అవసరాలే! సత్యానికి ఆకాశమే కాక, గూడు కూడా ఉంది. ఆ గూటిని స్పష్టంగా ఒక ఆకారంలో కట్టాలి. దానికి నిర్మాణ శాసనాలూ, నియమాలూ గట్టివి కొన్ని ఉన్నాయి. ఆ గూటిని మళ్లీ మళ్లీ మార్చి కట్టవలసి వచ్చినా ఆ నిర్మాణావసరం ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. దాని శాసనాలు నిత్య సత్యాలు. కొన్ని శతాబ్దుల నుంచీ ప్రాచ్యలోకం సత్యం కోసం

ఈ కులాయ నిర్మాణాన్ని ఉపేక్షించింది. దాని రహస్యం గ్రహించడంలో జాగరూకత వహించడం లేదు. ఏ దారీ లేని, నిరవధి కాకాశాన్ని దాటి పోదా మని కేవలమూ రెక్కల మీదనే ఈ ప్రాచ్యలోకం ఆధారపడి ఉన్నది; ఈ భూలోకాన్ని పాదాల కిందికి తోసి పారేసింది. చివరకు గొప్ప తుపానులు రేగి పడ్డాయి, రెక్కలు విరిగిపోయాయి. ఇప్పుడు అచంచల సహాయం కోసం అలిసి పోయి పడిపోయింది. ఈ ప్రాచ్యలోకం కోసం వైకుంఠ వార్తాహరుడై ఉంటూ, లౌకిక కులాయ నిర్మాత అయిన వాడు కూడా ఎవడూ రాడా?" ఇది చదివి నప్పుడు "వెణవికుండు ------ నేడు పుట్టవలె బృందారణ్య దేశంబులన్!" అన్న ఆంధ్ర కవి రాయని విలాపం జ్ఞాపకం వచ్చింది. ఈ మాటలు రవీంద్రునికి చెందినట్టు ఎవ్వరికీ చెందవు. ఇవి పలికిన రవీంద్రు డొక్కడే ప్రాక్పశ్చిమ కవిత్వ లోకాలకు అమరసేతువు! రవీంద్రుడు మానవోత్తముడూ, రవీంద్రుడు రుషిసత్తముడూ!

నేటి ప్రతి ఆంధ్ర కవీ సామాన్య పాశ్చాత్య కవి వలె అనుభవించి, సామాన్య ప్రాచ్య కవి వలె తెలుసుకొని, మానవ శ్రేయానికి రవీంద్రుని లాగ గేయాలు వినిపిస్తేనా!

ఇంత దూరాన్నుంచి ఈ అజ్ఞాత కవి శిరస్సు ఆయన చరణ కమల సన్నిధానంలో ఒదిగి పోతుంది!

—రేడియో ప్రసంగంగా ప్రసారితం.

# మా ప్రణయ లేఖల కథ

('జనవరి రెండో తారీఖు ఉదయాన్నే వ్రాశాను' అన్న వివరణతో, 'సఖి' పత్రిక - రుధిరోద్గారి (1923-24) పుష్య సంచికలో ప్రచురితం)

## 1

నా జీవిత పరిమాణ మెంతో కాని బ్రతికిన ఇరవై యేడేళ్లలోనూ నాకు ప్రేమ దొరికింది కాదు; నా ఆదర్శానికి సరిపోయే సౌందర్యమూ దొరికింది కాదు.

నేను వాటికోసమే పుట్టాను; వాటికోసమే జీవిస్తున్నాను. నా పసికన్ను రెప్పల చాటునుంచి నా మొదటి చూపు అల్ల నల్లన విచ్చుకుని, వాటికోసమే "ఎక్కడున్నాయి?" అని ఆశ్చర్య పడుతూ ప్రశ్నించింది; నా లేత హృదయము "ఎక్కడున్నాయి?" అని వాటికోసమే మొదటిసారే తత్తరపాటుతో కొట్టుకుంది.

నేటికి కూడా నా వీక్షణములో ఆ ప్రశ్న ఒక్కటే నిలిచి ఉంది; ఈ ఇరవై యేడేళ్లూ నా హృదయ ఒక్క మా జబాబుకే కొట్టుకు పోతూంది.

ఉయ్యాల రోజుల్లో ఆ ప్రశ్నలో తొందర ఉంది. ఆటపాటల దినాల్లో అమాయకత్వ ముంది. నవయౌవనములో ఉత్సాహ

పులకిత మైన సిగ్గు ఉంది. నేడు నిరాశా, నిస్పృహత్వమూ, నిరసన భావమూ, నిర్లక్ష్యమూ ఉన్నాయి. ప్రశ్న మాత్రము నిలిచి ఉంది.

నడి వేసవి నాటి మట్ట మధ్యాహ్నపు కారు చిచ్చులలో ఇంటింటికీ, కడవ కడవకూ తల్లడిల్లి పోయే కాకి వెర్రి పరువుల్లో ఆ ప్రశ్నే ఉంది; ఏడాది కేడాదీ, నె లంతా, ఇరవై నాలుగ్గంటలూ, ప్రతి నిముషమూ, ఆజన్మాంతమూ, వీథి వీథికీ, గడప గడపకూ సోలి తూలే బిచ్చగాని కాటకపు చేతిలో, కరువు నడకల్లో, వాని నిలువునా ఆ ప్రశ్నే ఉంది. అంతకంటె తీవ్రంగా, అంతకంటె భయంకరంగా, అంతకంటె ఉన్నతంగా, అంతకంటె దుందుడుకుగా ఆ ప్రశ్నే నిలిచి ఉంది నా చూపులో, నా హృదయములో.

ఈ బేల జీవితాన్ని అరచేతిలో పెట్టుకొని లోకంమధ్య చాపాను; నిరసనభావము దానిమీద ఉమ్మేసింది. క్రౌర్యము దాన్ని పొడిచి వేసింది, కౌటిల్యము చించేసింది. కాని ఆ చాపిన చెయ్యి చాపినట్టే ఉంది. వాడ వాడల అపరిచితపు కాకులూ గద్దలూ ఎగిరివచ్చి తుత్తునియలు చేసి పోయిన ఈ శిథిల జీవితము తన రుద్ధ కంఠ మెత్తి ఇప్పటికీ ఆ ప్రశ్నే వేస్తూంది. జబాబు లేక కుంగి పోతూంది. మళ్లీ మళ్లీ ఆ ప్రశ్నే వేస్తూంది. నరక వేదనలో బూడి దై పోతూంది.

నా కైదే ళ్లున్నప్పుడు నా మొదటి వలపు. ఆమెకు ఇరవై అయిదే ళ్లేమో! ఆమె వీణ వాయిస్తూన్నప్పుడు ఆ బంగారపు వేళ్లు నా చిన్ని హృదయాన్నీ నొక్కేవి; అదీ పాడేది. ఆమె కెదురుగా కూర్చుండి ఎందుకో నిండా తెరుచుకుని పోయిన నా కళ్లతో నాలోని కామెను లాక్కొనే వాణ్ణి; అలా చేస్తూ ఆమె కాళ్ల దగ్గిర పెంపుడు కుక్కపిల్ల లాగ నిద్రపోయే వాణ్ణి; ఆమెను కలలు కనే వాణ్ణి; మేలు కొనేటప్పటికి కంటి నిండా మళ్లీ ఆమె నిండి ఉండేది. తరవా త్తరవాత ఆమె యెక్కడికో అదృశ్య మై పోయింది. అప్పు డేదో

ఎందుకో, ఎంత కాలమో బాధ పడ్డాను. ఆ వేదన తెలియరానిదీ, తెలుపలేనిదీని. ఆమె యే మను కునేదో నన్ను గూర్చి!

నా పన్నెండో యేట ఇలాగే ఇంకో స్త్రీని వలచాను. ఈమెకు పద్దెనిమి దేళ్లు. చక్కదనమంతా కలిసి ఈమె ముఖమైంది; ముఖ్యంగా కళ్లు. అవి మాట్లాడేవి, పాడేవి, ఆలోచించేవి, ఎక్క డెక్కడికో యెగిరి పోయేవి. ఆ కళ్లవేపే నే నెప్పుడూ చూసేవాణ్ణి. అవి తిరిగి చూసినప్పుడు చటుక్కున రెప్పల కిందికి పారిపోయేవో నా చూపులు, లేక పక్క పక్కలకి తప్పుకునేవో. అప్పుడు "నీ కళ్లు బా గుంటాయి" అనేది. ఈమె కళ్లకేసి ఎప్పుడూ చూడడం వల్ల నా కళ్లు అలాగే అయాయో, లేక తన కళ్ల ప్రతిబింబం నా కళ్లల్లో చూసిందో! తరవా త్తరవాత వివాహమై మాయ మై పోయింది ఈమె కూడా నా జీవితంలోనుంచి. అప్పుడు మూడేళ్లు నా సుకుమార హృదయం భయంకర తాపంలో కుమిలిపోయింది. అన్నం సాయించేది కాదు. గుండెలో ఆకలి గాని ఆకలీ, దాహం గాని దాహమూ రేగిపోయేవి. గొంతులో ఇవతలికీ వెళ్లక అవతలికీ వెళ్ళక ఎప్పుడూ ఏదో ఉండేది. ఎవరేనా పలకరిస్తే ఏడుపు వచ్చేది; ఎందుకో అందరూ న న్నీ వేధించడం! నవలల్లోనూ కథల్లోనూ మమ్మల్నిద్దర్నీ ఆనవాలు పట్టేవాణ్ణి; పట్టుతూ ఎందరు దొంగల్నో పట్టుకుని, ఎందరు క్రూరుల్నో హింసించి, ఈమె నెన్ని గండాల నుంచో తప్పించేవాణ్ణి. ఆ వేదన అధిక మై పోయింది. ఈమెకు మాత్రము తెలియదు. క్రమక్రమంగా ప్రణయగీతాలూ, విరహ గీతాలూ వ్రాయ మొదలెట్టాను. అవి ఇప్పుడు బా గుండ వేమో ఎవరి కీని. అప్పుడు నాకు హృదయ శాంతి ఇచ్చేవి.

తరవాత ఒక అద్భుతవ్యక్తి నా హ క్కయింది. నా కోసమే జీవితం వహించింది. తన ప్రేమతో నన్ను కప్పేసింది. నా కూపి రాడింది కాదు. నా కెందుకో ఇరు కైంది ఈ ప్రపంచం. అప్పుడు

తన శరీరమూ మనస్సూ హృదయమూ నాతో నింపేసుకుంది. తాను కూడా నాలో నిండిపోదా మని నా వైపు తన రెండు చేతులూ చాపుకుంది. నేను పెడ మొగం పెట్టాను; తొలగిపోయాను.

అప్పుడు రెండు కళ్లూ తెరుచుకుని రాత్రీ పగలూ నా కేసే చూసేది; ఏమీ తోచక నే నా రెండు కళ్లూ ఊడబెరికేశాను. అప్పుడు నా కంఠరవం వినడాని కని శరీర మంతా శ్రవణాలుగా విప్పుకుని వేచి ఉండేది; నేను సహించలేక వాటిలో పాషాణ శూలాలు గుచ్చేసి ఆమెకు శాశ్వతంగా మూగనై పోయాను. అప్పుడు ప్రతి నిముషమూ నా దగ్గిరగా చేరి తన హృదయం తొందర తొందరగా మోగించేది - దానితోనే వింటున్నట్టూ చూస్తు న్నట్టూను! నాకు అపరాని కోపం వచ్చి దాన్ని తునకలు తునకలుగా చింపేసి దుమ్ములో విరజిమ్మేశాను. అప్పుడు నా పాదాలమీద ఆరాధిస్తున్నట్టు పడిపోయింది; నాకు వెర్రెత్తి ఆమెమీద నడిచి పోయాను; అప్పుడే ప్రేమమీదా, విశ్వాసంమీదా, ఆనందంమీదా కూడా నడిచిపోయాను.

ఈ విధంగా, ఆరేడే ళ్లయేటప్పటికి చిరునవ్వు కార్చిచ్చు చూపులతో కాల్చేసి, అభినందన అశనిపాతంతో అణగ దొక్కి ఆ చిత్రవధ పూర్తి చేశాను; హంతకు ణ్ణయాను.

హంతకు ణ్ణయాక ఆ ప్రశ్నలోకి నిస్పృహత్వం వచ్చింది; అందువల్లనే తొందర హెచ్చింది; ఇక జవాబు రాదని తెలిసి మరీ తొందర హెచ్చింది.

ఇక ప్రేమా, సౌందర్యమూ, విశ్వాసమూ నాదగ్గిరికి సమ్మి ఎలా వస్తాయి? నాటినుంచి పరుగు పరుగున ప్రపంచ మంతా తిరగడం మొద లెట్టాను. తిరుగుతూ ప్రతి వస్తువు వైపూ చూశాను సౌందర్యం కోసం; అది కనబడుతూ కనబడుతూ చేయి చాపుతుండగానే

మాయ మయేది. ప్రతిముఖం కేసీ చూశాను ప్రేమకోసం; అది ఎదురు చూస్తూ ఎదురు చూస్తూ పోల్చుకుంటుండగానే పెడ మొగ మయేది. ప్రతి హృదయాన్నీ పలకరించాను విశ్వాసం కోసం; అది మారు పలుకుతూ మారు పలుకుతూ ఆలింగనం చేస్తుండగానే మూ గైపోయేది.

అప్పు డీ హంతకుడు ఉన్మత్తుడు కూడా అయాడు. అదివరకు నేనూ అందరిలాగే ఉండేవాణ్ణి. కాని తరవాత ఎప్పుడూ తిరగడం వల్ల నా కాళ్లు తేలిపోతూ పరిగెత్తడమే. ఎప్పుడూ గిరగిర చూడడం వల్ల చీపిరి కళ్లు అయిపోయి ఊరికే ఎప్పుడూ తిరగడమే నా కళ్లు. ఒకటే వెదకడం వల్ల వంగిన వీపూ, అటూ ఇటూ అకారణంగా తిరిగే మెడ. రెండు చేతులూ ముందుకు చాపి, ఒక చేతితో ఏదో యిస్తున్నట్టూనూ, ఒక చేతితో ఏదో అడుగుతున్నట్టున్నూ.

లోక మంతా నవ్వడం మొద లెట్టింది; "ఏమిటీ వెర్రి వాలక" మంది. నేను లక్ష్య పెట్ట లేదు; నాకు వినబడనే లేదు. ప్రతి వ్యక్తికీ, ప్రతి ప్రాణికీ, ప్రతి పదార్థానికీ నా హృదయమూ నాజీవితమూ అప్ప జెప్పే వాణ్ణి! మళ్లీ మళ్లీ నిరసనపొంది ధూళిలో పడిఉన్న శిథిలతర హృదయాన్ని మళ్లీ మళ్లీ దేశ దేశాల్లో వాడ వాడల్లో గుమ్మం గుమ్మం దగ్గిరా అమ్మకానికో, ఉచితంగానో అంటగట్ట జూసేవాణ్ణి!

ఈ విధంగా కదలిక హెచ్చి హెచ్చి కొంత కాల మయాక ఒక వింత స్తిమితం వచ్చింది. సంధి రేగి రేగి సరి యైన పరిస్థితి సంభవించింది.

ఇదివరకు నా సంగతీ, నాతత్త్వమూ నాకే తెలియ లేదు. అందువల్లనే బేల నై పోయాను. లోకాని కంతా ఒక్కణ్ణే హాస్యాస్పదుణ్ణయాను.

ఇప్పుడు బా ధంతా ఘనీభవించి దుఃఖ మైపోయి బతు కంతా నిండిపోయింది. నేను గ్రహించాను - ఇది ప్రాయశ్చిత్త మని.

ఇదివరకు లోకంమీద రోషంతో కూడా ఏదో వాంఛ ఉండేది; దాన్ని ఆకర్షించా లని కూడా చూసేవాణ్ణి. ఇప్పుడు దానిమీద అసహ్యమూ, నిరసనమూను; కానీ దాని తోవ దానిదీ, నాతోవ నాదీ అనుకున్నాను.

ఇదివరకు ఖులాసాగా ఆనందం నటించేవాణ్ణి లోకములో వా ణ్ణవడానికి. "వీ డెందుకు ఏడవడు?" అని లోక మసహ్యించు కుంటూ నవ్వుకునేది. ఇప్పుడూ ఆనందం నటిస్తాను, లోకానికి నా దుఃఖం కనబడకుండా ఉండడానికి. కాని నే నేకాంతంలో ఆలపించే దుఃఖగీతాల రొదలు లోకం కొద్దిగా విని, వాటిలో సత్యం లే దనుకుని, "వీ డెందుకు ఏడుస్తున్నా నంటాడు?" అంటుంది ఇప్పుడు.

ఇదివరకు నా గీతాలలో లోకసామాన్య మైన బాధలూ, కోరికలూ, దుఃఖాలూ స్ఫురించేవి; ఇప్పటి దుఃఖ గీతాలలో లోకాతీత మైన సంతృప్తీ, ఔన్నత్యమూ "నన్ను ముట్టుకోకు' అంటున్నాయి. అసలు ఎప్పుడూ నా హృదయభారం విడబోసు కుందుకు నా విషాద గీతాలు. లోకానికి నే నర్థం గా నని నాకు తెలుసు. కనుక నాతో నేనే నా కథ చెప్పుకుంటాను. నాతో నేనే మొర బెట్టుకుంటాను. నన్ను నేనే ఊరడించుకుంటాను. నన్ను నేనే అన్వయించుకుంటాను, అర్థం చేసుకుంటాను. నామీద జాలైనా పడలే దీ లోకం. నా స్వేచ్ఛాయాత్రలో, నా ప్రేమాన్వేషణంలో, నా దుఃఖసమయంలో, ఎన్నడూ నాతో రాలే దీ నిర్జీవ ప్రపంచం, నాకు నేనే ఉన్నాను; నాప్రాణ మిత్ర మీ విశ్వ ముంది. సర్వాధికారి ఒక డుంటే ఈశ్వరు డున్నాడు. అందు వల్లనే నా స్వేచ్ఛాగీతాలలో

నా ప్రేమగీతాలలో, నా శోకగీతాలలో నాకు ఈ సామాన్యలోకం లేదు. వాటిని నాకో, నాలాగే స్వచ్ఛందజీవమూర్తి అయిన ప్రకృతికో ఆలపించేవాణ్ణి; పరమేశ్వరుని పాదరేణువునే ప్రార్థించే వాణ్ణి అనుకంపకొరకు.

ఇంతకూ లోకానికి కళ్లూ లేవు, మనస్సూ లేదని నే నెరుగుదును. అమి తోల్లాసమూ, అత్యంత విషాదమూ అంటిపెట్టుకుంటా యని దానికి తెలియదు. వాటి మధ్య కనబడీ కనబడని సరిహద్దు. ఒకదానిలోనుంచి ఒకదానిలోకి ఇట్టే ఒకటే అడుగు !

కాని ఇదివరకు ఆనందం తెచ్చిపెట్టుకున్నప్పుడు ఆ వెర్రిబలంలో లక్ష్యం లేకపోయింది. ఇప్పుడూ, ఎన్నడూ, నలుగురిలోనూ కన్నీరు కురియను. నిట్టూర్పు రానీను. కాని ఒక నిముషం నటించానో, ఏకాంతంలో ఒక రాత్రి నగం నీరసించానే !

ఇంకో నటన వచ్చిపడింది. పాత చరిత్రం ప్రాయశ్చిత్తం ద్వారా పూర్తిగా అర్థ మవడంచేత, ఈ భయంకర దుఃఖార్చులు ఇంకొకరికి దుస్సహ మని గ్రహించి, లౌకిక బంధాలవల్ల నన్ను చేరేవాళ్లమీద వలపు నటించడం మొద లెట్టాను. ఇంక రక్తం తాగలేను; హత్య చెయ్యలేను ; ప్రేమకు బదులు రాకపోతే హృదయం ఎంత తపించుకుపోతుందో గ్రహించాను ; కనుక అద్భుతంగా నటించడం ప్రారంభించాను.

కాని, లేని ప్రేమ నటించడం మరీ దుస్సహం. అమ్మా ! ఈ హృదయమూ, ఈ జీవితమూ ఎంత అలిసిపోయాయి !

కనుక, చూశారా, నాకు ప్రేమ దొరికింది కాదు. నేను ప్రేమించిన వాళ్లు నన్ను ప్రేమించ లేదు; నన్ను ప్రేమించిన వాళ్ళని నేను ప్రేమించ లేదు. ప్రేమ లేని చోటికి సౌందర్యం రాదు. సౌందర్యం లేని చోటికి ప్రేమ పోదు గదా !

ఇంక ఏం చెయ్యను? ప్రవాసి నైపోయి కృశించడం మొద లెట్టాను; వేటికోసం పుట్టానో అవి లేకపోవడం వల్ల మెల్లమెల్లగా నీరసించిపోతున్నాను.

కాని ఎవ్వరూ నన్నర్థం చేసుకోలేదు. కొందరు స్వేచ్ఛావిహంగం అన్నారు; కొందరు కుటిలపన్నగం అన్నారు; కొందరు మూఢ దివాంధం అన్నారు. నేను మాత్రం నా యథార్థస్వరూపం అజ్ఞాత దుఃఖంలో పదిలపరచాను.

నా హృదయాంతరాళాల్లో దాచేశాను నా బాష్పవారాశుల్ని! నా జీవితమధ్యంలోకి తరిమేశాను నా నిశ్వాస ప్రభంజనాల్ని. అవి నాలో లోపల లోపల నుసి చేసేస్తున్నాయి; లోపల లోపల గుల్ల చేసేస్తున్నాయి!

ఒకసారి మాత్రం ఒక సహృదయుడు, "నీ కళ్ల నాట్యాల్లో ఏదో అలసట ఉంది. వాటి పాటల్లో ఏదో వెలితి వస్తూంటుంది. వాటిలో తళతళలు సంధ్యారుచుల వంటి వనుకుంటాను; వెనకాలే పొంచి నిశీథ తమస్సు లున్నాయి. ఆ కళ్లు మాతో నవ్వుతూ నవ్వుతూ మాట్లాడుతూ మాట్లాడుతూ ఇట్టే ఆత్మగతంగా వాటిలో అవే గొణుగు కుంటాయి" అన్నాడు. ఇతడు సూక్ష్మదర్శి కూడాను, కవిన్నీ.

నేను మొగం తిప్పేసుకున్నాను. అదే నేను మొదటిసారి ఇత రుల దగ్గిర కన్నీరు తెచ్చుకోడం.

నే నేకాంతంలో మాత్ర మప్పు డప్పు డేడుస్తాను.

## 2

ఇంతలో ఒక సంవత్సరాది వచ్చింది, లోకాని కంతా వచ్చింది. మానవలోకానికి మాత్రమే కాదు; చెట్లు చేమలకీ, రాయి

రవ్వలకీ కూడా వచ్చింది. నవజీవనంతో, నవనవోత్సాహంతో, నవనిర్మలానందంతో వచ్చింది.

నాకు మాత్రం రాలేదు.

ఉదయాన్నే ఒక మిత్రుడు చిరునవ్వుతో నా కభినందన మం దిచ్చాడు. "నీకు కొత్త సంవత్సరం కొత్త ఆనంద మిస్తుంది" అని హెచ్చరించాడు. ఈ ఆశా సందేశమే, ఈ ఆనం దాభినందనమే, ఆ దినము ఆశావకాశా లంతా అలముకొని పోయింది. హిమాలయము కను విచ్చి వాత్సల్యంతో శిరస్సు వంచింది; అణువు గర్వోద్రేకం వల్ల పై కెగసింది!

నా కొక వికృత మైన నవ్వు వచ్చింది. ఒక గీతము కూడా వచ్చింది:

నా కుగాదులు లేవు
నా కుషస్సులు లేవు
నేను హేమంత కృ
ష్ణానంత శర్వరిని
నాకు కాల మ్మొక్క
టే కారు రూపు నా
శోకమ్ము వలెనె, నా
బ్రతుకువలె, నావలెనె -

అంటూ ఏమిటో గొణుగుకున్నాను ఆరోజు రోజంతా. నాడు విశ్వ మంతా విరిసిపోయిన నాట్యాలకూ, క్రీడలకూ, ప్రణయోత్సవాలకూ ఇదే నా తిరుగుమాట, నా జబాబు.

ఆ రాత్రి నాస్నేహితురా లొకర్తెకు వీడ్కోలు ఇస్తున్నాను. నా డామె నదే తొలిసారి కలుసుకోవడము.

"మీకు కొత్త సంవత్సర మానందప్రద మవా లని కోరుతున్నాను" - ఇదీ అమె మొదటి మాట.

"కృతజ్ఞుడను" అని తల వంచుకున్నాను - ముఖం మీద వికృత భావా లేవైనా ఆమెకు కనబడతా యేమో అనిన్నీ, నాలో ఒకటే మోగి పోతూన్న నా గీత మొక్కసారి వినడానికిన్నీ.

నేను గుడ్లగూబ నై పోయా నని నా మిత్రురాలికి తెలియదు. వెలు గక్కర లేని స్వభావం అయిపోయింది నాది. నేను సర్వద్వేషిని కూడా అయాను; దేనిలో కూడా విశ్వాసం లేదు అప్పటికి; అక్కర్లేదు.

ఆ రాత్రి తిరిగి వచ్చేశాను; స్వగృహానికి గాదు; సముద్ర తీరానికి. నాకు ఆ రోజున ఆ మహాసముద్రుని సందేశ మేదో తెలుసు కోవా లని కుతూహలమూ, ఆతురతా కలిగాయి.

పాప మతనికీ ఆ నిశీథాన్నే కాస్త ఏకాంత సౌఖ్యం. అంత ఏడుపు సందడీ, అంత కడుపు చిచ్చూ పగ లల్లా తీరస్థు లెవరూ గ్రహించ రని తెలుసు. మొండి కెత్తాడు నాలాగే. అబ్బ! రాత్రుళ్లు మాత్రం ఏ మేడుస్తాడు!

మీ రెవరేనా ఎప్పుడేనా సముద్రతీరాన్ని ఏడ్చారా? అభిమాన వంతుల కదే అను వైన స్థలం, హృదయభారం విడబోసుకుందుకు. మన చిన్ని ఏడుపు అతని రోద నారావములలో ఒక జీరై ఇమిడి పోతుంది; మన కన్నీటి చినుకులు అతని బాష్ప వాహినులలో ఒక నాలుగు బిందువు లై కలిసిపోతాయి.

సరే, సాగర సందేశము విన్నా. ఇ దేమిటి? ఇ దేమిటి? ఆఁ; ఇదివరకు విన్నది కాదు. ఆ కంఠరవమే వేరు; ఆ స్థాయే వేరు! ఆ బాణీయే వేరు.

ఇదివరకు గర్జన, ఘోష, హాహారవము, హొూరు హొూరు. ఇది సంగీతము. పొర్లిపోతూన్న ప్రేమ ఇది! ఎగసిపోతూన్న ఆనంద మిది!

నేను చెవి ఒగ్గి విన్నాను. ఒకటే చెవిగా విన్నాను. మళ్లీ విన్నాను. మళ్లీ మళ్లీ. అయ్యో! ఇ దేమి వింత! ఏమి టీ వెర్రి! మహావిశ్వ మంతా మాడ్చివేసే కాలకూటాగ్ని లోలోన దాచుకుని, ముల్లోకాలూ ముంచెత్తే అనంతాశ్రు ప్రవాహాల నణచుకుని, కంఠ మెత్తి తగుదు నమ్మా అని గానం చేస్తున్నాడు.

ఆ గొంతులో ఆశ విరిసిపోతూంది; ఆనంద మెగసి పోతూంది; ప్రేమ పొంగి సోన లై పారుతూంది.

ఆ గొంతు భావోద్రేకం వల్ల వణుకుతూంది; నాట్యం జేస్తూంది.

నే నుండబట్ట లేకపోయాను. నిలబడ్డాను. కుడిచేయీ, తర్జనీ ముందుకు చాపాను. మొగ మంతా ఒక్కటే కళ్లుగా విప్పేశాను. గజ గజ వణుకుతున్నాను.

"సముద్రుడా! ఏ మయ్యా, సముద్రుడా!"

"ఆఁ! ఎవ రది? ఓహొూ హొూ!"

"ఏమయ్యా! ఏమి టీ ప్రణయగానాలు?"

"ఓహొూ హొూ!"

"ఎక్కడి వయ్యా ఈ ఆనంద సంకీర్తనాలు!"

"అహాహా!"

"అయ్యయ్యో! ఎందు కీ ఆటలు? ఈ పాటలు? ఈ ఉత్సవాలు? నీకూ సంవత్సరాది వచ్చిందా?"

"ఓహొూ హొూ! నాయనా, మీ కీ నిముష మందు నూతన వత్స రారంభ సమయమా? ఓహొూ, నా సంవత్సరాదు లెప్పు డెప్పుడో!

నాకు తెలియనే తెలియదు, తెలుసుకోవా లని తొందరే లేదు! హ్హ హ్హ హ్హ! నాకు కాల మంతా ఒకటే సంవత్సరాది! ఆహా! ఒకటే నిత్య నూతన వసంతం!"

"సెబాష్! నాకు నచ్చినవాడ వయ్యా! సముద్రుడా!"

"హ్హ హ్హ హ్హ"!

"ఒకటే కాదా, కాలం అంతా నీకూ ఒక్కటే రూపు కాదా? కాదా పాపం!"

"ఆహా!"

"ఎంత బాధ నీది! లోకంలో దుఃఖ మంతా నిజంగా నీవే - ఈ విశాల విశ్వంలో ఉన్న ఆర్తి అంతా నీదే కదా! నీవు ప్రవాసులలో చక్రవర్తివి. కేవలము ద్వేషస్వరూపుడవు. సాక్షాత్ శోకాధిష్ఠాన దేవుడవు. నీ శిష్యపరమాణువు కా డటయ్యా ప్రావృట్కాల పయోధరస్వామి! ఇంత అనంత విశ్వహృదయంలో నిండి ఉన్న నీ ప్రేమకు ఎవరు సమాధానం చెప్పగలరు? సెబాష్, ఎవ రెదురు చూపగలరు? విన వయ్యా, నా గీతం విను--

నా కుగాదులు లేవు
నా కుషస్సులు లేవు
నేను హేమంత కృ
ష్ణానంత శర్వరిని.
నాకు కాల మ్మొక్క
టే కాదు రూపు నా
శోకమ్ము వలెనె, నా
బ్రతుకు వలె, నావలెనె.

"ఓహోహొహో! ఏమిటీ వెర్రి వాగాడంబరము ? ఆగు! ఆగు - ఓహోహొహో! ఆగు."

"ఏమయ్యా! ఇదేమి!"

"ఓహో! ఏమా? ఏమా? నాకు శోక మేమిటి? నాకు ద్వేష మొకటా! నా ప్రేమకు తిరుగు లేదా? ఓహో, బాబూ, ఉన్మత్తుడవా? నిష్ఫల ప్రణయం వల్ల తల్లడిల్లిపోయిన ప్రియుడవా! కవివి డవా? కూడానా! ఆహాహ! విను, నాయనా, ఇటు విను. నే నెప్పుడూ ప్రేమతో నిండి ఉంటా నోయ్! నీ పై నేమిటో చూడు - ఆకాశము. ఆహా, నా లోన చూడు, ఆకాశమే. ఆకాశము నా ప్రియురాలు సుమీ! హ హ హ! మీ కాకాశ మంటే ఏమీ లేదు; నా కుంది. ఆకాశం నేనే నిర్మించుకున్నాను; నేనే నా అంత విశాలంగా పరుచుకున్నాను. ఆమె అంత దూరంగా ఉందని నేను కృశించను; నాకు బెంగే లేదు. ఓహోహొహో! ఆమెను నా ప్రేమతో, ఆదీ అంతూ లేని నా ప్రేమతో నేనే నింపాను. నా ప్రేమ సందేశాలు పంపుతుంటా; అప్పు డామె మబ్బులు మబ్బులుగా పులకరిస్తుంది. ఆహా! ఆమె ప్రణయ వార్తలు నా కందజేస్తుంది; అప్పుడు తరంగాలు తరంగాలుగా జలుజల్లు మంటుంది నా శరీరము. ఆహా, చంద్ర కిరణాలు మా కౌగిలింతలు! ఆహా, వర్ష బిందువులు మా చుంబనాలు! ఆ హా హా హా! నీవే అన్నట్లు ఇంత విశ్వవిశాల హృదయం ఊరికే ఉండ గలదా? అందుకే అంత ప్రియురా లైన ఆకాశానికి అనురాగ రూపం ఇచ్చుకున్నాను. ఇక నా అంత ప్రియు డేడోయి? ఓహో, నాయనా, కవి వంటావు; ప్రియురాలిని సృష్టించుకోలేని వాడవు కవివా? కావా లంటే, కనురెప్పపాటులో, త్రిభువ నైక మోహిని, ప్రణయైక మూర్తి దొరక దటోయ్! ఓహోహొహో! ఓహోహొహో! ఆలోచించు! ఆలోచించు!"

ఎంత సేపు అలాగే నిలబడ్డానో ఆ అర్ధరాత్రి ఆ మహా సముద్రుని సన్నిధిని, అతని ప్రియురా లైన ఆకాశం సన్నిధిని, ఒక్కణ్ణీ!

కొంత సే పయాక నెమ్మదిగా కన్నీళ్లు జారుతున్నాయి - రెండు కళ్ళంటా. అంతలో వెక్కి వెక్కి యేడ్వడ ంమొదలెట్టాను. ఇంత ఏడు పెప్పుడూ నేనే యేడవ లేదు!

మెల్ల మెల్లగా రోదన విరావము చల్లారింది. నాకు తెలియకుండా చతికిల బడ్డాను.

కూర్చుండి నా గీతా లాలపించడం ప్రారంభించాను. ఎందుకో మొట్టమొదటి దానితో మొద లెట్టాను. అలాగే చదివాను, చదువు తున్నాను, చదువుతూనే ఉన్నాను.

చదువుతూ అ గీతా మార్గాలలో నే నెరగకుండానే భూత కాల మంతా ప్రయాణం చేశాను. జరిగిపోయిన జీవిత మంతా మళ్లీ బ్రతికాను.

ఆవేగము హెచ్చింది. అపాద మస్తకమూ వేడివే డైపోయింది. వడవడ వడికే గొంతుకతో, శరీర మంతటితో, బ్రతు కంతటితో గీతాలు పాడాను, పాడాను. నాటివరకూ వ్రాసిన పద్యా లన్నీ, అ సంవత్సరాది గీతి కూడా చదివాను.

ఆ సంవత్సరాదిగీతి ఎందుకో వెలితిగా వినబడింది ఈసారి. మళ్లీ కెవ్వు మని ఏడిచాను. అమ్మో! అమ్మో! నేటికి నా యేడుపులో ఎంత ఆనంద ముంది!

నే నా నిముష మందు కొ త్త వాణ్ణయా నని నాకుతెలిసింది. నాకూ సంవత్సరాది వచ్చిం దని నాకు తెలిసింది. అంతే కాదు; లోకానికి వలె ఎప్పుడో కాక సముద్రునికి వలె నాకూ నిత్య నూతన వసంత ముదయించిం దని తెలిసింది.

కాని ఆ రాత్రి మరణించి పోయిన "నేను" కొరకు కూడా తిరుగ జన్మించిన నేను ఆ చివరిసారి కొంతవర కేడ్చినాను సుమండీ! అందువల్లనే ఆ రోదనములో కొంత వియోగవిషాదము స్ఫురిస్తుంది.

అప్పుడు ప్రశాంతంగా సాగరతీరాన్ని ఉపవసించాను. ఈ సారి చల్లగా మళ్లీ నా గీతా లన్నీ చదువుకున్నాను.

ఎందుకొరకో తెలుసునా?

నా గీతా మార్గాల కిరు పక్కలనీ, నా పూర్వ జీవిత ప్రపంచములో పడున్న సౌందర్య ఖండా లన్నీ ఏరుకున్నాను. నేను పుట్టింది మొదలుకొని ఆ నిముషము వరకూ ఏ యే పదార్థములో ఏ యే వ్యక్తిలో ఏ లావణ్యలవం సందర్శించానో దానిని సంగ్రహించాను. తెచ్చి నా హృదయంలో ఒక్క టొక్కటే పెట్టుకున్నాను.

ఆ గీతా వీథులనే మళ్లీ మళ్లీ వెను దిరిగి వెడలి, ఇదివరకు నా హృదయమునుంచి అపు డపుడు విరిసిన ప్రేమ లేశాలున్నూ, ఇతర హృదయాలనుంచి నా మీద కురిసిన అనురాగ శకలాలున్నూ, జన్మించిన దాది నాటివరకూ నన్ను సోకిన ప్రణయము ప్రతీదిన్నీ సేకరించాను. సేకరించి నా హృదయంలో ఒ క్కొక్కటే ఉంచాను.

అప్పుడు - కవిరాజును కానూ?— రెక్కలు తొడుగుకున్నాను. పదునాలుగు లోకాలూ పరుగులెత్తాను-అంటే పదునాలుగు లోకాలూ నాలోనికి వచ్చేశా యన్న మాట! ఎక్క డెక్కడిదో కంట బడిన సౌందర్య మల్లా తెచ్చాను; స్ఫురించిన ప్రే మల్లా తెచ్చాను.

ఒక్కసారి కన్ను మూసుకున్నాను!

ఇంతలో తెరిచాను!

సెబాష్! ఆనందం వల్ల గడగడ వడకాను. అంతలో శాంతిం చాను. సృష్టి పూర్తి అయింది.

అహా! చతుర్దశ భువనాల్లో, సకలాశావకాశాల్లో ఒక్కతే సౌంద ర్యైక స్వరూపిణి, ఒక్కతే స్వచ్ఛ సుధా పరిపూర్ణ ప్రణ యైక మూర్తి!

ఆమె నాది. నా ప్రియురాలు. నేను ప్రియుణ్ణి. నాకు ప్రేమ దొరి కింది. సరే, సౌందర్యమూ దొరికింది.

అప్పు డామెకు నామకరణం జేశాను. ఒక నివాస స్థలం కూడా నిర్మించాను. అక్కడే నివసిస్తుంటుంది.

ఇంక లోకంలో ప్రేయసీ ప్రియు లందరి వలెనే కాదు ; అందరినీ మించి జీవిస్తాను. ఎందువల్ల నంటే, లోకంలో అందరినీ సంతృప్తి పరిచే ప్రేమ కావలిస్తే ఇదివరకే నాకు దొరికి ఉండును!

నా ప్రేమ నేనే ఇట్టి దని నిరూపించ లేను.

మే మొకరి నొకరు తాగెయ్యాలి, పీల్చాలి, జీవించాలి. ఒకరి నొకరు ముం చెత్తాలి, ఒకరి నొకరు దహించి వెయ్యాలి. ఒకరిలో నొకరు నిండి అలా అలా కరిగి పోవాలి. అలా అలా అలా పెరిగిపో వాలి. ఒకరి నొకరు ఒక్కసారే నాశం జెయ్యాలి, బూడిద చెయ్యాలి! విశ్వానికి ప్రళయం రావాలి. ఒకరిలో నొకరు శాశ్వతంగా జీవిం చాలి. తిరుగ విశ్వం పున స్సృష్టిలో పులక లెత్తాలి!

శాఫో గొప్ప కవయిత్రే - నిజమే! ఎక్కడో విన్నవాణ్ణి వలచింది; కాని విఫలమొంది కృశించింది. పిగ్మేలియన్ భావశీలుడే, యథార్థమే! తాను నిర్మించిన శిలావిగ్రహాన్ని ప్రేమించాడు. కాని 'అయ్యో,' ప్రాణము పొయ్య' మని 'అథీన'కి మొరబెట్టుకున్నాడు ; మరణించాడు. ఉషాకన్య మహానుభావురాలే, ప్రణయినీ రాజ్ఞే - సందేహం లేదు ;

కలలో చూసిన వాణ్ణి వలచింది; కాని స్వప్నంలో నైనా వాణ్ణి చూసింది; అత డొకా నొక చోట ప్రాణకోటిలో నున్నా డని తెలును కుంది. అజుని విలాపం నేటికీ వినబడుతూంది. జేబున్నీసా లోకాని కంతా కలకాలానికీ ఒక్కతే భగ్నహృదయ యైన విరహిణి. ప్రణయ విజయము కొరకు మన్మథుడే భస్మ మయాడు. ప్రేమ సాక్షాత్కారం కోసం పార్వతే మొదట బూడి దై పోయింది.

నేను వీ రందరినీ మించిన కవిని. భావార్ద్రహృదయుణ్ణి. ప్రణయ రాజరాజేశ్వరుణ్ణి.

నేను విధాత అంతవాణ్ణి. అతడు సరస్వతిని సృష్టించుకున్నాడు. ప్రేమించాడు, ప్రేమింపబడ్డాడు. నేనూ అంతే!

విక్టర్ హ్యూగో జ్యూలియట్ అనే ప్రియురాలిని దూరంగా ఒక పట్టణంలో ఒక గృహంలో ఒక మూలగదిలో నివసింప జేశాడు. ఎప్పుడో అప్పు డప్పుడు తాను వచ్చేవరకూ తనకు ఉత్తరాలు వ్రాస్తూ వాటి నా గదిలోనే ఒక మూల పడవేస్తూ జీవయాత్ర సాగించ మన్నాడు. ఆమె అలాగే చేసింది. అతనికి ఆ ప్రణయ విశ్వాస ముంది. ఆమెకూ ఆ ప్రణయ విశ్వాస ముంది.

నేనూ నా ప్రియురాలిని వ్రాయ మన్నాను; నేనూ వ్రాస్తున్నాను. "ఏమి వ్రాయను? నేను కవిని గాను. కవి ప్రియురాలినని మాత్రం గర్వ మొందుతున్నాను. నా ఉత్తరాలు మీకు రుచిస్తాయా?" అని అంటుంది.

కాని నా ప్రేయసి కూడా కవే! ప్రేమ ఆమెను కవిని జేసింది. నా అంత కవినీ జేసింది. అనేక విషయాలలో ఆమె కద్భుత మైన ధీశక్తినీ, తేజస్సునూ ఇచ్చింది.

సరి, ఆ ఉత్తరాలు ఇక మీరే చదువుతారు. వాటి చరిత్రము మాత్రము యథార్థ మని మీరు గ్రహించి ఉంటారు గదా ఇప్పటికి! కాని నా ప్రియురాలు నా కొక్కనికే కాని తన దివ్య రూప సందర్శనం లభింప జేయ దనీ గ్రహించి ఉంటారు.

నా ప్రత్యుత్తరాలూ చదువుతారు; వాటిలో అప్పు డప్పుడు నా కొత్త గీతాలూ వింటారు.

ఇదివరకు నా హృదయంలోకి తేజ స్తమస్సులతో, జీవన మృత్యువులతో, భూత భవిష్యత్తులు గుమి గూడి, "నీవు మాకు వినిపించే దేమిటి?" అని ప్రశ్నించిన ట్లుండేది! "ఏదీ, నీ సందేశము?" అని మహావిశ్వమంతా నా కంఠద్వారము వద్ద నిలిచి తట్టిన ట్టుండేది. నా జీవిత భార మప్పటికి తొలగి పోలేదు; నా విషాద గీతాల ద్వారా పూర్తిగా కరిగిపోలే దది. నా హృదయేశ్వరి నాగొంతు చెర విప్పివేసింది; పాడ మంది. సాధన అయిందని హెచ్చరించింది. అగ్నిపరీక్ష అవసర మంటుంది; అది నా గీతాలకు మరీ లోతూ, మరీ ఔన్నత్యమూ ఇచ్చిం దని పొగడుతుంది. ఆ గీతాలే ఈ గీతాలకి కారణ మంటుంది. నేనొక్కణ్ణే జీవించిన వాణ్ణి, జీవిస్తున్నవాణ్ణి - అని మెచ్చు కుంటుంది.

ఓహో! ఇక వినండి, క్షీరసాగర గర్భం నుంచీ, కైలాస పర్వత శృంగం నుంచీ, అణు వణువు నుంచీ, ప్రతి కీటకము నుంచీ నేను పంపే ప్రేమ సందేశాలు, ఆనంద సందేశాలు, కల్యాణ సందేశాలు! ఇక పఠించండి - మా ప్రణయ లేఖలూ, నా పద్యాలున్నూ!

# ఊర్వశి

ఆహా! ఊర్వశి అనగానే భారతీయ కవి ఎలాగ పరవశుడై పోతాడో!

విక్రమోర్వశీయంలో కాళిదాసే పురూరవుడు. ఇందుమతీ, రతీ, శకుంతలా, మాళవికా వాళ్ల వాళ్ల ప్రియుల ప్రేయసులు. ఊర్వశి కాళిదాసు ప్రేయసి!

'అనంతయౌవనా' అని ఊర్వశిని ఆప్యాయంగా పిలిచి పిలిచీ రవీంద్రుడు ఎంత పాట పాడాడు! ఎలాంటి పాట పాడాడు! అసలు సామాన్య గేయాలు పాడే కవి కంఠంలో కూడా ఉజ్జ్వల ప్రతిభ పోస్తుంది ఊర్వశి; నంద నానిలం కదిపేసే మందాకిని లాగా దాన్ని పాడించేస్తుంది ఊర్వశి!

పాపం! రవి వర్మ ఒక్కడే ఊర్వశిని చిత్రిస్తా నని ఉత్త ప్రీని గీశాడు.

ఊర్వశిని కవి ఒక్కడే ఎరుగును; అందరూ ఎరగరు. అ దైనా మామూలు మానవు డైనప్పుడు ఎరగడు. లోకానికి ఊర్వశి

లేదు. కవి వాక్కు రుషి వాక్కైతే లోకంలో ఊర్వశి ఒక్కత్తె ఉంటుంది కూడా!

లోకంలో రంభలు చాలామంది ఉన్నారు. ఒక్క ఊర్వశే ఉంది. అస్థి మాంసాదులతో రంభను చేశారు; యుగ యుగాల ఆవేగంతో, ఆనందంతో, ఆశతో, ఆశయాలతో, వేదనతో, వివిధానుభవాలతో ఊర్వశిని చేశారు. లోకం రంభను కోరుతుంది. కవి ఊర్వశిని ఆరాధిస్తాడు. లోకం ఊర్వశిని మృగతృష్ణ అంటుంది. కవి రంభను ముది కోర్కె అంటాడు. లోకము కవిని చూసి హేళన చేస్తుంది. ఊర్వశి లోక సంగ్రహార్థమే అవతరించిం దంటాడు కవి. ఒక చక్కని స్త్రీ ఎలా ఉందో దాన్ని లోకము రంభ అంటుంది. స్త్రీ ఎలా ఉండాలో దాన్ని కవి ఊర్వశి అంటాడు. ఒక లావణ్యవతి రంభలాగ ఉంటుంది అని అంటే, ఆమె గాని, రంభగాని గర్వపడ నక్కర లేదు. ఆమె ఊర్వశిలాగ ఉంటుందీ అంటే మాత్రం కవి ఏడుస్తాడు - అసత్యం ఒప్పుకోలేడు కనుక.

ఊర్వశి పుట్టుకను గురించి రెండు గాథ లున్నాయి. క్షీర సాగర గర్భంలోనుంచి అప్సరసలు అందరితో జన్మించింది అన్నది ఒకటి. రవీంద్రుడు ఇదే అంటాడు. ఒక చేతిలో విష భాండంతో, ఒక చేతిలో సుధా పాత్రతో అవతరించావనీ, ప్రవాళ పర్యంకంమీద నిద్రపోయావా అనీ, నీ వల్ల త్రిభువనాలూ యౌవన చంచలాలు అయా యనీ, లోక దృష్టులు తగిలి నీ సర్వాంగాలూ రోదిస్తున్నా యనీ ఏవేవో అంటాడు ఆ కవిలోక చక్రవర్తి. ఆయన ఊర్వశి సోయగానికి పాలనురుగు అంటి ఉంటుంది. ఆంధ్రకవికి మాత్రం అప్సరసలు అందరితో ఊర్వశి పుట్టింది అన్న మాట గిట్టదు.

ఇక రెండో గాథ. బదరికాశ్రమంలో నారాయణ దేవుడు తపస్సు చేస్తున్నాడు. ఇంద్రుడు వెర్రివాడు. ఆయన మనస్సు కలత పెట్టడాని కని వసంత మన్మథాదులు ఆసరాగా రంభాద్యప్స రసలను పంపుతాడు. నారాయణదేవుడు చిరునవ్వు నవ్వి తొడ లోంచి (ఊరువులోంచి) ఏదో తీసి అచ్చరల కెదురుగా విసురు తాడు. అది ఊర్వశిగా నిలుస్తుంది. రంభ వెలవెల పోతుంది. రంభ సిగ్గుపడుతుంది. రంభ సౌందర్యం లౌకికం; వాడిపో గలదు. ఊర్వశి సౌందర్యం అలౌకికం; సత్యం. అనంత యౌవన ఊర్వశి. తెనుగు కవికి ఈ రెండో గాథ ఇష్టం.

చిత్రం! పురాణాలు చదవగా చదవగా అప్సరసలమీద మనకు అంత గౌరవం ఉండదు. 'ప్రతి సోమయాజులూ, ప్రతి యోధుడూ అనుభవించాడు కదా - నేను ఎందుకు అపేక్షించ కూడదు? కన్ను గీట కూడదు?' అనిపిస్తుంది. ఎవ్వరికీ, ఎవ్వరికీ అందకుండా పధ్నాలుగు లోకాల చివర ఏదో ప్రవాసిని లాగ, ఏదో వియోగిని లాగ, ఏదో పూర్ణిమ లాగ, ఏదో ఏదో లాగ కనిపిస్తుంది ఊర్వశి! పురూరవుని గాథ విని ఊర్వశిని ప్రేమి స్తాను. అర్జునుని గాథ విని ఊర్వశిని శిరసా వహిస్తాను. ఉత్తర హరివంశంలో ఊర్వశి కథ అంత పచ్చి పచ్చి మాటల్లో వినిపించిన నాచన సోమన్న ఎంత మహా శిల్పి అయినా ఊర్వశిని ఎరగడు. పాపం! ఎంత వేశ్యను చేయబోయినా - లోకైక గురువు వసిష్ఠులూ, అంతవాడే అగస్త్యుడూ ఊర్వశి కుమారులు! తెలుసునా?

ఉత్తమ సంస్కారమూ, దృష్టీ లేని ఒక (వృద్ధ) పండితుడు నవ సాహిత్యాన్ని విమర్శిస్తూ "వేశ్య యైన ఊర్వశే ఇలా ఏదో చేస్తే" అంటూ వ్రాశాడు. ఊర్వశి వేశ్య ఏమిటి? ఊర్వశి స్త్రీ. విషంతో, అమృతంతో, చీకటితో, వెన్నెలతో కలిసిన ఊర్వశి తొలి వియోగిని, తొలి ప్రేయసి. స్త్రీ ఊర్వశి! "న హెూ మాతా, న హెూ

కన్యా, నహెు వధూ" అన్నాడు రవీంద్రుడు. చతుర్దశ భువనాలవీ, యుగ యుగాలవీ అశ్రువులు కడుగగా కడుగగా సుందరతరం, దివ్యతరం, ఉజ్జ్వలతరం అయిపోతూ ఉన్న ఆదర్శ సౌందర్యం ఊర్వశి! ఊర్వశి వేశ్య ఏమిటి? రంభ వేశ్య! ఈ లోకంలో ఎందరు వేశ్య లున్నారు? ఎందరు? వాళ్లను సహించలేడు కనుకనే కవి ఊర్వశిని సృష్టించుకున్నాడు. కొందరకు లోకంలో స్త్రీలు రెండే రకాలు: రంభలు, పూతనలు. ఇద్దరూ ఒక పని కోసమే సృష్టి అయ్యారు. ఊర్వశి స్త్రీ, ఊర్వశి దేవి! ఊర్వశి మోహినీ హాస మల్లి! వైజయంతీ పరిమళము! హరజటా పారిజాతము! "యెం కొక్క దేవ తై యెలిసె నంటారు". "అంత శ్రమ పడి పావన మభ్రగంగ ధారుణికి తెచ్చినాడు భగీరథుండు." "నీవు స్త్రీ జాతియందు జన్మించు కతన వరలుచుండును పూజ్యభావంబు నిఖిల భామినీ జన లోకము పట్ల నాకు!"

ఒక ఆంధ్రకవి కృష్ణపక్షంలో ప్రవాసి యై తిరిగి తిరిగీ, కంట బడిన ప్రతి లావణ్యాన్నీ కదిపి కదిపీ, పక్కన మోగిన ప్రతి హృదయాన్నీ పలకరించి పలకరించీ, లోకంలో తనకు నచ్చిన సౌందర్యం లే దనీ, తన్ను ప్రేమించి తాను ప్రేమించే ప్రేయసి లే దనీ కుంగి పోయి కుంగి పోయీ, ముచ్చిచ్చులో వేగి వేగీ, "నా కుగాదులు లేవు, నా కుషస్సులు లేవు" అన్న నరకంలోకి వచ్చాక, తపస్సు పూర్తి అయాక, శాంతచిత్తుడై తానే ప్రేయసిని సృష్టించుకున్నా డట. ఎలాగ? తన మనస్సును ఎన్నడో ఎన్నడో సోకిన ప్రతి సౌందర్య ఖండాన్నీ, తన హృదయాన్ని ఎన్నడో ఎన్నడో పలికించిన ప్రతి ప్రేమ శకలాన్నీ ఎక్క డెక్కడికో పరుగెత్తుకుని వెళ్లి వెళ్లి, ఏరి ఏరి తెచ్చుకుని అన్నిటినీ కలిపి కలిపీ, ఆమెను నిర్మించుకున్నా డట! అంటే, ఏమిటీ? కవిది ఆరని చిచ్చు! తీరని తృష్ణ! అతన్ని సంతృప్తి

పరిచే సుందరవస్తువూ, అతన్ని ఆనందింప జేసే ఆర్ద్రప్రేమా ఈ లోకంలో దొరకవు; లేక ఏది దొరికినా అతనికి తృప్తీ ఉండదు. అందుకే నిజ మైన ఏ కవి తెర వెనకాలి ఆ "వెలుగు" కోసం ఏడ్వకుండా ఉన్నాడు? "వగరు చేడ్వగ లేను, చచ్చి బావగ లేను, కనలేని వెలుగు కొరకై" అంటాడు. అందుకే మొదట జీవిత ప్రారంభంలో ఎంత నలిగి పోతాడు! ఎంత నలిగి పోతాడు! "ఇతగాడు ఆరోగ్యంగా ఉన్నాడు; ఆహార విహారాలకి లోపం లేదు; అలంకరించుకుంటాడు, చిరునవ్వు నవ్వుతాడు; ఆడతాడు పాడతాడు; ఆలు బిడ్డ లున్నారు; ప్రతాపరుద్రీయంలో వెర్రివాడు 'నేను మాత్రం పెళ్లి చేసుకోలేనా?' అన్నట్లు తానూ మనం అందరం చేసేవి అన్నీ చేయగలడు; చేస్తున్నాడు! "ఎందుకు ఏడుస్తున్నానంటాడు!" అంటారు లోకంలో వాళ్లు. ఇటు వాల్మీకీ, కాళిదాసూ, భవభూతీ మొదలుకుని రవీంద్రుని దాకా, అటు హొమరూ, శాఫో మొదలుకొని షెల్లీదాకా మొదట ఎలాంటి కరుణ గీతాలు వ్రాశారు! తరువాత అగ్నిపరీక్ష అయాక, తపస్సు అయాక లోకాతీత మైన సౌందర్యంతో, ప్రేమతో నిండి, ఏ ద్వేషమూ, ఏ చీకటీ లేని ఒక లోకం నిర్మించుకుంటారు! దానిలో కొలువు తీర్చి ఉంటుంది ఊర్వశి కూడా! అదే అతని సందేశం అనండి కావలిస్తే! కనుక కవిలో (ఒక పక్క రాక్షసులూ, ఒక పక్క దేవతలూ) అంత సముద్ర మథనమూ, అంత హాలాహ లోజ్జృంభణమూ అయితేనే గాని అమృత భాండం రాదు. కృష్ణ పక్షమూ, ప్రవాసమూ అయాక ఊర్వశీ, కార్తికీని. ఒక్కొక్కప్పుడు కవి శివుని లాగ కన పడతాడు! ఎంత కాలకూటము హృదయంలో దాచుకుని, ఎలాంటి మాధుర్యమూ, కల్యాణమూ లోకాని కిస్తాడు! తీరాన ఉన్న లోకులు చూచి ఆనందించడానికి సముద్ర వక్షాన కాలిపోయే నౌక తోటి పోలుస్తాడు ప్రతిభా శాలిని కార్‌లైల్.

కనుక ఈ ఊర్వశి ఎవ రనీ, ఏ స్థలాన ఉన్న దనీ, పే రెవ్వ రనీ, స్వకీయా పరకీయా? అనీ అడిగేవారు ఎక్కడ చూడాలో, ఎలాగ చూడాలో తెలియక అడుగుతున్నారు. ఊర్వశి కవిలో ఉంది! కవి హృదయం లాంటి హృదయమూ, కవి భావన వంటి భావనా సంపాదించు! నీకూ దర్శన మవుతుంది; నీవూ ధూళి దాకా శిరస్సు వంచుతావు.

సీతమ్మ లోకైక మాత అయితే ఊర్వశి "విశ్వ ప్రేయసి." అనగా నిజంగా ఎవరి కైనా ప్రేయసి ఉంటే ఆ ప్రేయసి వానికి ఊర్వశి అన్నమాట! కనుక "అమ్మా! అమ్మా!" అంటే సీతమ్మా అన్నమాట! "ప్రేయసీ! ప్రేయసీ!" అంటే ఊర్వశీ అన్నమాట!

దీన్నిబట్టి నేటి తెలుగు కవి, ఏ కవి అయినా, కవిత్వం అంటే ఏ దంటాడో కొంతవరకు తెలియడం లేదూ? కవీ, శిల్పి, చిత్ర కారుడూ ఉన్న దున్నట్లు కనపర్చ కూడదు. ఉన్న అనుభవం మీద కాలూది, ఎగిరి ఎలా ఉండాలో చూపించాలి. మన భారత శిల్పులలో, చిత్రకారులలో, కవులలో గొప్ప ఇదే! లోకావరణం దాటి చూడలేని వారికి వారి సృష్టి వికృత భావనగా, వెర్రి కూర్పుగా తోస్తుంది.

Ideal ప్రకటించడమే కవిత్వం అని వాళ్ల అరిష్టటిల్ అన్నాడు. నవనవోన్మేషమూ, ఆదర్శప్రాయమూ అయిన అలౌకిక సౌంద ర్యంతో నిండి ఏదో లోకాన్ని సృష్టించడమే కళ కర్తవ్యం అని భారత కవి శిరోభూషణం అన్నాడు. లోకోత్తర మైన ఆహ్లాదం ఇవ్వాలి కవిత్వం - అన్నాడు ఒక బుద్ధిమంతుడు. కనుక నేడు కవి ఊర్వశిని లోకంలో అవతరింప చేస్తాడు. రేపటి నుంచి లోకంలో ఎందరికో ఊర్వశి ధ్రువతార అవుతుంది. ఆమెలాగ అవబోతారు.

నాడు సీతమ్మను లోకంలో వెలిగించాడు ఆదికవి. ఏ సతికి సీతమ్మ లాగ అయిపోవా లని ఉండదు లోపల?

అలాగే ఎన్నెన్ని రకాల మహోజ్జ్వల నక్షత్రాల్ని భారతాకాశంలో వెలిగించారు మన కవులు! ఊర్వశి ఆ నక్షత్రాల్లో ఒక గొప్ప నక్షత్రం.

వర్డ్సువర్తు నీచ మైన మాట ఒక్కటి అయినా వ్రాసినవాడు కాడు - అన్నాడు టెన్నిసన్ కవి. అందరు కవులూ అంతే. కవి కవి అయినప్పుడు తక్కువది భావించ లేడు! పలక లేడు! అందుకే, తరవాత మానవు డయాక, ఇది నేనే వ్రాశానా అనుకుంటాడు. కవిగా ఉన్నప్పుడు ఊర్వశిని ఆలింగనం చేసుకోగలడు. మానవు డయాక ఊరికే దూరదూరాల ఆరాధించ గలడు. కనుక ఎప్పుడూ కవిగా ఉండడానికి రుషిలాగే కవి కూడా ఎంత తపస్సు చేస్తే అంత మంచిది. అప్పుడు లోకానికి ఎట్టి కల్యాణం! అప్పుడు కవి లోనే కోటి వసంతాలు వికసిస్తే లోకం అందరికీ ఊర్వశీమయంగా చేయగలడు.

ఇలాగ నేటి తెలుగుకవికి ఎన్ని స్వర్గ స్వప్నాలో ఉన్నాయి లోపల. నేటి తెలుగుకవికి ఊర్వశి అంటే లోపం లేని ఆనందం! కలత లేని శాంతి! అమృతం! ఊర్వశిని ప్రేమిస్తే లోకంలో ఎవరినీ ప్రేమించ లేకుండా ఉండ లే మంటాడు నేటి తెలుగు కవి! కనుక ఊర్వశి కోసమే లోకంలో మంటా, వేదనా, బాధా, ఈర్ష్యా, ద్వేషమూ, ఏడుపూ ఉంచ లే నంటాడు నేటి తెలుగుకవి!

కనుక ఊర్వశీ! ఊర్వశీ! సుధ ర్మాస్థానంలో నీ వే మూల నిలుచుంటావో నాకు తెలుసు! నంద నారామంలో నీ పారిజాతచ్ఛాయ నాకు తెలుసు! నీ ఇల్లు వెనకాలే ఒరుసుకుని

మందాకిని పరుగెత్తుతుం దని నాకు తెలుసును. ఒకసారి దాని ఒడ్డున కూర్చుండి నీళ్లల్లో నీ కాళ్లు ఆడిస్తూ, ఇంకోసారి నీ కిటికీ లోంచి స్వప్నభరా లైన కళ్లతో దాని నురుగులకేసి చూస్తూ నీ వొక్కతెవే ఉంటా వని నాకు తెలుసు. ఎప్పుడూ నీ వొకతెవే ఉంటా వని నాకు తెలుసు. అప్పుడు రంభ, మేనక, తిలోత్తమ వేలకు వేలు అమరావతి వీథుల్లోనో, చింతామణి సాన్నిధ్యంలోనో ఆడిపోతూ ఉంటా రని అందరికీ తెలుసును. ఊర్వశీ, ఊర్వశీ! కవి నిన్ను త్రిభువనాల పైన దివ్యపతాకలాగ ఎగరవేశాడు. నీ వక్కడ నుండి జారిపోకు. త్రిభువనాలూ కళ్లనీ, చేతులనీ ఆరాధిస్తూ నీ కోసము ఎత్తనీ ఊర్వశీ! ఊర్వశీ! రవీంద్రు డన్నట్లు ప్రవాళ పర్యంకిక మీద నిద్రపోయావో, వ్యాసు డన్నట్లు నారాయణదేవుని ఊరు మందిరంలో ఇమిడి ఉన్నావో, ఆర్యరుషి అన్నట్లు కేవలము నిరవధి కానందానివో! ఊర్వశీ! ఊర్వశీ! అది నీ చరణ శోణిమా? పారాణా? నా హృదయ రక్తమా? ఊర్వశీ, నా కావ్యానివి నీవు. నీవు నక్షత్రాలలో! నేను ఈ లోకాన్ని స్వర్గలోకం చేస్తాను.

"నువ్వు పక్క నుండు, నే నీ లోకాన్ని వైకుంఠము చేస్తాను" అంటాడు నవకవి.

—శాస్త్రిగారి మొదటి రేడియో ప్రసంగం; మద్రాసు కేంద్రం నుంచి మొదటి తెలుగు సాహిత్య విషయమైన ప్రసంగంకూడా.

# నా గొప్ప రచనా?

ఇష్ట మనో, మంచి దనో, గొప్ప దనో, ఎవరి రచనలలో నుంచి వారు ఏరి చెప్పడం కంటె ఇబ్బం దయిన పని ఇంకోటి లేదు. అందులోనూ ఇంకా కష్ట మయింది ఉంది. కవిని తన కష్టసుఖాలు తానే ఆప్యాయంగా ఆలాపించుకున్న కావ్యాలనుంచి ఏర మంటే మరీ నలిగిపోతాడు. ఎప్పుడో ఒక శుభముహూర్తం వచ్చినప్పుడు కల్ప నావేశంలో ఒక రచన చేసి దానిని వెన్నలాగ, నిగ్గులాగ తీశాను సుమా అన్న కవికి ఈ పరీక్ష దండన కింద పరిణమిస్తుంది. ఒక తరుణంలో ఒకటి, ఒక సమయంలో ఒకటి పాత రచన లన్నీ మళ్లీ మళ్లీ వచ్చే మనస్థితుల్ని బట్టి నెమరులోకి వచ్చి, నాలుక మీదనో, మెదడులోనో రొద చేయవచ్చును. కాని, "ఏది నీ మంచి రచన?" అని అటువంటి కవిని నిలబెట్టి అడిగితే మాత్రం - ఊఁ హుఁ - అప్పు తీర్చలేనివాణ్ణి అడ్డగించినట్లులాగ ఎంత కంగా రైనా పడతాడు.

పోనీ "నీ కిష్ట మయిన రచన ఏది?" అని కాదు, "నీ మంచి రచన ఏదీ?" అనైనా కాదు; "నీ గొప్ప రచన ఏదీ?" అని. దీనికి జబా బీయడానికి అహంకారమూ అడ్డు వస్తుంది. అడకువా అడ్డు

వస్తుంది. ఈ రెండిటిలో ఒకటీ లేనివాడు ఒక్కడూ ఉండడు కదా! అసలు మంచికవికి రెండూ ఉంటాయి కూడా - అంటారు పెద్దలు. ఒకటి అన్ని రచనలూ గొప్పవే అంటుంది. ఒకటి ఏదీ గొప్పది కాదు అంటుంది. ఒకటి శక్తి ఇస్తుంది; ఒకటి సత్యం చెప్తుంది. రెండూ కలిసి కొత్త కృషికీ, కల్పనకీ ప్రేరేపిస్తాయి.

అంచేత ఒక పని చెయ్య వచ్చును అని అనుకున్నాను, శ్రమపడి. "ఈ పయనపుం దెరువు" మీద ఒక్కసారి ఆగి, 'వెను దిరిగి కను విరిసి' చూడాలి అని. పోనీ ఇంకోలాగ చెప్తాను. నాలో నుంచి నేను తంటాలు పడి విడిపోయి, నా ఎదురుగా పరచి ఉన్న, నే నింత వరకూ దాటి వచ్చిన నా బ్రతు కంతా కలియ చూడా లని. ఇంక ఎదురుగా - ఎక్కడ శిఖరం ఉందో అక్కడ కావ్యం ఉంది కదా! ఎక్కడ ఆరామం ఉందో అక్కడ రచన ఉంది కదా!

కాని ఇక్కడా ఒక చిక్కు ఉంది. దూరాన ఉన్న పర్వతం కన్న దగ్గర ఉన్న కొండ ఉన్నతంగా ఉన్నట్లు ఉండడం. అందు కోసం మరీ దగ్గిర కొండల్ని దాటెయ్యడం, తోసెయ్యడం చెయ్యాలి. ఇక్కడ నాకు స్వంతంగా ఉన్న మరొక గొప్ప చిక్కు ఉంది. నా ప్రతీ రక్త నాళంలో కరిగీ, కలిసీ నన్ను వెనక్కి వెనక్కి పిలిచే పూర్వ కాలం ఉంది. అది ఎప్పుడూ నా మీద ఒరిగిపోతూన్నట్లు ధగధగా వెలిగి పోతూన్న రెండు నీడల్లాంటి మూర్తుల్ని నిలబెడుతూ ఉంటుంది. వాటి కింద నేను చిన్నగా అయిపోతాను. వాటి కింద నా గొప్పతనం అడగి పోతూంది. చితికి పోతూంది. అవి నా తండ్రి గారూ, పెదతండ్రి గారూను; వారి నంటుకుని అలాగ వాల్మీకి దాకా ఉంటారు. వారూ, వారి రచనలూ నావే అనిపిస్తుంది. ఇంక నే నెవ ణ్ణని? నా గొప్పతనం ఏ ముంది?

"ఈ మిడిసిపాటు నీ మ్రోల నేల తేనె
తేట చినుకేని లేవి నా పాట కిపుడు?
ఇంత చివు రిచ్చి, అంత హేమంత శృంఖ
లాల బంధింతు మూగతవాల గొంతు!"

అనా లనిపిస్తుంది.

అయినా నా చిన్నకొండ నేను కృష్ణపక్షం ప్రారంభంలోనే ఎక్కాను. అవి నల్లమలలు. అప్పుడే "తరు వెక్కి అల నీల గిరి నెక్కి, మెలమెల్ల చదల లెక్కి జలదంపు నీలంపు నిగ్గు" నందుకున్నాను. అంతకు ముందు గోరువెచ్చని అనుభవాలు ఉన్నాయి. గోరుముద్దల్లాంటి రచనలూ ఉన్నాయి. కాని అప్పుడు గుండె చుర్రుమని అంటుకోవడం ఆరంభం. అసంతృప్తి స్తిమితంగా ఉండ నీయక పోవడం మొదలు. అన్వేషణలో బయలుదేరడం అప్పుడు. అప్పుడే నిజానికి గొంతు గడియ విడిపోవడం, రెక్కలు పరచుకు పోవడం జరిగింది. కాని అప్పుడు దేనికోసం వెదకడమో, ఎక్కడ వెదకడమో తెలియదు. అప్పుడు నీప వనిలో శ్రీకృష్ణుణ్ణి వెదికినది నేను కాదు. నేను యుగ యుగాలనుంచీ ఎరి గున్న గోపిక. ఆ "అన్వేషణం" "కనరాని దాని కొరకై, ఎన్నడును కన లేని వెలుగుకొరకై" అనైనా తెలియదు. నా రెక్కలికి ఏదో నేను పుట్టక మునుపే అమర మందారం వాసన అంటుకుంటే, అది ఏ గూటిలోనూ నిలవనీయక, తరిమి తరిమి పరిగెత్తించిన ట్లయింది. అంతే! "నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు? నా ఇచ్ఛయే కాక నా కేటి వెరపు?" అంతే! అలాగ చుక్కలదాకా ఎగిరి రెక్కలు చుర్రుమంటే, కృష్ణపక్షంలో పడ్డాను. ఆ పడడం ఎత్తుమీదే పడ్డాను. పడగానే తెలివి వచ్చి చుట్టూ చూశాను. నాకు తోడు నీడ ఒకరే అని తెలుసుకున్నాను — దుఃఖం. ఎందుకు కాదు? దుఃఖం,

వేదన, బలహీనత కాదు; శక్తే! అది నిరాశ కాదు; ఆశే! పెల్లగించి చూడ లేని వాళ్లు పెదవి విరుస్తారు - రెండు విధాలుగా. విషాదం నిరాశ, నిస్పృహ అంటారు కొందరు. కొందరు ఆననం మీద అమృత కిరణాన్ని చూసి అంతరంగంలో అగ్నిహోత్రం లే దంటారు. పోనీ! పరమశివుడు ఏం జేశాడు? కంఠంలో కాలకూటం, పైన చంద్రరేఖా కాదూ ఆయనకి? కవీ అలాంటి వాడే! ఎప్పుడూ కవికి నిరాశ లేదు. కృష్ణపక్షంలోనే కన్నీటి సరులతో, నిశ్వాస తాళవృంతాలతో తిమిరలోకైక పతి అయ్యాడు. కృష్ణ పక్షపు దళసరులు తవ్వుతున్నప్పుడే ఆశ సత్యం, నిరాశ అబద్ధం. అంతే కాదు; ఎప్పుడూ నిరాశ నేరం, పాపం. కవి గొప్ప విశ్వాసి.

ఇం కోమాట: "అగ్నిలో నుంచీ, జలంలో నుంచీ ప్రయాణం చేస్తేనే కాని అమూల్యనిధి దగ్గిరికి రావు" అన్నాడు తత్త్వవేత్త. ఇంకా అంటాడు: "చక్కని శరీరానికి సుఖమూ, చక్కని ఆత్మకు దుఃఖమూ కావాలీ" అని. కనుక అన్వేషణ ఆగిపోలేదు. కాని ఇదివరకు ఎక్కడికీ చూడ లేనివాడు ఇంక లోపలికి చూడడం ప్రారంభించాడు. చూపులు పగలు పైకి పరుగెత్తుతాయి. రాత్రి తల తిప్పుకుని లోపలికి పోయి పెల్లగిస్తాయి. అందుకే కాబోలు కృష్ణపక్షంలో అంత అందుబాటులో ఉండవు - ''ప్రవాసం''లో రచనలు. ప్రవాసంలో అడుగులు దృఢంగా పడుతుంటాయి. ఇంక అప్పుడు "నడి లేని నడిరేయి బడిపోవు కడియాల రవళులే చిరుగాజు మ్రోతలే" వింటూ ప్రయాణం - కోన దాటీ, కాన దాటీ, లోయ దాటీ, కొండ దాటీని. అందుకు అన్వేషణం. రేయి చిక్క పడుతూంది. ఆ ప్రవాసం బరు వౌతుంది. ''విభావరీ వేలా శాలల. . మృదు వసనాంచలముల గుసగుసలు" వినపడ వనిపిస్తుంది. చెవుల్ని దిశాంతాల దాకా లాగి లాగి పరచి పరచీ వింటాడు. "ఆకస మాలోకనముగ లోక మెల్ల వీనుగ" నిలబడతాడు. దరిద్ర

హేమంతంలో చైత్ర శుభోత్సవ విభాత కళ్యాణముకోసం చూస్తాడు. అప్ప డప్పుడు కారు రాతిరి కొనల మెరపించే కల కనపడడమూ, ఆకలి గొన్న అర్రుల్ని చాచేటప్పటికి కల కరిగిపో తూండడమూ కూడాను. పాపం వెర్రి అన్వేషణం ముగియబోదు; దానికి వేసట లేదు - అనిస్తుంది. కాని అన్వేషణంలో ఎంత అలసట ఉందో, అంత రుచీ ఉంది. ఎంత ఏకాకితనం ఉందో అంత ఆత్రతా, అంత ఆర్ద్రతా ఉన్నాయి. ఇంతలో అగ్నిపరీక్ష పూర్తి అవు తుంది. తాను పరచుకున్న మరణ శయ్యపై తానే వాలి, తన చితి తానే పేర్చుకుని ప్రవాసి యైన కవి మరణిస్తాడు.

ఇంక ప్రభాత మహోత్సవమే! నిజంగా ప్రభాతం! రాత్రి తరువాత వస్తుందీ - అది. కనుక తూరుపున తూర్యనాదాలూ, చుటూ సువర్ణాక్షతాశీర్వర్షమూ! అంతలో "వైకుంఠ మృదుకంఠ వైజయంతీ మాల తెగె నేమొ దిగబారు జగము లన్నీ దాటి" అన్నట్లు మోహినీ హాసమల్లీ ప్రఫుల్ల రుచిలాగ 'ఊర్వశి' కవి కెదురుగా అవతరిస్తుంది. అంధకారానికి అలవాటు పడ్డ చూపుల్ని సవరించుకుని, సవరించుకుని మళ్లీ మళ్లీ చూస్తాడు. నల్ల మలల మీద బయలుదేరిన కవి ఉదయగిరి మీద ఉంటాడు. అంత ఆవేదనా, ఆర్తీ అయాక, కవికి తన కోసమే అమృత భాండంతో ఎదు రెదురుగా నిలిచిన మూర్తి త్రిజగతీపతి కోటీర దివ్య రత్నరాజి నేలు వజ్రాల తురాయిగా ఎందుకు కనపడదు? కృతజ్ఞత వల్ల కొంతా, లజ్జ వల్ల కొంతా కవి శిరస్సు వంచుకుంటాడు. ఆ ఆనందంలో అతని హృదయంలో విశ్వవీణా గళమ్ము భోరు భోరున మోత పెట్టిన ట్లవుతుంది. "కలదు నాలోన క్షీరసాగరము నేడు" అనిపిస్తుంది.

ప్రేమకంటె గొప్ప అనుభవం మానవుడికి లేదు. "ఇదివరకు అసమగ్రంగా ఉన్న నా ప్రకృతి నీవు నాలోకి వచ్చాక సమగ్రంగా

అయింది'' అంటాడు ప్రేమికుడైన కవి. ప్రేమ ఎంత గొప్పది! ఒకర్ని ఒకప్పుడేనా ప్రేమించిన వాడు అందరినీ ఎప్పు డయినా ప్రేమించ గలడు. "ఊర్వశి"లో దివాంధం లేదు. "కృష్ణపక్షం" లోనూ, "ప్రవాసం" లోనూ దివాంధం ఉంది. కనుక ఇంక ఇక్కడ -

"వాడిపోయిన ప్రతి సౌరభమ్ము కొరకు
కను మొరంగిన ప్రతి హిమకణము కొరకు
బ్రతుకు బ్రతు కెల్ల కరగు బాష్పములు గాగ"

అంటాడు.

"దారి తల లెత్తు నింత సౌందర్య లవము
వదలి పోలేరు చంపెడి వరకు వీరు
మృదుల కరుణా మధురము నా హృదయ మెవ్వ
రెరుగ జాలుదు? రే మని యేడ్తు నెపుడు?"

అంటాడు.

కాని ఈ బాష్పాలు "కృష్ణపక్షం"లోని కన్నీటి సరుల దొంతరలు కావు. ఆనందమూ, అనురాగమూ లోపల నిండి ఉన్నప్పుడు మన హృదయం మెత్తబడి మెత్తబడి, క్షీరమై, మంచై, పాలమంచు కాలవై ఊరికే ప్రతి వస్తువుమీదా ఉరుకుతూ కురుస్తుందే - అదీ! అలాంటి అశ్రువు! ఊర్వశి నాది, ప్రేమ అందరికీని! అదివరకు ఒక కష్టసంఘటన నాది, దుఃఖం అందరిదీనీ! కాని ఈ ఆనందం పూర్తి కాలేదు. కొత్త ప్రభాతంలో సాక్షాత్కరించిన ఊర్వశిముందు కొంతవరకు కవి మోకరిల్లే ఉంటాడు. అదివర కంతా అంత రంగంలో నిండి ఉన్న ఆర్తీ, ఆశా, అంతా కానుకగా చరణధూళిలో దిమ్మరిస్తాడు. మరి ఊర్వశి? అక్కడ కవికి స్వప్నం వస్తుంది. సత్య మైన స్వప్నం. స్వప్నంవంటి సత్యం. "నిశా నిటలాంత సీమ శ్యామల లలి తాల సాలకల"నుంచి కవి కను రెప్ప సెజ్జలమీద వాలు

తుంది. నిదుర పొదిగిళ్ల మెయి మెయి అదిమికొనగా నందనవీథిలో కవీ, ఊర్వశీ నడుస్తారు - 'ఎరుగ రాని దెదో కోర్కి బరువు వలన తడబడి పెనంగు సోమరి నడలు నడల'. అప్పుడు వనం అంతా హాయిగా నిద్దరపోతోంది. ఎప్పుడూ మగత అంటే ఎరగని మందాకిని కూడా. దూదిదారులులాగా నేలమీద పూవులు పోసిన ఒక తీగ దగ్గిరకు వస్తారు ఇద్దరూ. అప్పుడు -

ఎదురుగా నిల్చి ఎద నెద నదుముకొనెనొ,
కనులు కన్నుల కౌగిలి కరగ కనెనొ,
రెప్పపాటు తెర యయి నా హృదయ పుటము
తెరచి నిలిచిన దొక బాష్ప తరళ కణము !

మాయు నిశీథి కుచ్చెళుల మాదిరి ప్రాకు వనీ మహీజపుం
జాయల కోమల ప్రణయ చంచల యౌ వ్రతతీ సతీ గతిన్
ప్రేయసి వాలి నిండు తెలి వెన్నెల వన్నెల మల్లి పూవులన్
దోయిలి నించి నా చరణ ధూళుల నౌదల నుంచి జాలిగా -

"ప్రియతమా ! దాసి అక్షయ ప్రేమ సేవ
కీ లతాంతాలు ముత్తాలు చాలు నోయి !
నింగి మూలలె నీలి పందిళ్లు పరచి
ఎంత తెలిమల్లె తోట వేయించినానొ !"

అని ఊర్వశి అంటుంది. అప్పుడు మ న్నంతా మల్లెలు ! మి న్నంతా మల్లెలు ! అప్పుడు ఊర్వశి హృదయం కవిలోకి, కవి హృదయం ఊర్వశిలోకి ప్రవహిస్తుంది. అప్పుడు.....

కోరిక లెల్ల ధూళి బడ గోల్పడి, దిక్కుల శూన్య దృక్కులన్
జీరి, ఎదో వృథా శిశిర జీవిత భారము పుచ్చుచున్న భూ
మీ రుహ మేను, నా మొరడు మేవ నన ప్రసవాల జాలులే!"

అంటాడు.

విడని వాసన పదములు విరులె అయ్యె
ఆననమ్మున అశ్రులే ఆర వయ్యె
నిలిచినాడ నేటికి గూడ తొలి వసంత
కాలపు ప్రభాత తరుణ వృక్షమ్ము కరణి!

ఇది నా గొప్ప రచన అన్నిటికన్న - ఊర్వశిలో తుదిది!

"కృష్ణపక్షం" కన్న "ప్రవాసం," "ప్రవాసం" కన్న "ఊర్వశి" రచనా శిల్పంలో, అనుభవ ఉదాత్తతలో గొప్ప వనుకుంటాను. "ఊర్వశి" లో అంతా స్వప్నం. అయినా మళ్లీ అన్నీ గొప్పవే అనిపించడమూ, ఇంకో సారి ఏదీ కా దనిపించడమూ ఉంది. తర్వాతి రచనలు నాకు ఎంతో ఎత్తుగా ఉన్నా బొత్తిగా దగ్గరవి కనుక నేను ఎత్తను. ఇక - వెనక్కి తిరిగిన వాడిని ముందుకు తిరిగి పారజూస్తే "నే నింతవరకు వ్రాయనిదీ, ముందు వ్రాయబోయేదీ నిజంగా గొప్పది!" అంటే, 'నీవు చురుకుగా చెప్పావు కాని నిజం కా' దంటారేమో, ఏమో!

రేడియో ద్వారా ప్రసారితం

# మహాకావ్యాలు ఎందుకు రావడం లేదంటే—

ఇప్పటి కవులు చాలా వరకు సుదీర్ఘమైన ఒక మహాకావ్యం వ్రాయడం లేదు - ఎందుచేత నంటారు?

దీనికి చాలా కారణాలు ఉన్నాయి, బలమైనవి కూడా! ఈ కాలానికి ఒక లక్షణం ఉన్నది. అది తొందర. ఏదో ఊపి రాడక పోవడం. వేగం. ఆలోచించ వలసిన సమస్యలు ఎన్నో, అల్లలాడించే ఉద్యమాలు ఎన్నో, ప్రయత్నాలు ఎన్నో, సరదాలు ఎన్నో ఉన్నాయి. నిజానికి మళ్ళీ కృషి చేస్తున్న అంత కార్యరంగమూ ఉండనక్కరలేదు. ఉండనక్కరలే దేమిటి? లేదు- ఎందరికో! కాని ఎందుకో కాల పరిమితి చాలదు. రోజుకి ఇరవైనాలుగు గంటలు చాలవు; గంటకి అరవై నిమిషాలు చాలవు. "త్వర త్వరగా తేల్చెయ్యి; తొందరగా వెళ్ళిపోవాలి; బస్సు దాటుతుంది. ట్రయిను అందదు"- ఇవీ మాటలు. ఇంక ఇలాంటి అప్పుడు సుదీర్ఘమైన మహా కావ్యం ఎలాగ వ్రాస్తారు? ఎవరు వ్రాస్తారు? వ్రాసినా ఎలాగ చదువుతారు? ఎవరు చదువుతారు? కనుక చిన్న కావ్యాలూ, చిన్న కథలూ, నాటికలూను!

72

ఇంకొకటి కూడా కారణమే అనుకుంటాను. ఇది వరకు కవి సీతా రాముల గాథ, నలదమయంతుల కథ, నిగమ శర్మ చరిత్ర, ధ్రువోపాఖ్యానమూ అంటూ ఎవరిని గూర్చో వ్రాస్తూ మధ్యలో ఎక్కడో తన అనుభవాలు చొప్పిస్తూండేవాడు. వా డెక్కడ పుట్టాడో, దమయంతి ఎక్కడ పుట్టిందో, వాళ్ళు ఎలాంటి వాళ్ళో, వాళ్ళకి హంస ఎలాగ పరిచయ మయిందో వ్రాసుకు వస్తూ వస్తూ ఒక ఉత్కృష్ట తరుణంలో, ఒక తీవ్ర సంఘటన వచ్చినప్పుడు, ఒక మహావేశం ఊగించి నప్పుడు వాళ్ళు ఏం జేశారో, ఏమన్నారో చెప్పడానికి ఒక శిఖరం ఎక్కేవాడు ఇది వరకు కవి. ఇప్పటి కవి ఆ ఆవేశం దాకా తీసుకుని వచ్చిన సంఘటనలన్నీ తన జీవితం లోనే దాటుతూ వచ్చి ఆ పర్వత శీర్షం దగ్గరికో, ఆ ఉత్తుంగ తరంగం దగ్గరికో వచ్చేసరికి మాత్రమే ఆ కొంచెమూ పలుకు తున్నాడు. మరొక ముఖ్యమయిన కారణమూ ఉంది! ఇప్పటి కవికి అంత ఏకాగ్రత లేదు ; అంత సాధకుడూ కాడు. తపస్సు తక్కువ ఇతనికి !

తపస్సు అంటే ? ఆశ్రమ వాసమూ, ఏకాంతమూ లాంటివా ? అది యీ కాల పరిస్థితుల్లో సాధ్య మవుతుం దంటారా ?

అలాగ అక్కర్లేదు. తపస్వికి అంతరంగంలోనే ఆశ్రమం ఉంటుంది. విపణిలో విశ్రాంతి దొరుకుతుంది. కాని రాజశేఖరు డన్నట్లు కవి ఇల్లూ వాకిలీ ఒకలాగ తీర్చుకోవాలి. దొడ్డీ తోటా ఒకలాగ ఉంచుకోవాలి. దైనందిన జీవితం ఒక పద్ధతిలో నడి పించుకోవాలి - చదువుతో, సంధ్యతో, సమాజాభ్యుద యోద్య మాలతో సంతత సంపర్కంతో! అట్టి కవి ఎప్పుడూ ఒక అధిత్యక మీద, ఎత్తుమీద ఉంటూంటాడు. కాబట్టి అక్కడ నుంచి ఇట్టే కల్పనా కైలాసం మీదికి తరచు ఎగర గలుగుతుంటాడు. అతని భావన సామాన్య విహగం లాగ కాక, గరుత్మంతుని లాగ

ఉంటుంది. అతని హృదయం మంచు కాలవలాగ చినుకు చినుకుగా కాక, క్షీరసాగరం లాగ కరిగి కంఠ తీరం దాకా ఒరుసుకుని ఉంటుంది.

అట్టి సాధనా, తపస్సూ లేని కవి ఎప్పుడూ ఒక అంధకూపం లోనో, లోతు లోయలోనో జీవిక నీడుస్తూ, ఎప్పు డెప్పుడో కాని తుంగ కవితా శృంగం మీదికి ఎగరలేడు. రవీంద్రుడు పది దినాల్లో ఐహిక యాత్ర ముగించబోతూ కూడా కావ్యకల్పన చేస్తూనే ఉన్నాడు. ఆ మహాకవి అన్ని విధాలా తపస్వి కూడా - వ్యాస, వాల్మీకి, కాళిదాస కవుల్లాగ; షేక్స్పియరు, మిల్టన్, వర్డ్స్ వర్తు ల్లాగా! ఈ సాధనా, తపస్సూ తక్కువ అయిన కవులు శిరస్సు ఎత్తి, వక్షం పుంజుకుని దశదిశావకాశం నిండేటట్లు ముక్తకంఠంతో ఆలాపించలేరు. నిలిచి నిలిచి పాడతారు. అంతే కాక ధ్రువతార వంటి లక్ష్యం (ideal) ఉన్న వాణ్ణి ఊపుతుందే - ఆ ఉదాత్తావేశం - అది కూడా కొంచెం తక్కువేమో!

చాలామంది కవులు త్వరగా కావ్య రచన మాను కుంటుంటారు కదా! ఎందుచేత?

చెప్తా. ఒక్కొక్క మహాకవికి అంతరాంతరాల్లోనే ఒక గొప్ప రిజర్వాయర్ ఉంటుంది. ఒక పెద్ద డైనమో ఉంటుంది. సామాన్య కవులికి ఒక గరిటెడో, గంగాళమంతో శక్తి ఉంటుంది. అది అయిపోయేటప్పటికి మళ్ళీ నింపు కుంటుండాలి; మళ్ళీ చార్జి చేసుకుంటుండాలి. మన చుట్టూ అక్షయ చైతన్యంతో చలించిపోయే జీవలోకమే - ప్రకృతీ, ప్రజా-మనకు నిరవధికమైన రిజర్వాయరూ, డైనమోను. వానిలో పడి పోతూ ఉండాలి. లేకపోతే చల్లపడి పోవడం, వట్టిపోవడం, ఆరిపోవడం జరుగుతుంది. నవ జీవన ప్రవాహంలో మొదట పడిపోయిన కవికి ఏదో అనుభూతి వస్తుంది. దానిని గూర్చి ఆవేశంతో వ్రాస్తాడు. తరువాత ఆ అనుభవం

అంటే ఆప్యాయం చేతనో, అహంకారం చేతనో తన చుట్టూ గోడ కట్టుకుని, లేక తాను ఒక గదిలో చతికిలబడి ఆ అనుభూతినే గట్టిగా కౌగిలించుకుని కూర్చుంటే, అది అతని చేతుల్లో ఊపిరాడక నలిగిపోయి చనిపోతుంది. దానిలోకి కొత్తవేడీ, కొత్తరుచీ రావడానికి గాని, లేక కొత్త కొత్త అనుభవాలు రావడానికి గాని అన్ని వైపులా మసల్ని పొదిగి ఉన్న అనంత జీవలోకంతో కవికి అవిశ్రాంతమూ, అనవచితమూ, అత్యంతాప్తమూ అయిన సంబంధం ఉండి తీరాలి! జీవమే జీవం ఇస్తుంది; గోడ గోరీ కడుతుంది.

ఇంకో విశేషం - కష్టసుఖాలతో, పందిరి బాంధవ్యాలతో నిండి ఉన్న ఈ లోకంతో సన్నిహిత సంబంధం ఉండడం వల్ల కవిలో ఒక కరుణ పుడుతుంది. జాలి కాదు; కరుణ. జాలి నీరసం. కరుణ శక్తి; కరుణ ప్రేమ. ఆర్తక్రౌంచ విరహం నుంచి ఆదికావ్యం పుట్టింది. జీవలోకంతో నిత్య స్నేహంవల్ల కావ్య వస్తువుగా అనుభూతీ, కావ్య కల్పనకు ప్రేరేపించే కరుణా, కల్పన చేయించ గలిగే శక్తీ, చైతన్యమూ వస్తాయి.

**ఎందుకు వదులు కుంటున్నారండీ జీవలోకంతోటి అంత ఆవశ్యకమైన నిత్య స్నేహాన్ని ఈ నాటి కవులు?**

ఈ స్నేహం వదులు కుంటున్నాం కొంతమందిమి. ఈ వదలడానికి కారణాలు ఉన్నాయి. ఒక కారణం ఇది: తర తరాలనుంచి నా రక్త నాళాల్లో ఇంకి ఇంకి ఇమిడి ఇమిడి ఉండే అసత్య వేదాంత ప్రభావం. ఋషులనీ, ఆచార్యులనీ ఆవేశించిన అద్వైత వేదాంతం కాదు. ఇది నన్ను త్వరలో నిస్పృహలో, నీరస స్థితిలో, నిద్దరలో, జడత్వంలో దింపుతుంది. ఇంక ఆవలించడమూ, ఆలోచించడమూ తప్ప అన్యమేమీ ఉండదు. కావ్యోత్సవం ఉండదు. కాస్త తూర్యనాదంతో సరి!

ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయండీ - పెద్దకావ్యం వ్రాయ లేక పోవడానికీ, త్వరగా కావ్యకల్పన ముగించడానికీని ?

ఇంకా హేతువులు ఉన్నాయి: స్వచ్ఛందతా, స్వాతంత్ర్యమూ కొన్ని శతాబ్దుల నుంచీ లేకపోవడం. మెదడూ, హృదయమూ, కాళ్ళూ, చేతులూ రకరకాల సంకెళ్ళతో కట్టుపడి కట్టుపడి కదలలేక కదలలేక కాస్త కాస్త పని చేస్తున్నాయి. అలసట, కించిత్ శక్తి. ఇంట్లో, సమాజంలో, దేశంలో ఎక్కడా స్వచ్ఛంద వృత్తీ, సత్య జీవితమూ తక్కువ. నిర్భీతితో, నిరంకుశతతో కలిసిన నియమ బద్ధత కావాలి. ఆత్మ స్వాతంత్ర్యం అలవరచుకున్న ఏ ఒక్కడో అటువంటివాడు ఉంటాడు. అంతే కాక జాతి అంతా ఒక పీఠభూమి మీదకి ఎక్కితే, అక్కడనుంచి ఉడ్డీనము - ఎగరడము - తేలిక! కాశ్మీరానికి కాంచనగంగ దగ్గర!

ప్రాచీన కవిత్వం, నవ్య కవిత్వం- ఈ రెంటిలో ఏది గొప్పది మీ దృష్టిలో ?

నేనలాగ విడదీయలేను. కవిత్వం, కవిత్వం కానిదీ ఉన్నాయి నాకు. అంతే! నాకు కవిత్వమయినది ఏ కాలానిదైనా, ఏ జాతిదైనా, ఏ పద్ధతిలోనిదైనా బాగుంటుంది. అయినా నాకు ఇలాగ తోస్తుంది: మంచి కవిత్వంలో, అసలు కవిత్వంలో సాంస్కృతికతా, కాల్పని కతా, వాస్తవికతా మూడూ కలిసి ఉంటాయి అని. ఏది ముదిరినా, ముదిసినా పాడే ! సాంస్కృతికత ఎక్కువయితే నిర్జీవ స్థితి వస్తుంది. కాల్పనికత హద్దుమీరితే ఉన్మత్తతలోకి దిగుతుంది. వాస్తవికత పెచ్చుపెరిగితే రంగూ, రుచీ లేకపోవడం తటస్థిస్తుంది. కవి గోపురం వంటివాడు. భూగర్భంలో ఉన్నది పాదం; తారామండలంలో తల.

పోనీ - కవి వృక్షం వంటివాడు; క్షమా జననీ వక్షాన్ని పెన వేసుకుని - జీవనం అంటే జీవమూ, నీరూ అని కదా - జీవనం

పీల్చుకునే వేళ్ళూ; నలుదిక్కుల నుంచీ వచ్చే గాలులు పీలుస్తూ కొమ్మలూ, రెమ్మలూ; ఆకాశంలో ఊగులాడే శిరస్సూ; మన అందరికీ ప్రసవాలూ ఫలాలూను! మన్నూ మిన్నూ కౌగిలించుకున్న చోటులో కాదూ - మనోహరమైన స్వర్ణారుణ రాగాలు వికసించి పోవడం? అయినా ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క లక్షణానికి ఎక్కువ ప్రాముఖ్యం ఉంటూంటుంది. దానిని బట్టి మహా కావ్యాలు నిర్మించే యుగమూ, చిన్న ప్రబంధాలూ, ఆత్మానుభవాలు చెప్పే ఖండ కావ్యాలూ వ్రాసే యుగమూ, నాటకాలూ, నవలలూ వ్రాసే యుగమూ అంటూ ఏర్పడతాయి. ఇది మాత్రం నిజం: ఉత్తమ కావ్యంలో ఈ మూడు లక్షణాలూ ఇమిడి ఉండాలి!

ఇప్పటి ప్రపంచ పరిస్థితులు గొప్పకావ్య సృష్టికి అనుకూలంగా ఉన్నా యంటారా?

'లేవు' అని నాకు తోస్తుంది. ప్రేమలో నుంచీ, మేళనంలో నుంచీ, సామరస్యంలో నుంచీ చక్కనిదీ, గొప్పదీ సృష్టి వస్తుంది. ఇది సంధి, సంధ్య. పాతలోకం పోయింది; కొత్తలోకం ఏర్పడ లేదు. పడిపోయే గోడలూ, కట్టడాలూ - అంతా ఛిన్నా భిన్నం (disintegration) అవుతూంది. అందుకే పాశ్చాత్య సాహిత్య లోకంలో గొప్ప సృష్టి చేసే కవి రాజులు ఈ యుగంలో లేరని పాశ్చాత్య వాఙ్మయ తత్త్వవేత్తలే అంటున్నారు. అశాంతి-అశాంతిలో అక్షరమూ, అఖండమూ అయిన సృష్టి ఎలాగ? ఎంత సేపూ అప్పటి అవసరానికే అనుకూలించే [illegible], ట్రెంచెస్సూ, శిబిరాలూ తయారు చేసుకోవాలి. శాంతి, సామ రస్యమూ, మేళనమూ కావాలి. మెదడుకీ, హృదయానికీ సామ రస్యం, పూర్వ వర్తమాన భవిష్యత్తులకూ సామరస్యం, ప్రకృతికీ, ప్రజకీ, నాకూ, లోకానికీ, ప్రాచ్య, పాశ్చాత్యాలకీ సామరస్యం, సాంస్కృతికతా, కాల్పనికతా, వాస్తవికతలకీ సామరస్యం -

V.R. NARLA MEMORIAL LIBRARY * V.R. NARLA D.P.R.I. Acc No.

ఇదంతా ప్రతి ఉత్తమ సృష్టికి లాగే కావ్య సృజనకీ విధిగా కావలసిన దని తత్త్వజ్ఞు లంటున్నారు.

ఇటువంటి సృష్టి కావించే, అంటే - రామాయణమూ, భారతమూ, ఒడిసీ వంటి వానిని సృష్టించే విశ్వకవి ఇంక పుడతాడా? మన దేశంలో పుడతా డని ఆశపడవచ్చునా?

ఆశ ఉండడం ఆరోగ్య లక్షణం. నా విశ్వాసం పుడతా డనీ, ఇక్కడే పుడతా డనీ కూడా. రవీంద్రు డట్టివాడు కాకపోతే ఎవరెస్టుకి మెట్టుగా ఉండే సమీప శిఖరం అని నా నమ్మకం. శ్రీ అరవిందులు ఇలాగ అన్నారు-ఇది వారి ఒక రచనకు సారాంశం: "మన

మన భారత సాహిత్య చరిత్రలో మూడు మహాయుగాలు వచ్చాయి- మూడు మహాయుగాలలోనూ ముగ్గురు విశ్వకవులు వచ్చారు.

మొదటిది ఆర్జవావేశం - నీతి బాణీలకు సంబంధించిన వాదం గొప్పగా ఉన్నది. అప్పుడు వాల్మీకీ, రామాయణమూ వచ్చాయి. రెండోది: మేధ నిశితాతి నిశితంగానూ, మహోత్తమంగానూ ఉన్నది. అప్పుడు వ్యాసుడూ, సర్వ మానవ సమస్యలనీ పరిష్కరించే భారతమూ వచ్చాయి. మూడోది: ఐహిక సుఖాలూ, సౌందర్యమూ అవధి దాకా అతిశయించిన యుగం. అప్పుడు కాళిదాసూ, రాగ సౌందర్యాలతో నిండిన రసవత్ కావ్య జగత్తూ వచ్చాయి.

ఈ మూడు శక్తులనూ అంటించే జిగురు ఇంకో శక్తి ఉంది. అది ఆధ్యాత్మికం. ఆ శక్తి కూడా అవతరించి, అన్నిటినీ మించిన సృష్టి సాక్షాత్కరిస్తుంది అనే సూచనలు మనదేశంలో కనబడ్డాయి- శంకర, రామానుజాచార్యుల ఆగమనంతో. అంతలో అన్య ప్రభావాలు వచ్చి మన మీద పడ్డాయి. ఆ మహా ముహూర్తం పోయింది.

రవీంద్రుడు మహాకవే, సందేహం లేదు. కాని ఆయన అటువంటి మహాకావ్యం ఏదైనా వ్రాశారా?

ఒక బుద్ధిశాలి అన్నట్లు - ఆయన రచనా ప్రపంచం అంతా కలసి రామాయణమూ, మహాభారతమూ వంటి ఒక పెద్ద కావ్యం అవుతుంది. వ్యక్తిగతమైన తన అనుభవాలు మొదలుకొని, తన చుట్టూ ఉన్న సమాజానికీ, తన దేశానికీ, అఖిల మానవ లోకానికీ సంబంధించిన అనుభవాలూ, సమస్యలూ అన్నీ ఆయన కావ్య ప్రపంచంలో ఉన్నాయి. అంతేకాదు. వేదాలూ, ఉపనిషత్తులూ, రామాయణం మొదలుకొని, నేటి భారత సంప్రదాయ సంస్కృతుల దాకా తనలో నింపుకుని, పాశ్చాత్య సంస్కృతులను, శాస్త్ర దృష్టినీ సంగ్రహించు కొన్నాడు. అంతే కాదు - శాంతి నికేతనంలో శాశ్వత నివాస మేర్పరుచుకుని, పాశ్చాత్య ఖండాలకి ప్రస్థానం తరుచు సాగిస్తూ, అక్కడ పరిస్థితుల్నీ, ప్రజాందోళనలనీ, ప్రచండోద్యమాలనీ ముఖాముఖీ పరీక్షించాడు. అందువల్ల విధ విధాల సామరస్యం ఆయనలో ఏర్పడింది. ఆయన ఒక కావ్యంలో అంటారూ - తాను వెనక కాళిదాసైనట్లు, ఉజ్జయినీ రాజవీథుల్లో ఊరేగినట్లు, ఇంకా ఏవేవో చేసినట్లూనూ! అవునా అని మనకి అనిపిస్తుంది. అంతే కాదు, మహాభారత విప్లవంలో తాను గూడా ఉండి దాటించాడనిపిస్తుంది. అంతేకాదు, ఆర్తక్రౌంచనాదం విని ఆదికావ్యం ఆలపించాడా అనిపిస్తుంది. కనక, ఈ మూడు శక్తుల్నీ అతిక్రించిన విశ్వకవా? అనిపిస్తుంది. పోనీ, అలా కాకపోతే, ఇందాకా చెప్పినట్లు, ఆ ఉత్తుంగ తమమైన హిమాచల శృంగానికి దగ్గరగా ఉన్న శిఖర సోపానమేనా అవాలి! ఇంక ఇక్కడ మనలో గొప్ప ప్రతిభ ఉండొచ్చు - తరుణం రాలేదు. ఆ రెండూ కలిసినప్పుడు గొప్ప సృష్టి. ఇప్పుడు ఎదురు సన్నాహాలు ప్రారంభించాయి. పెళ్ళి పీటల మీద కూర్చో లే దింకా ఆ రెండూను.

—రేడియో ఇంటర్వ్యూ

# లిరిక్ శిల్పం

మన తెలుగు రెండు భాషలుగా ఉంది - కావ్యభాష, వాడుక భాష అని. రచయితకు ఏ ఒక్కటైనా క్షుణ్ణంగా రావాలి. రెండూ వస్తే చాలా గొప్ప. మన భాష అని వ్రాసేది మన సొంత వ్యావహారికం. గురజాడ కన్యాశుల్కం లోది లోకంలో వాడుక భాష.

కోట్ల మందితో రచయితకు సన్నిహిత సంబంధం ఉండాలి. కారణాలు ఇవి : ఒకటి - జీవద్భాష బాగా రాయడానికి. రెండు - లోకం - జనం - ఎన్నడూ వట్టిపోని రిజర్వాయరు, డైనమో. వాని నుంచి మనం జీవనం నింపుకొంటుండాలి. వాని నుంచి చైతన్యం తీసుకోవాలి. జీవల్లోకంలో నుంచి మనకు వస్తువూ కావాలి. సృష్టించే శక్తి నిచ్చే కరుణా కావాలి. ఇక్కడ కూర్చుని, మదరాసు లోనో, బొంబాయిలోనో మనం "కొట్టండీ - దంచండీ - చంపండీ, మానవుడా.... లేరా!' అంటే కుదరదు. ఆ విధంగా కవి మాటకు ఉండవలసిన జీవం (warmth) ఉండదు. మానవ మహాసాగరంలో పడిపోవాలి. అప్పుడే ఆ రచనకు జీవించి ఉన్నవాని శరీరానికి వలె warmth ఉంటుంది. లేకపోతే ఎంత సుందరంగా చెప్పినా అది నిర్జీవమూర్తే!

ఇంకొక సంగతి :

ఇవాళ పద్యం వ్రాస్తాను అని కూర్చుని అందమైన phrase కాని, image కాని వస్తే దాని చుట్టూ ఒక కృతి అల్లడం లాభం లేదు - ఆ సమాసం, ఆ image వదులుకోలేక !

ఆ image, సమాసం వద్దకు వచ్చేసరికి భేష్ అంటాం - ఆ నిముషానికి, తెలియని వాళ్ళం !

అలాగే ఒక కృతి (poem) లోనే series of beautiful images and phrases ఉండవచ్చు. కాని అన్నీ కలిసి ఒకే ఒక జీవన్మూర్తి కావాలి. లేకపోతే అందమైన కిటికీలూ, తలుపులూ పక్కపక్క పెట్టిన ట్లవుతుంది. మందిరం కాదు. . . దానిలో ఏది తీసేసినా మందిర రూపం అంతా కూలిపోతుంది.

సెసిల్ డే లూయీ అన్నట్లు - those images quarrel among themselves and tear the poem to pieces....

నాకు చాలా మంది రచనలు బాగుండవు - జీవన్మూర్తులకు ఉండే వేడి, warmth లేక ; ఒకే ఒక మూర్తిలో inevitable గా ప్రతీ పదమూ, image ఉండవు గనుక.

రవీంద్రుడే అన్నట్లు - the whole universe is a lyric, in which every part or thing must agree with the other parts and things.

సాహిత్య రూపా లన్నిటిలో కవిత్వం ఎక్కువగా ఆత్మాశ్రయం ; లిరిక్ మరీని !

ఏదో సంఘటనో, ఏదో వస్తువో కవి అంతరంగాన్ని స్పృశించి, దానిని ఊపి, ఆవహించి, తన సొంత అనుభవంగా అయి పోయి, అతని విశిష్టవాణి ద్వారా లిరిక్ అయి వెలువడుతుంది.

లిరిక్‌లో బుద్ధికి కన్న, మెదడుకు కన్న హృదయానికి అధిక్యం. లిరిక్ వ్యక్త పరచేది హృదయ భావం (truth of the emotions). లిరిక్ కవి హృదయ వాది.

"I will fly to thee on the viewless wings of poesy, though the dull brain perplexes and retards" అని Keats కాబోలు అన్నాడు.

లిరిక్‌లో ప్రతి శబ్దానికీ ప్రత్యేక పరిమళం ఉంటుంది; ప్రత్యేక వర్ణం ఉంటుంది. ఆ శబ్దానికి పర్యాయ పదం ఉండదు. విధిగా ఖచ్చితంగా అదే అక్కడ ఉండాలి - అది inevitable word. అక్కడ అది తప్ప వేరొక మాట నప్పదు.

నిజమైన కవికి పర్యాయ పదా లంటూ ఉంటాయా ?

ఇక - లిరిక్‌లో ఒక శబ్దానికి మరొక శబ్దం ప్రాణమిత్రం, ఆప్త బంధువు. పదాలు పనిగట్టుకుని దగ్గర చుట్టాలను పిలుచుకొని చుట్టూ చేర్చుకుంటాయి. అవి చెట్టపట్టాలు వేసుకోవాలి. అడుగులో అడుగు కలిపి ఒకే అడుగుగా నడవాలి అవి. వాటిలో వాటికి ఏ పొరపొరా, మెరమెరా ఎక్కడా రాకుండా ఉండాలి. కలిసి కట్టుగా విహారం చెయ్యాలి అవి. లయ చెడకుండా, స్వరం తప్పకుండా, అపశ్రుతి రాకుండా ఒకే గొంతులోనుంచి లాగ కలిసి పాడాలి అవి.

వాటికి ఒకే ఒక బొంది; ఒకే ఒక ప్రాణం!

లిరిక్ రాగ తాళాలతో గేయమే కానక్కరలేదు. పద్యం కావచ్చు, వచనం కూడా కావచ్చు!

రవీంద్రుడు ఒకచోట ఇలాగ వ్రాసేడు :

"లిరిక్‌లో ఛందస్సూ, భావమూ కరిగి కలిసి ఒక టైపోతాయి (the expression and the expressed are one). విడదీస్తే

అవి ఒక దాని నొకటి మింగేసే శక్తులు. వాటి సహజ వైరుధ్యాన్ని పోగొట్టి సమన్వయించాలి; లేకపోతే తక్కువ రకం కవిత్వం తయా రవుతుంది" అని.

కొన్ని రచనలలో, నగలు భావాలను ఊపిరాడనీయవు. కొన్ని రచనలు, జిగీ బిగువూ నగా లేక, జావగా చప్పగా జారిపోతాయి. కొందరికి చెప్పే నో రుండదు. కొందరికి నో రుండి చెప్పేది ఉండదు.

రవీంద్రుడు ఇంకా ఇలా అంటాడు:

"ఏ సృష్టి కయినా- కవి సృష్టి కే కాదు- ఈ సమన్వయం కావాలి; మన ముందు పరస్పర విరుద్ధా లయిన వస్తువులు ఉన్నాయి. వాటి నిత్య సంఘర్షణలోనుంచి ఏకత్వం సృష్టించాలి. ఆ శ్రమ పడడానికి ఓపిక లేక సంఘర్షణను అలక్ష్యం చేస్తాము. అప్పుడు సృష్టి కూడా జరగదు.

"ఈ లోకం, ఈ సృష్టి అంతా కలిసి అత్యద్భుతమైన ఒక lyric.

"మన జీవితం ఆ పాట వినడం వంటిది. పాటలో అందాన్నీ, తీయదనాన్నీ అస్వాదించడానికి తుది వరకూ ఆగ నక్కర లేదు. పాట ఉండనే ఉంది. పాట మొదలు పెట్టగానే దాని అంతం కోసం ఆరాటపడం; పాటతో పాటు మనమూ సాగుతాము - ప్రతి చిన్న మెలకువనూ స్పృశిస్తూ. లోకం అనే పాటలో కూడా భాగాలు మనల్ని అలసట పెట్టవు, విసిగించవు. ఆ భాగాలలో ఉన్న ఏకత్వం మనం గ్రహించిన కొద్దీ మన ఆనందం పెరుగుతుంది."

కవిత్వానికి పదాలకన్నా కూడా వాటి కూడిక వల్లా, కూర్పు వల్లా జనించే గానం వంటిది మరీ అవసరం - "పొసగ ముత్తెపు సరుల్ పోహళించి" నట్లు. మల్లెనో మందారాన్నో ఒక మూస (crucible) లో పడవేసి కాల్చివేస్తే, దాని వన్నె, వాసనా ఏ కారణాలవల్ల కలిగాయో తెలియదు. అందుకే ఒక భాషలో వెలసిన కవితా సృష్టిని వేరొక భాషలో రూపొందించ డానికి చేసే ప్రయత్నం వ్యర్థ మని షెల్లీ అన్నాడు-"చెట్టు మళ్ళీ విత్తునుంచే పుట్టాలి, లేకపోతే పూయదు!" అని.

"Charmed magic casements, opening on the foam of perilous seas in the fairy lands forlorn"- Keats.

ఈ పంక్తులు ఆంగ్ల లిరిక్ శిల్ప కళకు విజయ స్తంభాలు. వీటిలోని ప్రతి పదానికీ అంతులేని స్ఫోరక శక్తి ఉంది; వీటిని వినగానే ఎందుకో కళ్ళు చెమ్మగిల్లుతాయి - అన్నాడు ఒక ఆంగ్ల విమర్శక శిఖామణి. వీటిని మరొక భాషలోకి అనువదించడం ఎలాగ? అర్థం మాత్రం అయితే తేలికే! కాని దీనిలోని ప్రతి పదమూ ఒక గవాక్షం. దానిలో నుంచి విజనా లైన వింత లోకాల వరకూ పరచుకొన్న కడలుల కరళ్ళపై మరిగి రేగే నురుగులూ అవీ కనబడతాయి.

ఇటు వంటివి మన మహా కావ్యాలలో నుంచి ఎన్నో చూపించ వచ్చు. నన్నయ్యగారి భారత భాగంలో నుంచి మరీనీ. నన్నయ్య అంత గొప్ప లిరిక్ కవి తెలుగు కవులలో లేడు. తిక్కన్న అంత నాటక కర్త (dramatist) భారత సాహిత్యం లోనే ఉన్నాడా అనిపిస్తుంది.

మన ఆంధ్ర భారత భాగవతాలు అనువాదాలు కావా అంటారేమో! ఏమో నాకు తెలియదు. ఆ సంగతి తెలుసు

కోవాలనీ లేదు. అవి నాకు చాలు. వాటిని రచించిన కవులది మాత్రం అతిలోక మైన ప్రతిభ. వారున్నా రుషులే! కాక ఆ మహా కావ్యాలలోని ప్రత్యంశమూ వారి సంస్కృతిలోని భాగం; ప్రతి సంఘటనా వారికి పరమ సత్యం. వారి జీవితమూ, వారి సమాజమూ వాటిలోని గాథలతో, పరమార్థాలతో నిండిపోయి ఉన్నాయి. కనుక ఆంధ్ర భారత, భాగవతాలు మళ్ళీ భూగర్భంలో నుంచి మొలిచి నిలువునా పూచి నిలిచిన మహాకల్ప వృక్షాలు!....

—మద్రాసులో జరిగిన అభ్యుదయ రచయితల మహాసభ (1976) అధ్యక్షోపన్యాసము, 'శ్యామవర్ణి' భూమికల నుంచి కూర్చినది.

# అవతారిక

(1947 ప్రాంతంలో మద్రాసు రేడియో కేంద్రంనుంచి శాస్త్రిగారు తమ కావ్యాలు కొన్ని 'రజని' చేత చదివిస్తూ, వాటికి చెప్పిన అవతారికలు)

ఇప్పుడు, ఒక్కసారి వెనక్కి తిరిగి, స్వీయకవితా మార్గంలో పాతిక ముప్ఫయ్యేళ్ల దూరాన్నుంచి మనస్సును నడిపించు కుంటూ వస్తే జీవితం ఎన్ని అనుభవాలతో క్రిక్కిరిసినట్టు ఉంటుందీ! అప్పుడు కేవలము అగ్నిహోత్రంలాగ అంటుకున్న అనుభవాలు కూడా, ఇప్పుడు స్మృతిసీమలో అత్తరువాసనలాగ హాయి అనిపిస్తున్నాయి. ఒక్కొక్క అనుభవం మనస్సు ఊపి ఊపి ఒక్కొక్క పాటగా, పద్యంగా బయటికి వచ్చి పడేది. జీవితమూ, కవిత్వమూ కలిసిపోయి పెనవేసుకుని పోయాయి.

అప్పుడు కవే కథానాయకుడు. తనకి పరిచయమైన లోకంలో ప్రతి వస్తువూ తనకోసమే పుట్టినట్టు, జగత్తంతా తనవైపే కళ్ళను, చెవులను త్రిప్పుకుని ఉన్నట్టు ఉండేది కాబోలు!

'.... అత డున్మత్త భావశాలి
ఆగికోలేడు రేగు నూహల నొకింత!'

... ... ...

ఇంత చిరుగీతి యెద వేగిరించునేని
పాడుకొనును తాండవ నృత్య మాడుకొనును :

కాని తన అనుభవాన్ని నలుగురి అనుభవంగా చెయ్యగలగడం వల్ల తన కావ్యాలు కొన్ని హృదయాల్లోకి చొచ్చుకొని పోవడమూ, మరికొన్ని కంఠాల్ని కూడా పలికించడమూ జరిగింది. ఆ రోజుల్లో ఒక్కొక్కని కవితలో ఎంత జీవమూ, ఎంత పటిమా లేకపోతే అది ఉద్యమమై కొన్ని యేళ్ళపాటు పలికే కంఠా న్నల్లా పట్టుకుని అవహించ గలుగుతుంది ?

కొత్తయుగం. కవికి కొత్త యౌవనం, స్వేచ్ఛాజీవన మంటే అభిలాష. సమాజంతో సంఘర్షణా, బాధా, అన్వేషణా, కోరికలు, అవి ఫలించక పోవడమూ - లక్ష్యాలు, అవి అందక పోవడమూ - కృష్ణపక్షరాత్రి - ప్రియతముల మృత్యువు. ప్రవాసము, మళ్ళీ అన్వేషణా, కొంతకాలం వెదకి వేసారడము, 'విభావరీ వేలాశాలల... మృదు వసనాంచలముల గుసగుసలు' కూడా వినబడక పోవడము, సమాజంలో వివిధోద్యమాలు, ఆకలి ద్వేషాలు, ఆందోళనలూ, ప్రపంచయుద్ధాలూ, దిగులు, కొత్త లోకపుటంచుల దర్శనము, గాంధీజీ, మానవమాత్రుని సాక్షాత్కారము – ఇవన్నీ వరుసగా కాశీపటంలో లాగ ఎన్నని సహృదయులకు అందజేయడం ?

అయితే, ఒక్కొక్క సమయంలో ఎంచేతో ఒక్కొక్క అనుభవం మీద మనస్సు ఎక్కువ స్తిమితంగా కాలూని నిలుస్తుంది. ఇదిగో ఇది ఒకటి. మృత్యువు. భయంకర వియోగం. కాని కవి ఆశావాది :

నీలి నీలి దారాల తారా లతాంత
.... .... ....
పరువు లిడు నామె వ్రేళ్ల తొందరలు నాకు !

(పల్లకీ - పుట 7)

ఆమె ఏ సుదూర స్వర్గంలోనో ఉండి కవి కొరకు ఎదురు చూస్తుంటుంది. అతడు కూడా రాగానే కంఠాన్ని అలంకరిద్దామని రాత్రుళ్లు నీలి నీలి దారాలతో నక్షత్రాల్నే పువ్వుల దండలుగా కూరుస్తుంటుంది. పగళ్లు, పాపం, ఒక్కొక్క పువ్వే విడదీసి, తన మబ్బు చెరగుల్లో వాటిని ముడివేసి దాచుకుంటూంటుంది. ఇలాగ రోజూ జరుగుతుంది. ఎప్పుడూ రాని అతని కోసం ఇలాగ రోజూ చేస్తున్నా ఆమె అలసిపోవడం లేదు. పరువు పరువున పువ్వులు తీసి దండలు గుచ్చే ఆమె వ్రేళ్ల కదలికలు ప్రతిరాత్రీ అతనికి మెరపుల నాట్యాల్లాగ కనిపిస్తున్నాయి. కనిపించి అతన్ని ఆశతో నిలబెట్టి బ్రతికిస్తున్నాయి కూడా.

ఇక ఇది ఇంకో రకం కావ్యం. అది వసంతం, ప్రభాతం కూడా! కనుక తోటలోను, పాటలోను నిండిన స్వప్నాలు - ఎర్రనివీ, పచ్చనివీ – కిటికీల్లోంచి వచ్చి నా లోపల అంతా నిండి పోయాయి. అప్పుడు నువ్వు మెల్లగా వచ్చి, నా కుటీరం వాకిట్లో నిలబడి, 'నేను రా వచ్చునా?' అన్నావు. నేను నా ఊహల్లో మునిగి ఉన్నాను. నా కా మాటలు వినపడలేదు. ఇప్పుడు ఆ వసంతం పోయింది. వేసవి, వానకారు, శరత్తు - అన్నీ పోయాయి. శీతకాలపు చిన్నెలు నా కుటీరం అంతా నిండి ఉన్నాయి. ఇప్పుడు బ్రతుకు మృత్యువుగా ఉంది, గుండె శిలగా ఉంది, గొంతు కదలదు, పిలుపు రాదు నా కిప్పుడు. 'నువ్వు రావచ్చును' అని అనలేను సరికదా, 'నేను రాలేను' అనైనా ఏడవ లేక పోతున్నాను -

వాటి యామని వరువాత తోటలోన

.... .... ....

"నేను రాలే" నటం చేద్వ నైన లేను !

(పల్లకీ - పుట 6)

ఆ రోజుల్లో రూమీ, హాఫీజ్, సాదీ లాంటి సూఫీ కవులవీ; కబీర్, మీరా, విద్యాపతి వంటి మధ్యయుగం భారత భక్తులవీ కావ్యాలు వినిపించి శ్రోతల్ని నా గురుదేవులు వివశుల్ని చేసేవారు. నా గురుదేవు లంటే రఘుపతి వేంకటరత్నం నాయుడు గారు. ఇక పారశీక సాహిత్యానికి సూఫీ కవిత్వం కిరీటం. సూఫీ కవిత్వానికి హాఫీజ్ తురాయి. ఈ లోకం పానశాల, మధువు ప్రేమ. మధు పానం చేసి భగవంతుణ్ణి వెదకడం ప్రియాన నాన్వేష ణోత్సవ యాత్ర. మధుపాత్ర సికందరు అద్దం, సికందరు అద్దంలో చూస్తే విశ్వం అంతా కనబడుతుం దని పారశీక సంప్రదాయం. ఈ గేయం హాఫీజ్ కావ్యానికి అనుకరణగా :

వేబోక విరియు ; నెచ్చెలులార యిను డెగయు !

.... .... ....

నీ క్షమాదృఢహస్తములనే సకి ముసుంగు !

(పల్లకి - పుటలు 4,5)

హాఫీజ్ అనగానే ఉమర్ ఆలీషా కవి జ్ఞాపకం వచ్చాడు. నా ప్రాణమిత్రుడూ, నేనూ కలిసి ఉమర్ ఖయ్యాం చదివేవాళ్లం. అది శివరాత్రి. పిఠాపురంలో కుక్కుటేశ్వర స్వామి రథోత్సవం. ఉమర్ ఆలీషా గారి ఇంటి అరుగుమీద ఉత్సవాన్ని చూస్తూ నిలబడ్డాడు కవి. కవిలో తండ్రుల నాటి స్మృతులు కదులుతాయి. వెంటనే కవి ఒక కావ్యంలో తానే నిగమ శర్మ అవుతాడు: దాని లోని కొన్ని పద్యాలు :

నీ నిట లోగ్ర పావక కనీనిక క్రక్కు లయాగ్ని కీల ఏ
మైన దయా గయాసుర విరాసన తీవ్రత కోడి, కోడి రూ
పై నిఖిలేశ్వరేశ్వరుడ వయ్యు నిశీథి విశీర్ణ కుడ్య వా
సానుచిత శ్రమన్ బడ అసత్యపు నాటక మేటికో ప్రభూ !

ఒక పాము బుస్సుమని .... .... వా తండ్రి !

మోహ నిద్రాతి .... .... ప్రబోధమ్ము సేయ !

(చూ. పల్లకీ - పుటలు 49, 50)

దవు దవ్వ లంద కేతన కింకిణీ మణీ
నవఘృణీ వార మందంద నరసి
పురుగేని వరుగేని దరిసి పెంధూళిలో
నొదిగి రథమ్ము కట్టెదుట నొరగి
శివశివా యనుచు నేడ్చిన చాలు మనుచునే
గాని అవంత యాగ్రహము రాదు
వ్యాళమ్ము లేల ? త్రిశూల మేలా ? నన్ను
నేలు వానికి కంటి కీల యేల ?
తాను హాలాహలము దిగత్రావి త్రావి
గృహ గళార్గళ మేల బంధింప తండ్రి ?-
నాకు నీకయి కురియనే కాక లేత
వెల తలపు వాన చదలేటి చలువ సోన !

ఇటు దెసమాలి జాలి బ్రతు కీడ్చుట కన్న ప్రపన్నపాళి హృ
చ్చటుల రయమ్మునన్ పొరలు స్వామి రథాంగ వథాంగణాన హే
నిటల విలోచనా ! హర ! వినీలగళా ! భవ ! కంకణీ కృతో
ద్భట వికటోరగా ! శివ శివా ! యని ప్రాణము లేల పాయనో ?

# కళ - జీవితము

(ఏలూరులో జరిగిన 1942 సవ్యసాహిత్య పరిషత్తు అధ్యక్షోపన్యాసం నుంచి)

"సంకెళ్ల లాంటి శాసనాలు మృతులైన వాళ్లే చేస్తారు. వాటికి మనం లోబడి పోతాం. నేను కూడా అలాంటి శాసనాలు చేసి చచ్చిపోతానేమో ? అలా కాకుండా ఉంటే ఎంత బాగుండును!" అని ఒక ఆంగ్లకవి పద్యం చదివాను. దీనివల్ల కొన్ని శాసనాలూ, నియమాలూ అసలే వద్దని కాదు. సాగనివ్వకుండా ఘనీభవింపచేసి, చంపేస్తాయి కదూ సంకెళ్ళు ? - అవి వద్దని.

సంకెల చీకటీ, ముసలితనమూ, మరణమూను ! తేజస్సు పురాణమయినదీ, తరుణమూ. సందె చీకట్లు ఒక గడియే ఉంటాయి. పుట్టడమే ముదిసి పుడతాయి. కవి వెలుగు వైపు నడుస్తూ ఉండాలి - నిజానికి. . I am of an age with each ; what matter if my hair turns gray ? నేను యువకుణ్ణి కాకపోతే ప్రతి అనుభవానికీ నా గుండె ఎలాగ కొట్టుకుంటుందీ ? నా మనస్సెలా రెక్కలు తొడుగుకుని భావిస్తుంది ?

స్థిరపడడం, స్తిమితపడడం అని లోకం అంటుందే - అదంటే నాకు చాలా భయమూ, వెగటూను !

కాని మనలో ఒక కాన్యూట్ (Canute) తనం ఉంది. అనగా అనగా కాన్యూట్ అనే ఒక రాజు ఉండేవాడు. అత నొకసారి సముద్రపు ఒడ్డునే నీటిని తగిలేటట్టుగా తన సింహాసనము వేయించుకుని, మంత్రి సామంతాదులతో కొలువు తీర్చి, పొంగి పోతూ ఎగి రెగిరి గుర్రపు దళాల్లాగ వస్తూ ఉన్న కెరటాలకేసి చూసి - మహారాజు కాదూ - చెయ్యెత్తి ఒకగీటు దాటి రావద్దని ఆ కెరటాలను శాసిస్తూ గర్జించాడు. మంత్రి సామంతాదులు అవు నన్నట్లు తల లూపి వంచుకున్నారు. కెరటాలు వినలేదు. సింహాసనమూ, రాజూ, పరివారమూ కొట్టుకుపోయారు.

మనం అందరమూ కొంత కాలం దాకా పందెపు గుర్రంలాంటి కెరటం లాగ ఉంటాం. తరవాత మంత్రి సామంతాదుల్లాగ మన్నో, మనసమో అయిపోతాం. అలాగ అయిపోతే అభ్యుదయం ఎలాగ? ఎప్పటి కప్పుడు యువకుడిగా ఉండవలసిన కవే అలా అయిపోతే ఎలా? ఎప్పటి కప్పుడు నవ్య సుందర లోకం నిర్మిస్తూ ఉండవలసిన కవే అలాగైపోతే ఎలా? ఆహా! అసలు ముసలితనం ఏ మాత్రమూ రానీయని అనంత తారుణ్యం కల్పించిన అద్భుత కావ్యాలు అనేక యుగాల అవధులు దాటి వచ్చి ఇంకా మనల్ని ఎలాగ పలకరిస్తున్నాయి, నడిపిస్తున్నాయి!. . .

నవ యుగోదయం అప్పుడే పొడిచినప్పుడు, ఆ రోజులలో కొత్తగా తలుపులు తెరచుకున్నప్పుడు, తెర్లి పొర్లి వచ్చే మానవ సమాజమూ, లోకమూ, ప్రకృతీ మనకు ఎదురయాయి. మనమూ వాటిలో కలిసిపోయాం. తీవ్ర మైన అనుభవాలు కొన్ని వచ్చాయి. మన దృష్టులు మెరిసేయి. మన మనస్సులు ఎగిరేయి. మన గొంతు ముళ్లు విడ్డాయి. మనం ఏవేవో కావ్యాలు ఆలపించాం. కథలు చెప్పేం. నాటికలు వినిపించేం. వాటిలో జీవం ఉంది.

వాస్తవి కానుభూతి పునాదిగా సుందర నిర్మాణాలు కల్పించాం. అలాంటివి ఎప్పుడూ ఉండేవే! అలాంటి కావ్యాలూ ఎప్పుడూ ఉండేవే!

కాని ఒక చిక్కు వచ్చింది. ఆ అనుభవాన్నే తరవాత తరవాత గట్టిగా కౌగిలించుకుని కూర్చుంటే అది మన చేతిలో నలిగి ఊపిరాడక సొమ్మసిల్లి చచ్చిపోతుంది. దానిచుట్టూ, మనచుట్టూ నాలుగు గోడలూ, పైకప్పూ కట్టుకుని, మనం దాన్ని గూర్చే తిరగేసి, మరగేసి చెబుదా మంటే ఇబ్బంది వస్తుంది. అటువంటి అనుభవాలు ఉన్నంతకాలం ఆ కావ్యాలు అవసరమే. జీవించి ఉన్న మానవ సంఘంలో అటువంటివి ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి కూడా. కాని, వాటిలో కొత్త మెరుపులూ, కొత్త నడకలూ, కొత్త పలుకుబడులూ రావడానికి కానీ, ఇంకా కొత్త కొత్త అనుభవాలు విధ విధాలవి రావడానికి కానీ నాడు జీవంతో, తారుణ్యంతో నిండిపోయిన ఏ మానవ సమాజమూ, లోకమూ మనల్ని పలుకరించాయో, వాటికి మళ్లీ మనం ఎదు రవాలి; వాటిలో మళ్లీ మనం పడాలి. అలా చెయ్యడంవల్ల మనం బ్రతికి ఉండడం, యువకులుగా ఉండడం, సాహిత్య జగత్తును సమాజం అంత విశాలంగా చెయ్యడం తటస్థిస్తుంది. ఏమో, మన తరవాత అంత విశాలమైన జగత్తు సృష్టించి, కల్యాణం తీసుకు వచ్చే ఒక మహా కవికి దారి పరుస్తున్నామేమో!....

మతానికీ జీవితానికీ ఎంత సంబంధం ఉందో, కళకీ జీవితానికీ అంత సంబంధమే ఉంది. అంత ప్రస్తుతం కానట్టు కనబడినా ఇక్కడ నా దో అనుభవాన్ని గూర్చి చెప్తాను - ఆంధ్ర బ్రాహ్మ సమాజంతో. ముప్ఫై నలభై ఏళ్ళ క్రితం ఆ ఉద్యమం కొత్తగా మన తెలుగు నాటిలో చొరబడినపుడు ఉత్సాహవంతు లైన కొందరు యువకులు దానిలో పడ్డారు. ఆ కొత్త మతావేశంతో

సంఘంలోకి కలయ చూస్తే వారికి కొన్ని గొప్ప చెడుగు లేవో కన బడ్డాయి. అప్పుడు విధవా వివాహ మన్నారు ; జాతి భేద నిర్మూలన మన్నారు ; మరేవో అన్నారు. సంఘం బాధపెట్టింది. ఆ కారణం వల్లనున్నూ, ఒక విధమైన మతాహంకారం చేత చుట్టూ ఉన్న మానవులకన్నా తాము గొప్ప వాళ్ళం అనుకోవడం చేతనున్నూ నెమ్మదిగా చుట్టూ బడాయిగా గోడలు కట్టుకుని కూర్చున్నారు. ఇంతలో మానవ సంఘం - గొప్ప జీవనది కాదూ - ప్రవహించుకుని పోతూ ఉంది. నవ్య మత సంస్కర్తలు నలభై ఏళ్ళక్రితం దగ్గిర ఉండి పోయారు. గడ్డాలూ, మీసాలూ నెరిసి హేమంతం లాగ గడ్డ కట్టుకుపోయారు. కాల పరిస్థితుల్ని బట్టి వారన్న సంస్కరణాల కన్నా పదిరెట్లు ఎక్కువ సంస్కరణాలు కావిస్తూ సంఘం మాత్రం అంతా ముందు ముందుకు సాగుతూనే ఉంది.

అలాగే సాహిత్య రంగంలో కృషి చేసే వాళ్ళ విషయంలో కూడా....

ఇక - గోడ స్వార్థానికి కూడా కారణ మవుతుంది. కాని సుఖ దుఃఖాలతో, పతనాభ్యుదయాలతో చలించిపోయే ఈ మానవ లోకంలో పడితే ఒక గొప్ప కరుణ మనలో పుడుతుంది. . . ఈ కరుణ ఈ అసమగ్ర మయిన లోకంమీద. ఇంతకంటె చక్కని లోకం నిర్మించేటట్లు చేస్తుంది. కవి అదే చెయ్యాలి కాదూ!

కనుక వాస్తవిక జగత్తుతో మన కెప్పుడూ సంబంధం ఉండాలి. ఎంత సంబంధం ఉంటే అంత మంచిది. కవిత్వానికి కూడా పక్షికి లాగే ఆకాశమూ అవసరమే ; గూడూ అవసరమే ! మన దేశంలో కొంతమంది ఈ గూడు లేకుండానే కేవలం రెక్కలమీదనే ఆధార పడి అవధిలేని ఆకాశంలో ఎగరడానికి ప్రారంభించారు. తుపానులు వచ్చి పడ్డాయి. ఇంక మిగిలింది - గాలిలో తేలిపోయి తేలిపోయి

పడిపోవడంగాని, గూటిలోనే కూచుంటే కుళ్ళిపోయి కుళ్ళిపోయి కొయ్య అయి పోవడంగాని....

నిజానికి, ఒకకావ్యంలో వాస్తవికత (realism) వల్ల వచ్చే అప్తతా, చైతన్యమూ, కాల్పనికత (romanticism) లో ఉండే ఆవేశమూ, భావనా, సాంస్కృతికత (classicism) లో ఉండే సమగ్ర సౌంద ర్యమూ, సందేశమూ ఉండాలి.

ఇంతకూ నే చెప్పేదేమంటే - సాహిత్య రంగంలో కృషి చేసే వాళ్ళకి చుట్టూ ఉన్న మానవ జీవితంతో ఎంత సంబంధం ఉంటే అంత మంచి దనిన్నీ, అలా ఉంటే కావ్యానికి వస్తువుగా అనుభవ మున్నూ, కల్పనకు పురికొల్పే కరుణయున్నూ, సృష్టింప చేసే చైతన్యమున్నూ లభిస్తా యనిన్నీ....

ఇక - ద్వేషంతో, రోషంతో, మోసంతో, నాశంతో, అశాంతితో, అంధకారంతో యావత్తు ప్రపంచమూ, మన దేశమూ భయం కరంగా ఉన్నాయి. "గాత్రం భయంచేత విహ్వాల మవుతున్నది; ముఖం ఎండిపోతూంది; శరీరం వణుకుతూంది; గగుర్పొడు స్తూంది" అని నరలోకం అంతా అంటూంది. ఎంతో ఆశాబలమూ, దృష్టీ ఉంటేనే గాని అంతా అయోమయంగానూ, అసత్యంగానూ ఉన్నట్టుంది. ద్రష్ట, విశ్వాసి అయిన కవీ ఊరుకుంటే ఎలాగ? నవ్య సాహిత్య పరిషత్తే ఊరుకుంటే ఎలాగ?

ఆకాశము నొసట పొడుచు అరుణారుణతార!
ఏకాకి నిశీథి నొడుచు తరుణ కాంతిధార!
జయపతాక! యువ పతాక!
వియ దాపగ వెడలు నౌక!

యుగయుగాల పీడకలలు సొగయ చేయు సంకెలలు
తెగనివి కావోయి, మ్రోల ధగధగా స్వతంత్ర విభా
తాకాశము నొసట. . . .
అంతు లేని ద్వేషము, విష రోషము, స్వార్థము, మోసము
పంతగించి నిలువవు ఆవంతయేని, శాంత విభా
తాకాశము నొసట. . . .
ముందు గలదు మన జాతికి ముక్తి, అమర జీవ రక్తి,
క్రిందు వెనుక గవక నడువు డందరు, అభ్యుదయ విభా
తాకాశము నొసట. . . .

'దీపిక' 18-1-1943 సంచిక నుంచి.

# అభ్యుదయ రచనోద్యమం

(రాజమండ్రీలో జరిగిన ఆంధ్ర అభ్యుదయ రచయితల తృతీయ మహాసభ - 1946 - అధ్యక్షోపన్యాసం నుంచి)

అభ్యుదయ రచయితల సంఘంలో అందరూ ఉండవచ్చు. ఏ రాజకీయాభిప్రాయాల ప్రభావం పొందినవా రయినా ఉండవచ్చు. సమస్త మానవ కోటి ఒకానొక నూతన లక్ష్యం వైపు నడుస్తున్నది. పాత ప్రపంచం శిథిలమయి ఆ స్థానంలో మరో కొత్త ప్రపంచం ఉద్భవిస్తున్నది. ఈ విషయం దృష్టిలో పెట్టుకొని చైతన్యంతో, ప్రసన్న బుద్ధితో ఎవరు దేన్ని గురించి ఏది వ్రాసినా అభ్యుదయ రచనే అవుతుంది. ఏ విషయాన్ని గాని ముందుగా కొన్ని అపోహలు పెట్టుకొని ఆలోచించడం మంచిది కాదు.

పూర్వం మానవులు సముద్రంలో లంకల్లాగా విడివిడిగా ఉండే వారని, నేడు అన్యోన్యం పెనవేసుకొని పోతున్నారని, ఒకరి కష్ట సుఖాలను మరొకరివిగా భావించి పని చేస్తున్నారని- ఈ విశ్వజనీన భావంపై వున్న వాడు అభ్యుదయ రచయిత!

పీడింప బడేవాళ్ళు, పీడించే వాళ్లుగా ఉన్న ఈ వర్గ సమాజం ఉండా లని ఎవరూ కోరరు. రానున్న విధానంలో సాధా



97

రణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతి ఘటింప జూచేవారు ఎప్పుడూ అభ్యుదయవాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవా లనుకోవడమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకొని వ్రాసేది అభ్యుదయ రచన.

ఆకలి దప్పులకు, అనేక బాధలకు గురి అయిన కోటాను కోట్ల మంది పీడిత ప్రజలు, శ్రమజీవులు నా కండ్ల యెదుట కనిపిస్తుం డగా, నేను వారికి ప్రతికూలంగా ఎలా వ్రాయగల్గుతాను? వారి కష్టమే నా కష్టంగాను, వారి సమస్యే నా సమస్యగాను తీసుకుని తీరుతాను. నేను ప్రజల్లో లీన మై పోగలిగి నప్పుడు వారి భాషలోనే వారి సమస్యలనే చిత్రిస్తాను.

క్రిందటి మహాయుద్ధ మైన తరువాత ప్రజల స్వాతంత్ర్య కాంక్ష వమ్మై, సామ్రాజ్య వాదపు ఇనుప పిడికిలి బలమై కవుల్లో నిస్పృహ వ్యాపించి, ఒకానొక విధమయిన అరాచక కవిత్వం చెలరేగింది. కాని ఈ యుద్ధంలో అలా కాక, ప్రజల, రచయితల ఉత్సాహం, కార్యభారత ద్విగుణీకృత మయాయి. ఎందుకంటే ఈ యుద్ధ స్వభావాన్నీ, దీని ఫలితాలనూ ముందుగా గుర్తించే ఆ యా దేశాల ప్రజలు ఈ యుద్ధంలో పాల్గొన్నారు. నేడు లోకంలోని అశేష ప్రజాసామాన్యం కోసం ప్రతి ఒకడూ పోరాడుతున్నా డన్నమాట!

ప్రజాసాహిత్య మంటే - ఏల పాటలు, స్త్రీల పాటలు, బుర్ర కథలు ఉన్నాయి కదా అన్నా రొక పండితులు. ప్రజాసాహిత్య మంటే అదే నని నే ననుకోను. జంగం పాటల్లో పనికిరానిదీ, ఏల పాటల్లో ఉత్తమ మైనదీ ఉండవచ్చు. రచయిత దృక్పథాన్ని బట్టి ఈ నిర్ణయం ఉంటుంది. మంచి ఏలపాట గాని, బుర్రకథ గాని, స్త్రీల పాట గాని ఉంటే దాన్ని ఒక మంచి కావ్యం ముందు పెట్టడానికి నా కభ్యంతరం లేదు. నేను ఇరవై ఏండ్ల క్రితం వ్రాసినట్లుగానే

నేడు వ్రాయలేను. నేను పెరిగానో, మారానో, మరి ఏ మైనానో - ఇప్పు డలాంటిది వ్రాయలేను! ఇప్పుడు ఎలాంటిది వ్రాయగలనో కూడా తేలలేదు. ఇంకా మార్పు రావాలి. నేను అభ్యుదయం వైపునకు వచ్చి తీరా లనుకుంటున్నాను.

కొంతమంది పెద్దలు ఈ ఉద్యమాన్ని ఎంత ప్రతిఘటిస్తూన్నా, ఇది అభివృద్ధి చెందుతూనే ఉంది. ఎందు కీ ప్రతిఘటన? మాను కోండి. ఇది కలి ప్రభావ మనైనా సంతృప్తి పడి ఈ ఉద్యమాన్ని కొనసాగ నియ్యండి.

(తరువాత రవీంద్రుని భావాలను, రచనలను కొన్నిటిని వివరించి శాస్త్రిగారు అన్న మాటలు)

రవీంద్రుడు పురోగామి కనుకనే ఉపనిషత్తుల నుంచి ప్రారంభించినా ఎంతో ముందుకు ప్రయాణం చేయగలిగాడు. కాని ఎన్నడూ ఏ ప్రయాణం చెయ్యకుండా ఉన్న చోటనే ఉండి, ఏదో ఊహా మాత్ర మయిన పూర్వకాలాన ఉన్నా మనుకునే వారు ఎక్కడికీ పోరు. మనం వ్రాత లన్నిటినీ జీర్ణించుకుని కొత్త లోకంలో అడుగుపెడదాం!

(ముగింపు ప్రసంగం)

సదస్యులు ఈ రెండుమూడు రోజుల ప్రసంగాలూ, రచనలూ విన్నారు. నిష్కల్మ షావే శాభిమానాలతో ఇందులో పాల్గొన్నారు. 18, 19, 20 శతాబ్దాల వా రుండడం తటస్థించింది. సాహిత్యంలో కూడా ఈ మూడు రకా లున్నవి. అభ్యుదయం శ్రీ శ్రీ లో 80 వంతులు ఉంది. ఆయన ప్రజా కవి.

ఈ సభ చాలా గొప్ప స్థాయిలో జరిగింది. బుర్ర కథలు వచ్చి తీరాలి. అది సాహిత్య మవుతుందా కాదా అనేది వేరే

సంగతి. 1931 లో ఉప్పుపాట దేశాన్ని కదిలించింది. మన దేశ చైతన్యం పల్లె పదాలలో జీవం పోసుకుంది. అవి వ్రాసిన వారే వాటిని వ్రాయదగినవారు. రక్తంతో, చెమటతో తడిసినవారే వాటిని వ్రాయాలి. మేడల మీద కూర్చున్న మేం వ్రాయ లేము.

వీరేశలింగంగారు ద్రష్ట. ఆయనది ప్రజా ఉద్యమం. ఆయనే ప్రజ! ఆయన వ్యతిరేకులు ఏ పది మందో!

తరువాత రష్యన్ రచయితల్ని చెప్పాలి. రష్యాలో విప్లవం జరిగింది. ఇప్పటి యుద్ధానంతరం వారు ఉన్నత సాహిత్యానికి కృషి చేస్తున్నారు. రష్యా విప్లవం తరువాత ఏర్పడ్డ సంఘం ఉదాత్తమైనది. అదే అభ్యుదయానికి దారులు తీసింది.

గత యుద్ధంలో లెనిన్‌గ్రాడులో 90 శాతం యుద్ధానికి రిక్రూట్ అయారు. అన్ని సాహిత్య సంఘాలూ సమష్టిగా పని చెయ్యాలి. ప్రజా సాహిత్య మంటే, ఇంతేకాక, సన్నిహిత సంబంధం ఏర్పరచు కొని, వారిని గూర్చి, వారికి - సాహిత్యాన్ని సృష్టించా లనే మీరు కోరుతున్నారు. కాని బుర్రకథలే వ్రాయా లని మీరు కోరడం లేదు.

భాష వ్యావహారికంగా ఉండాలి. అందులో జీవం ఉంది. అక్షర రమ్యత, నుడికారం అనేవి ఇందులోనే ఉంటాయి. అభ్యుదయ రచయితల ఉద్యమం ప్రజలకు సన్నిహితమైన భాష కావా లంటుంది. బ్రహ్మసమాజ మతం ప్రజల్లో ఒక విధమైన ఐక్యం, సంస్కారం తెచ్చింది ఒకప్పుడు. ఇప్పుడు జాతి అంతా ఒక లోతు లోయలో ఉంది. దీన్ని హిమాలయ శిఖరం చేర్చే సాహిత్యం కావాలి. వీరేశలింగం, గురజాడలు అన్ని రకాల సాహిత్య రూపాలనూ తీసుకొని, ఉత్త మాదర్శ రూపాలను సృష్టించారు. కన్యాశుల్కం భారతం లాంటిది.

ఈ దేశంలో ప్రచారక వాఙ్మయం చాలా అవసరం. దీనికోసం అందరూ ప్రయత్నించాలి. ఇది వ్యావహారికభాషలోనే సాధ్యమవుతుంది. అభ్యుదయ రచయితల సంఘం ఈ నియమం తప్పక పాటించాలి. ఇది కథలకూ, నాటకాలకూ తగిన యుగం. జాతి గడసరి చెంది, సమాజదృష్టి ఏర్పడి అభివృద్ధి చెందుతుంది. కవి కార్యవాది కూడా కావాలి. నిజమైన సానుభూతి సన్నిహిత సంబంధం వల్లనే కలుగుతుంది. నన్ను మొదలుకొని ఇప్పు డున్న వా రందరికీ కూడా ఆ కవి హృదయం, కరుణా పద్ధతీ ఏర్పడుతున్నట్లు కనిపిస్తుంది. అభ్యుదయ రచయితల సంఘం ద్వారా ముందుకు పోదాం.

ఆంధ్ర సాహిత్య చరిత్ర, భాషాతత్త్వశాస్త్రం నన్నయ మొదలుకొని నేటివరకూ చారిత్రక పరిణామ దృక్పథంతో వ్రాయించి అందరికీ అందజెయ్యాలి. ఇక్కడ ఒక విధమైన సహధర్మాల్ని చూసే మని మనస్సులో ఉంచుకోండి.

— 'తెలుగు తల్లి', 1946 మార్చి

# ప్రథమ యుద్ధానంతర ప్రపంచ సాహిత్యం

యుద్ధానంతరం సాహిత్యపు ధోరణీ, దృష్టీ ఎలా గుంటాయో అని ఊహించుకుని ఏదో విధంగా తేల్చుకోవచ్చు. ఏ దయినా ఊహించడమే అవుతుంది. కాని నిశ్చయం అని నిర్ణయించడం మాత్రం కాదు. కొన్ని విశాల మైనవీ, తప్పనివీ, స్థిర సత్యా లైనవీ ఉద్యమా లున్నాయి. ఇవి వచ్చే సాహిత్యాకారం కట్టడంలో కొంత పనిచేస్తాయి. ఇటు వైపు తిరిగీ, అటు వైపు ఒరిగీ, చివరికి మధ్యకి చేరుకునే త్రాసు ముల్లు లాగే సాహిత్యమున్నూ.

వెనుకటి యుద్ధమూ, దాని తర్వాత జరిగిన వ్యర్థ సంధీ, సామాన్యంగా ప్రపంచ సాహిత్యం మీద ఒక చిత్రమైన ప్రభావం చూపించాయి. యువకుల్లోనూ, రచయితల్లోనూ బలమైన నిరాశ, అవిశ్వాసం కలిగించాయి. ఈ మనఃస్థితిని నాస్తికత - "ఏదీ లే దనే గుణం" - అని అందాం. దీనికి నిశ్చయాలూ, నమ్మకాలూ లేవు. పాతవిలువల నన్నింటినీ "ఔనా ? కాదా ?" అని ప్రశ్నిస్తుంది, పరిహాసం చేస్తుంది, తోసి పారేస్తుంది. ఒకవిధ మైన నిరసనభావంతో

కలిసిన నిరాశ ఈ పాతిక సంవత్సరాల సాహిత్యంలోనూ ఎక్కువగా కనపడుతుంది. "ఇది ఉంది, ఇది మంచిది, ఇది నమ్మండి," అని చెప్పడం ఎక్కడా లేదు. ఈ సాహిత్యంలో ఒక విధ మైన జీవచైతన్యాలు లేక పోలేదు. కాని ఈ జీవచైతన్యాలతో జీవితం అంటే నిజమైన అనురాగం, ఆకర్షణా మాత్రం లేవు అందులో. చుట్టూ ఉన్న జీవితం మీద పడి దానిని కొట్టడమే. "చెడ్డతో మంచి కూడా కలి సుంటుంది జీవితంలో" అని చూడ్డానికి ఈ సాహిత్యాని కిష్టం లేదు.

విల్సన్ అనే గ్రంథకర్త షేక్స్పియర్ తన చివర రోజుల్లో వ్రాసిన "మెష్‌జర్ ఫర్ మెష్‌జర్" (Measure for Measure) వంటి హేళన కావ్యాలకిన్నీ, 1920 ప్రాంతాల్లో హక్స్‌లీ లాంటి వాళ్లు వ్రాసిన "పోయింట్ కౌంటర్ పోయింట్" వంటి గ్రంథాలకిన్నీ చాలా సామ్య ముందంటాడు. తెరలన్నీ చింపి పారేసేద్దా మనే తీవ్ర మైన తిక్క పట్టుదల, నిజాన్ని అతి నగ్నంగానూ, బీభత్సంగానూ బైట పెట్టడం, అలసట, అసహ్యాభావం, నిరసన, ఆత్మహింస, ఆవేశ మన్నా, అనురాగ మన్నా కిట్టకపోవడం - ఇవి 1613 ప్రాంతాల షేక్స్పియర్ రచనల్లో లక్షణా లనిన్నీ, అవే పూర్వ యుద్ధానంతర సాహిత్యంలోనూ చెలరేగా యనీ అంటాడు.

యుద్ధమూ ముగిసింది. ప్రపంచ మంతా కలిసి ఒక సంధి చేసుకుంది. ఈ సంధి తరువాత కూడా లోకపరిస్థితులు వెనుకటి నాటకమే ఆడితే, సాహిత్యం కూడా వెనుకటి ధోరణే పట్టదా అని సందేహ ముండొచ్చు. పట్ట దని నమ్మకంగా చెప్పడానికి ఎక్కువ ఆధారాలు కన పడుతున్నాయి. వెనుకటి యుద్ధరంగంలో అడుగు పెట్టిన యువకులు ఉదాత్తావేశమూ, గొప్ప లక్ష్యమూ మనస్సులో పెట్టుకుని, తుపాకి పట్టుకున్నారు. యుద్ధానంతరం ఆ లక్ష్యానికీ, యథార్థానికీ వ్యత్యాసం చూసి కుంగిపోయారు, చితికి పోయారు.

ఈ యుద్ధంలో దూకినయువకునికి స్పష్టదృష్టి ఉంది. అనుమానిస్తూ, సందేహిస్తూనే దూకాడు. ఇతనికి తెలుసు, అసహ్యామైన పని తాను చేస్తున్న దని. ఇతడు పెరగడమే ఒక అవిశ్వాస వాతావరణంలో పెరిగాడు. పుట్టడం అవిశ్వాసంతో పుట్టాడు. వీళ్ల విలువల్ని కొలిచే ప్రమాణాలు వేరు. "ఈ ఉన్న పరిస్థితులూ, పరిసరాలూ బాగా లేవు. ఇంతకంటె మంచివీ, నిజమైనవీ, విశాల మైనవీ రావాలి! అవి రప్పించడానికే ప్రయత్నిద్దాం," అని రంగంలో దిగినవాడికి అనుకున్న ఫలితం రాకపోతే అంత దిగు లుండదు.

మానవ స్వచ్ఛందతకీ, స్వతంత్రతకీ జీవం అన్యోన్య సహకారమూ, సోదర భావమున్నూ. వీటిని నిలబెట్టాలి. నిజంగా నాగరకత ఉన్నవాడి గుణా లివి. ఇవి లేకపోతేనే యుద్ధాలూ, దురాశలూ, హింసలూను. ఈ గుణాలు మానవుని కంటె గొప్పవీ, విశాల మైనవిన్నీ. వీటిలో విశ్వాసం అవసర మని ఇప్పటి వాళ్ళు గ్రహించు కుంటున్నారు. ఈ ఒకటి రెండు సంవత్సరాలలో అమెరికాలో అన్నిటి కంటె ఎక్కువగా అమ్మక మైన నవలలు మూ డట. మూడింటిల్లో ఉదాత్త విశ్వాసం ప్రతిఫలిస్తుంది. ఒకటి ఆంగ్లేయుడూ, ఒకటి అమెరికా దేశీయుడూ, ఒకటి ఆస్ట్రియా వాసీ వ్రాసేరు. కళా దృష్టితో చూస్తే వీటి విలువ ఎలా ఉన్నా ఇవి ప్రజాదరణ పొందాయి. వీటిలో విశ్వాసం కోసం తృష్ణా, ఆస్తికత, పోగొట్టు కున్నవీ, అమూల్యమైనవీ తిరిగి పొందాలనే కాంక్షా కనబడతాయి. మానవుడు నిరాశమీద బతక లేడు. నిరాశ సాహిత్యానికీ వెలు గివ్వ లేదు.

దీనిని బట్టి మత విషయిక మైన ఆవేశము, మహెూద్యమమూ మళ్లీ బయలుదేరుతా యని కాదు. కాని, ఆస్తికత మాత్రం మళ్లీ పెంపొందుతుంది. త్రాసు ముల్లు ఇటు తిరిగిం దన్నమాట. 1920

ప్రాంతాల్లో, నిరాశా, నాస్తికతలతో కుంగిపోయే సాహిత్యాన్ని నిర్మించిన వారిలో ఒక డైన హెమింగ్‌వే అనే అతను ఈ మధ్య "ఫర్ హూమ్ ది బెల్ టోల్స్" అనే గ్రంథం వ్రాసేడు. ఆ గ్రంథంలో తత్త్వ సార మిది: "ఏ మానవుడి కా మానవుడు ద్వీపం లాంటివాడు కాడు - చుట్టూ సముద్రాలూ, మధ్య తానూ ఇతరులతో సంబంధం లేకుండా. ఒక మహాఖండంలో ప్రతి మానవుడూ ఒక చిన్న ఖండం, ఒక మహా సముద్రంలో ఒక చిన్న తరంగం. ఏ మానవుడు మృతి చెందిపోయినా ఆ మృతి నా నుండి కూడా కొంత పోగొడుతుంది, కొంత తగ్గిస్తుంది. ఎంచేత అంటే, నేను అశేష మానవ లోకంతో పెనవేసుకు పోయాను. దానిలో కలిసి పోయాను. అంచేత ఎవరికోసమో అంత్యాహ్వానం వచ్చిం దనుకోకు. ఎవరికోసం వచ్చినా నీ కోసమే వచ్చింది." ఇది ఆ గ్రంథం చెప్పే సందేశం. ఇతడు వెనుక వ్రాసిన గ్రంథంలో వచ్చే ఒక పాత్రకి త్యాగమూ, పవిత్రతా, ఘనతా అనే శబ్దా లంటేనే భయం. పేల్చడానికి సిద్ధంగా ఉన్న వంతెన మీద నిలబడ్డ ఒక యువకుడు ఈ గ్రంథంలో ఇలా అంటాడు: "నేను నమ్మిన దాని కోస మని సంవత్సరం నుంచి పోరాడుతున్నాను. ఇక్కడ గెలిస్తే మన మెక్కడైనా గెలుస్తాము. ఈ లోకం చాలా సుందర మైనదీ, సుఖ మైనదిన్నీ. దీన్ని నిలబెట్టడానికీ, దీనిలో ఉండిపోవడానికీ ఎటువంటి యుద్ధ మైనా చేయవచ్చు. దీన్ని వదలి వెళ్లిపోవడ మంటే నాకు చాలా బాధగా ఉంటుంది."

హక్స్‌లీలో కూడా ఈ మార్పు కనపడుతుంది. ఇతడు ఈ మధ్య వ్రాసిన గ్రంథంలో ఒక నాయకు డుంటాడు. అతను అవిశ్వాసిగా, నిరసన చేసేవాడుగా, నాస్తికుడుగా పెరుగుతాడు. ఒకసారి హఠాత్తుగా ఒక వయోవృద్ధుణ్ణి కలుసుకుంటాడు. అతని ద్వారా దృష్టి స్పష్ట మౌతుంది. వ్యక్తిగత మైన సామాన్య విషయాలలోనూ,

సంబంధాలలోనూ ఒక లక్ష్యావేశం ఉంటేనే గాని, జాతులకీ, ప్రభుత్వాలకీ సహకార లక్ష్యావేశం ఉండడానికి వీలు లే దని గ్రహిస్తాడు. మానవ శాంతి, ప్రపంచ శాంతి అన్నవి ప్రతి వ్యక్తి ప్రేమ కరుణలు ప్రసరించడానికి ప్రయత్నిస్తేనే గాని సాధ్యం కా వని గ్రహిస్తాడు. కనుక ఒక విధ మైన ఆస్తికత దగ్గిరకీ, విశ్వాసం దగ్గిరకీ చేరాడు. అవి లేకపోతే జీవితాన్ని ఒక ఉద్దేశంతో, ఒక ప్రయోజనంతో ఒక గమ్యస్థానం దగ్గిరకి నడిపించడం ఎలాగ ?

దీనిని బట్టి, అనగా నేటి కావ్య సృష్టిలో ఆస్తికత, విశ్వాసం బలపడ్డం బట్టి వాస్తవికతకి ఇప్పటి సాహిత్యం దూర మవుతుం దని అనడానికి వీలులేదు. జీవితాన్ని ఉన్నది ఉన్నట్లే చెప్పడం కాక, ఎల్లా ఉండాలో కూడా చెప్పడం జరుగుతూంది. ఇలాగే నేటి పాశ్చాత్య సాహితీ పరులలో కొత్త దనం కనపడుతూంది.

అమెరికా వంటి దేశాల్లో ఈ మార్పును తీసుకొచ్చిన కారణాలు మరి రెం డున్నా యంటున్నారు. కొన్ని దేశాలనుంచి యుద్ధపరిస్థితుల వల్ల స్వదేశం వదలి అక్కడికి వచ్చి స్థిరపడిన గ్రంథకర్తల ప్రభావం మొదటిది. రెండవది - ప్రపంచకంలో మూల మూలలకీ వెళ్లి అనేక దేశాలవారితో సాహచర్యం చేసి, లోకంలో మానవు లందరి మీద, స్వదేశం మీద, స్వగృహం మీద అపరిమి తాను రాగాలతో తిరిగి వచ్చిన యోధుల ప్రభావం.

జీవితచరిత్రలు వ్రాయడంలోనూ పాశ్చాత్య సాహిత్యంలో ఈ మార్పు కనపడుతుంది. ఆ మధ్య వ్రాసిన జీవితగాథలలో, గొప్పవాళ్లని బాగా తగ్గించే ధోరణి కనబడుతుంది. ఈ మధ్య వచ్చిన వాటిలో వాళ్లని జాగ్రత్తగా చూచి, తూచి, సరి యైన విలువ కట్టి ప్రదర్శించడం జరుగుతూంది.

ఇదివరకు రచయితలలో అభిమానాల (సెంటిమెంట్స్) మీద కూడా వెగటే. కృత్రిమాభిమానాల మీదే కాదు. వంచన, డంబం, అసత్య గౌరవభావం, మోసం మీద ఉండే వెగటువల్ల ఇదివరకు అన్నివిధాల అభిమానాలనీ ప్రతిఘటించడం సాహిత్యపరులలో ఉండేది. ఇప్పుడు అకృత్రిమంగా వెలివరిచే అభిమా నావేశాలను గౌరవించడం పాశ్చాత్య రచయితల్లో మొదలు కావడం స్ఫురిస్తుంది.

పూర్వ యుద్ధానంతరం లోకసమస్యలు అస్పష్టమూ, అగమ్య గోచరమూ అయి కనిపించడం వల్ల, కలతపడి, కంగారుపడి రచయిత తన మనస్సులోకి తాను ముడుచుకుపోయి వ్యక్తిగత మైన ఒక రహస్య ప్రపంచాన్ని సృష్టించుకున్నాడు. దానిని చిత్రించే టప్పుడు అతని శబ్దాలంకారాలూ, భావాలూ పూర్తిగా అతనికి చెందేవే కనుక చదివేవాడికి దుర్గ్రాహ్యంగా ఉండడమూ ఉండేది. ఈ నిగూఢ వ్యక్తిత్వం అలజడులతో ఈ లోకాన్ని చూడ్డంవల్ల, దానిలో తన్ను తోసుకోడం వల్ల వచ్చింది. నాస్తికతవల్ల కూడా బయలుదేరింది. ఇప్పటి రచయితకు కొత్త విశ్వాసం, స్పష్ట లక్ష్యమూ, ఇతర మానవులకూ తనకూ ఉన్న సంబంధంలో అభి మానం, లోకం అంటే అనురాగమూ కలుగుతూ ఉండడంవల్ల ఈ అస్పష్టతకూడా పోయి తీరుతుం దనిపిస్తుంది.

ఇంకో విశేషం - రచయితకు చదివేవా డంటే ఉండే బాధ్యత. తాను సమాజజీవి, సమాజం యెడ తాను నిర్వర్తింప వలసిన విధు లున్నాయి అని గుర్తిస్తున్నా డిప్పటివాడు. విక్టర్ హ్యూగో చెప్పినట్లు, ఒకరినుండి ఒకరికి ప్రవహించే రసప్రవాహం ఒక టుం దని; కలిసి అనుభవించడం, కలిసి గ్రహించడం, కలిసి బాధ పడ్డం, కలిసి కోరుకోవడం, ఇ వన్నీ ఇద్దరికీ ఉన్నా యని ముందు వచ్చే రచయిత గ్రహించి తీరతాడు. సాధారణంగా సాహిత్యంలో కూడా కొత్తమార్పులు తీసుకొచ్చే వాళ్లు మరింత చైతన్యమూ,

ప్రతిభా, సహనమూ ఉన్నవాళ్లయి ఉంటారు. కాని సామాన్య జనం తన కర్థమయే మామూలు మాటలనే, తక్కువరకం వాళ్లన్నవే వింటుంది. తొక్కిన త్రోవను వెళ్లడం తేలిక. ఇంతకాలం నుంచీ సాహిత్యం చుట్టూ మొలిచిన మొక్కా, తుక్కూ కత్తిరించి పారేసి, దానికీ నవసమాజ విధానానికీ ఉన్న సంబంధం గ్రహించి, సాహిత్య కర్షకులు ఇంక ప్రయోగాలు చేయాలి. అలాగ చేయడం ప్రారంభించినట్లూ తోస్తుంది. సాహిత్యం అధిక సంఖ్యాకులైన చదువరుల దగ్గరకు వెళ్లాలి ముందు. అనగా సాహిత్యపరులలో అధిక సంఖ్యాకుల అభిలాషలూ, ఆశయాలూ, విశ్వాసాలూ తమకు సన్నిహితంగా చేసుకోవాలి. అప్పుడొక జీవస్రవంతి బయలు దేరుతుంది. అప్పుడు సాహిత్యం ఒక మహాయుగ ప్రాంగణంలో కాలిడుతుంది. ఈ మధ్య సాహిత్యం కెరటం లోతు లోయలో పడిపోయింది. క్షితిజరేఖ కనపడలేదు. మళ్లీ తరంగ శిఖరం మీద కెక్కాలి. అప్పుడు విశాలంగా భూమ్యాకాశాలు కలిసేచోటు ప్రత్యక్ష మవుతుంది.

వెనుకటి యుద్ధం ముగిసిన తత్క్షణమే, అనగా విప్లవానంతరం రష్యాలో ఒక నూత్న విధానం కట్టుకోవలసిన తొందర, అవసరం ఏర్పడ్డాయి. దానితో కూడా, పూర్వ విధానంలోనే కాకుండా, ఇతరదేశ విధానాల్లో కూడా తీవ్ర మైన అపనమ్మకం, అసహన భావం ఉండేవి. అప్పుడు సాహిత్యపరు లందరూ కూడా పనిముట్లూ, ప్రచారకులూ అయి, ఉత్తమ సాహిత్య నిర్మాణంకన్న అవసర వాఙ్మయ కల్పనలో తమ శక్తుల్ని వినియోగించారు. అందుకనే, ఈ ఇరవై అయిదేళ్లూ, తన విధానాన్ని సుస్థిరంగా చేసుకునే ప్రయత్నం చేశాక, ఈ యుద్ధ విజయానికి అపరిమితంగా తోడ్పడే వాఙ్మయాన్ని రష్యా తన రచయితలచేత నిర్మాణం చేయించింది. ఈ ఇరవై అయిదేళ్లూ కథలూ, నాటకాలూ, కావ్యాలూ, పాటలూ,

అన్ని కళలూ విజయసాధనకే రష్యాలో. కాని ఇప్పటికి ఆ అవసరం తీరినట్టూ, తమ విధానం సుస్థిర మైనట్టూ, ఒక మహా సంస్కృతి సుందర కళా పథాల్లో ప్రయాణం చేసి ఏర్పరచవలసి వచ్చినట్టూ రష్యా గ్రహించినట్లు తోస్తుంది. విశ్వాసమూ, విశాల సానుభూతీ. ఆస్తిక్యావేశమూ రష్యా విధానంలో ఉన్న గొప్ప లక్షణాలే అయెను. వీనికి తోడు, ఇప్పుడు ఒక స్తిమితము, శాంతీ కూడా అలవడే ఉత్తమ సాహిత్యం వస్తూంది. ఈ యుద్ధ సమయంలో "లెనిన్ గ్రాడ్ నుండి కథలు" అన్న పుస్తకంలో ఒక కథలో గ్రంథకర్త యుద్ధ రంగంలో ట్రెంచెస్‌లో పోరాడుతూనే ఎదురుగుండా తన ఇల్లాలిదో, ప్రియురాలిదో పటం పెట్టుకుని ఆవేశం పొందినట్లు వ్రాస్తాడు. దీనిని బట్టి ఇతర దేశాలతో సంఘర్షణ వల్ల తన జాతికి వచ్చే ముప్పు వైపు మనస్సు పోనీయక, స్వజాతి, స్వగృహము అన్న సంగతులపై కూడా అభిమానము రష్యా దేశస్థుడు ఉంచుతున్నా డని తేలుతుంది. ఇంతే కాకుండా రష్యాలో ఒక ఉదాత్త సంఘమూ ఏర్పడు తున్నట్లు కొందరు వ్రాస్తారు. రష్యా రచయితలు ఇతర సాహిత్యాలలోని పూర్వ మహా గ్రంథాలను అనువదించుకుంటున్నట్లూ తోస్తుంది. ఈ పాతికేండ్ల నుంచీ నిశిత వాస్తవిక దృష్టితో, ఉదాత్త లక్ష్యా వేశంతో ఒక మంగళ మానవ విధానాన్ని కట్టుకున్న రష్యాదేశం మళ్లీ ఉజ్జ్వల సంస్కృతీ, ఉన్నత సాహిత్యమూ కూడా నిర్మించుకో గల దనే సూచనలు స్పష్టంగా గోచరిస్తున్నాయి.

ఇది మాత్రం నిజం. భావి సాహిత్య నిర్మాతలకు విజ్ఞాన శాస్త్ర దృష్టి, విశ్వాసము, ప్రత్యేక వ్యక్తి వికాసము, విశాల మానవ భావము, అతి స్పష్ట వాస్తవికత, ఆస్తికత, స్పష్టత, సౌందర్యము సమరసంగా సాక్షాత్కరించగల వనే చిహ్నాలు అప్పుడే ఎదురు పడుతున్నాయి. ముఖ్యంగా రష్యాలోనూ, మన భారతదేశంలోనూ

కూడా చదువరులు ఎక్కువౌతున్నారు. విపణుల్లో గ్రంథ విక్రయ శాలలు కనపడుతున్నాయి. పాశ్చాత్య ప్రభావం జనంమీద ప్రసరిస్తూంది. రచయిత ముందు చదువరి త్రోసుకు వచ్చి నిలబడుతున్నాడు. ఇక్కడ సాహిత్య సీమలో కూడా నూతన యుగం స్పష్టతరంగా ప్రారంభించింది.

— రేడియో ద్వారా ప్రసారితం : 1942 – 43

## అనుబంధం :

## ఉదాహృత పద్యాదులకు ఆకరాలు

| పుట | ఉదాహృత పద్యాదులు | కృతి | వివరం |
|---|---|---|---|
| 1 | శబ్దార్థౌ కావ్యం | భామహాలంకారం | — |
| ,, | రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం .. | రసగంగాధరం | — |
| 4 | పగ యడగించు టెంతయు శుభంబు | భారతం-ఉద్యోగ | 3 - 21 |
| ,, | భవ దాజ్ఞా దృఢబంధ | భారతం - విరాట | 1 - 56 |
| 5 | గాండివ జ్యా నినాదమ్ము.. | భారతం - కర్ణ | 2 - 9 |
| 15 | దారి తల లెత్తు | కృష్ణ పక్షం* | పుట 127 |
| 16 | 'సుహృదం సర్వ భూతానామ్' | భగవద్గీత | 5 - 29 |
| 17 | ఏకో రసః కరుణ ఏవ | ఉత్తరరామ చరితం | — |
| 19 | అపి గ్రావా రోది త్యపి .. | ,, | — |
| 20 | ఆహారముగ శోక, మశ్రు పానీయమ్ము .. | మహతి | గీతం 54 |
| ,, | ఏడిచి ఎన్నినా ళ్లయిన దీ యెద .. | కృ. శా. బదరిక | లేడి |
| ,, | క్రౌంచ మిధు నానురాగ | రమ్యాలోకం | పుట 1 |
| 26 | గండా భోగములన్. . వ్రేగులు డించి | ఆముక్తమాల్యద | 6 - 7 |
| 28 | విద్యలకు నెల్ల ఉత్తమ విద్య . . | అప్పకవీయం | 1 - 53 |
| 35 | కవిత్వ దీక్షా విధి | భారతం - విరాట | 1 - 30 |
| ,, | పలికించెడివాడు రామభద్రుండు | భాగవతం | పీఠిక-18 |
| 36 | ఇంతలు నంతలు. .చంట వెంట | పాండురంగమాహాత్మ్యం | 3 - 29 |
| 46 | నా కుగాదులు లేవు | కృష్ణ పక్షం | పుట 98 |
| 59 | యెంకొక్క దేవత్తై యెలిసె నంటారు | యెంకి పాటలు | పాటేలా ? |
| ,, | అంత శ్రమపడి .. భగీరథుండు | సౌ. ప్ర. యాత్ర | ఫలశ్రుతి |
| 60 | వనరు చేద్వగ లేను . . కొరకై | కృష్ణపక్షం | పుట 95 |

* కృష్ణ పక్షము - ప్రవాసము - ఊర్వశి : 1975 ముద్రణ

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
P.R.I.
Acc. No.
111

| పుట | ఉదాహృత పద్యాదులు | కృతి | వివరం |
|---|---|---|---|
| 60 | 'నేను మాత్రం పెళ్లి చేసుకోలేనా ?' | ప్రతాపరుద్రీయం | అంకం 7 |
| 65 | ఈ పయనపుం దెరువు - | కృష్ణ పక్షం | పుట 93 |
| 66 | ఈ మిడిసిపాటు . . మూగతనాల గొంతు | ,, | ,, 149 |
| ,, | తరు లెక్కి . . నీలంపు నిగ్గునై | ,, | ,, 2 |
| ,, | నవ్వి పోదురుగాక. . నా కేటి వెరపు ? | ,, | ,, 5 |
| 67 | నడిలేని నడిరేయి . . విరుగాజు మ్రోతలే | ,, | ,, 89 |
| ,, | విభావరీ వేలా శాలల . . గుసగుసలు | ,, | ,, 101 |
| ,, | ఆకస మాలోకనముగ. . వీనుగ | ,, | ,, 102 |
| 68 | వైకుంఠ మృదు కంఠ . . జగము లన్నీ దాటి | ,, | ,, 139 |
| ,, | మోహినీ హాసమల్లీ ప్రఫుల్ల రుచి - | ,, | ,, 113 |
| ,, | త్రిజగతీపతి వజ్రాల తురాయి - | ,, | ,, 115 |
| ,, | కలదు నాలోన క్షీర సాగరము నేడు | ,, | ,, 134 |
| 69 | వాడిపోయిన. . బాష్పములు గాగ | ,, | పుట 126 |
| ,, | నిశా నిటలాంత సీమ. . | ,, | ,, 144 |
| 70 | ఎరుగరాని దెదో . . నడలు సడల | ,, | ,, ,, |
| ,, | ఎదురుగా నిల్చి | ,, | ,, 145 |
| ,, | మాయు నిశీథి కుచ్చెళుల | ,, | ,, 146 |
| ,, | ప్రియతమా ! దాసి | ,, | ,, ,, |
| ,, | కోరిక లెల్ల . . మేన నవ ప్రసవాల జాలులే | ,, | ,, ,, |
| 71 | విడని వాసన. . తరుణ వృక్షమ్ము కరణి | ,, | ,, 147 |
| 84 | పొనగ ముత్తెపు సరుల్ . . | కళాపూర్ణోదయం | 1 - 32 |
| 86 | ఆత డున్మత్త భావశాలి . . | కృష్ణపక్షం | పుట 148 |
| ,, | ఇంత విరుగీతి. . | ,, | ,, |
| 95 | ఆకాశము నొసట పొడుచు | మహతి | గీతం 66 |

BCI

AOWA102B119

# కృష్ణశాస్త్రి సాహితి

ఇంతవరకూ పుస్తకరూపంలో రాని
వచన, పద్య, గేయ రచనలు

శ్రీ శ్రీ 'ఆస్వాదానికి ఆహ్వానం' తో
ఇంపైన కూర్పుతీర్పులతో వెలువడుతున్నవి!

– ఇప్పుడు అందిస్తున్నవి –

వ్యాసావళి - 4 సంపుటాలు :
కవి పరంపర, కవితా ప్రశస్తి, మహావ్యక్తులు,
అమూల్యాభిప్రాయాలు

గేయసంహిత – 2 భాగాలు :
అమృత వీణ, మంగళ కాహళి

– త్వరలో రానున్నవి –

మూగ నయాక (రకరకాల రచనలు): 1, 2, 3 & 4
సొంత గొడవలు, పాత కథలు, హితులు సన్నిహితులు,
ఇష్టాగోష్ఠి

కవితాసంకలనం :
బదరిక

శ్రవ్యనాటికలు - 4 సంపుటాలు :
క్షీరసాగరమథనం, అరుణరథం, విద్యాపతి,
కొత్త కోవెల

బాలల పాటలు :
పిల్లల రాజ్యం

వెండి తెర పాటలు – 2
గోరింట

రాజహంస ప్రచురణలు

9, జగదాంబాళ్ వీధి, మద్రాసు - 600 017

## మనమ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B119 |
| పుస్తకం పేరు | కృష్ణశాస్త్రి వ్యాసావళి02 |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | fee |
| వెనుక అట్ట | fee |
| మొత్తం పేజీలు | 133 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | C1, BCT |
| లేని పేజీలు | |
| తయారు చేసినది | M. Raji |
| పేజీలు విడదీసినది | M. Raji |
| స్కాన్ చేసినది | anusha |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |